

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 279

శుక్రవారం 30-12-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఐసీసీ' అవార్డు రేసులో..

టి20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు సూర్యకుమార్, స్మృతి నామినేట్ - 12లో



చివరి గంటలో లాభాలు

మళ్లీ 61 వేల పైకి సెన్సెక్స్.. 18 వేల ఎగువకు నిఫ్టీ - 13లో



నెగెటివ్ తప్పనిసరి

చైనా తదితర దేశాల నుంచి వచ్చే వారు తప్పనిసరిగా కోవిడ్ నెగెటివ్ రిపోర్ట్ సమర్పించాలని భారత్ నిబంధన పెట్టింది.

వివరాలు 6లో ▸



'దగ్గు సిరప్' మరణాలపై దర్యాప్తు

భారత్‌లో తయారు చేసిన దగ్గు సిరప్ వల్ల ఉజ్బెకిస్తాన్‌లో చిన్నారులు మరణించారన్న ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభమైంది.

వివరాలు 6లో ▸



ఉన్న చోటు నుంచి ఓటేయొచ్చు

వలస వెళ్లిన వారు తామున్న చోటు నుంచే తమ నియోజకవర్గాల్లో ఓటేసేందుకు వీలుగా ఆర్‌వీఎంను ఈసీ రూపొందించింది.

వివరాలు 6లో ▸



ఉక్రెయిన్‌పై క్షిపణుల దాడి

మౌలిక వనరులే లక్ష్యంగా రష్యా ఒక్క రోజులో 69 మిస్సైళ్లను ప్రయోగించగా 54 కూల్చివేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పొగమంచుతో విమానాల రాకపోకలకు ఆటంకం



దట్టమైన పొగమంచు వల్ల విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టులో విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన విమానం గాలిలో చక్కర్లు కొట్టి.. తిరిగి వెళ్లిపోయింది.

వివరాలు 5 ▸

కృష్ణపట్నం పోర్టు అరుదైన రికార్డు



అత్యధిక పరిమాణంలో ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేయడం ద్వారా కృష్ణపట్నం పోర్టు రికార్డు సాధించింది. ఎంవీఎస్‌ఎస్ హైరుస్ నౌక ద్వారా 1,68,100 టన్నుల ఇనుప ఖనిజాన్ని చైనాకు ఎగుమతి చేసినట్లు పోర్టు అధికారులు చెప్పారు.

వివరాలు 5 ▸

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పెంపు



ఇంటర్ పబ్లిక్ పరీక్ష ఫీజు(రూ.500 ఆలస్య రుసుముతో), కాలేజీలు అఫిలియేషన్ ఫీజుల చెల్లింపు గడువును జనవరి 4 వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియెట్ బోర్డు గురువారం తెలిపింది.

వివరాలు 14 ▸

లైంగికదాడి నిందితులకు 20 ఏళ్ల జైలు



11 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ విశాఖ కోర్టు తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేసింది.

వివరాలు 5 ▸

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb CHICKEN

సూచించిన నేటి గుడ్లు & చికెన్ వైజాగ్ జోన్ ధరలు

గుడ్ల రిటైల్ ధర ₹ 78 డజన్

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 116 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 138 కిలో

డ్రెస్సింగ్ స్కిన్‌తో 200 కిలో

స్కిన్‌లెస్ 228 కిలో

Conditions Apply



• ఈ 'ఖర్మ'కు

కర్త, క్రియ బాబే!

8 మంది ప్రాణాలు బలిగొన్న చంద్రబాబు ప్రచారార్భాటం

- మీటింగ్ పెడతామని చెప్పింది కందుకూరు ఎన్టీఆర్ సర్కిల్‌లో..
- జనం పలుచగా కనిపించడంతో వాహనాన్ని 50 మీటర్ల దూరంలోని సందులోకి మళ్లించిన బాబు
- 100 అడుగుల రోడ్డులో 62 అడుగుల మేర ఫ్లెక్సీలు
- మిగిలిన 38 అడుగుల రోడ్డులో ఊపిరాడక జనం ఉక్కిరిబిక్కిరి
- ప్రాణాలు కాపాడుకునేందుకు బాబు వాహనం ఎక్కే యత్నం
- హఠాత్తుగా వాహనాన్ని వెనక్కు పోనిచ్చిన డ్రైవర్.. ప్రాణభీతితో పక్కనున్న 15 అడుగుల రోడ్డులోకి వెళ్లిన జనం
- కాలువలో పడిపోయి కొందరు, నలిగి పోయి మరికొందరు దుర్మరణం
- డ్రోన్ కెమెరా షూటింగ్ కోసం కొంప ముంచిన చీప్ ట్రిక్స్

2లో



చంద్రబాబు సభ వాస్తవంగా జరగాల్సిన కూడలి ప్రదేశం ఎన్టీఆర్ సర్కిల్. కానీ జనం పలుచగా ఉండడంతో డ్రోన్ కెమెరాలతో తీసే ఫొటోలలో బాగా కనిపించడానికి గాను అందరినీ ఎదురుగా ఇరుకుగా ఉన్న రోడ్డులోకి తరలించారు. రోడ్‌షో వాహనాన్నీ అటువైపు మళ్లించారు. ఉక్కిరిబిక్కిరైన జనంలో కొందరు ఆ వాహనాన్ని ఎక్కడానికి ప్రయత్నించారు. సిబ్బంది వారిని కిందకు తోసేశారు. ఆ గందరగోళంలో ఏం జరుగుతుందో తెలియని జనం హాహాకారాలు చేస్తూ ఒక్కసారిగా కిందకు పడిపోయారు. చంద్రబాబు ప్రచార కండూతి అలా 8 మంది ప్రాణాలు బలిగొనడానికి కారణమయ్యింది.

ప్రధాని మోదీ, సీఎం జగన్ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున వేర్వేరుగా పరిహారం

10లో

ఈ పాపం చంద్రబాబుదే

- ఆయనపై హత్య కేసు నమోదు చేయాలి
- వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రన్‌వే మీదుగా ఎగురుతున్న విమానం

14లో

'హై'.. రన్‌వే!

బాపట్ల జిల్లా కొరిశపాడు సమీపంలోని హైవేపై విమానాల ట్రయల్ రన్ సక్సెస్

- రన్‌వేపై ఐదు అడుగుల ఎత్తులో ఎగిరిన ఐదు ఎయిర్‌క్రాఫ్ట్‌లు
- రాడార్ సిగ్నల్స్, ల్యాండింగ్‌కు అనువుగా ఉందా, లేదా అని పరిశీలన
- త్వరలోనే ల్యాండింగ్ నిర్వహిస్తామన్న వైమానిక దళ అధికారులు
- ఇది దక్షిణ భారత్‌లోనే తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ సదుపాయం



శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు సూచనలు

- టిటిడి సూచనలు పాటించి భక్తులు సౌకర్యవంతంగా శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం చేసుకోండి.
- వైకుంఠ ద్వారాన్ని 10 రోజుల పాటు తెరచి ఎక్కువ మంది భక్తులకు దర్శనం కల్పించాలని 2020 వ సంవత్సరంలో టిటిడి ధర్మకర్తల మండలి నిర్ణయించింది. దీనివల్ల సుమారు 8 లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించే అవకాశం కలిగింది.
- సర్వదర్శనానికి వచ్చే భక్తులు టైంస్లాట్ టోకెన్లు తీసుకోవడం ద్వారా క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండకుండా దర్శనం చేసుకోవచ్చు. [illegible]
- [illegible] 1. అలిపిరి వద్దగల భూదేవి కాంప్లెక్స్, 2. రైల్వేస్టేషన్ ఎదురుగా గల విష్ణు నివాసం, 3. రైల్వే స్టేషన్ వెనుక గల 2, 3 సత్రాలు, 4. ఆర్‌టిసి బస్టాండు ఎదురుగా గల శ్రీనివాసం కాంప్లెక్స్, 5. ఇందిరా మైదానం, 6. జీవకోన జిల్లా పరిషత్ హైస్కూల్, 7. బైరాగిపట్టెడలోని రామానాయుడు మున్సిపల్ హైస్కూల్, 8.ఎంఆర్ పల్లి జడ్‌పి హైస్కూల్, 9.రామచంద్ర పుష్కరిణి.
- ఈ కౌంటర్లలో జనవరి 2 నుండి 11వ తేదీ వరకు 10 రోజులకుగాను జనవరి 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి 4.50 లక్షల టోకెన్ల కోటా పూర్తయ్యేంత వరకు నిరంతరాయంగా ఇస్తారు. క్యూలైన్లలో భక్తులకు టిఫిన్, అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, టీ ఏర్పాటు చేస్తారు. [illegible]
- టిటిడి వెబ్‌సైట్, ఎస్వీబీసీ ఇతర మాధ్యమాల ద్వారా టికెట్ల లభ్యతను తెలుసుకున్నాకే భక్తులు తిరుమల ప్రయాణాన్ని ఖరారు చేసుకోవాలి.
- తిరుమలలో వసతి గృహాలు పరిమితంగా ఉన్న కారణంగా భక్తులు తమ [illegible] ఇది భక్తుల సౌకర్యం కోసమే చేస్తున్న ఏర్పాటు.
- కోవిడ్ కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున [illegible]
- ఎక్కువ మంది సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడం కోసం [illegible]

- కార్యనిర్వహణాధికారి

ROC No: PR4/13949/Adv.No.325/PRO/2022 Dt: 29.12.2022



కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

నేడు సీఎం నర్సీపట్నం పర్యటన

- ఏలేరు–తాండవ అనుసంధాన పనులకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తద్వారా తాండవ ఆయకట్టు రైతుల దశాబ్దాల కల సాకారం
- 51,465 ఎకరాల స్థిరీకరణతోపాటు కొత్తగా 5,600 ఎకరాలకు సాగునీరు
- ప్రభుత్వ వైద్య కళాశాలకు కూడా శంకుస్థాపన

- వివరాలు 2లో ▸

ఫోరెన్సిక్ వర్సిటీ ఏర్పాటు చేయండి

- తిరుపతిలో క్యాంపస్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించండి
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- ఉచితంగా భూమిని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం
- విభజన, పెండింగ్ అంశాలను పరిష్కరించండి
- ప్రత్యేక హోదాపై సానుకూల నిర్ణయం తీసుకోండి

సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ) ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కోరారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఉచితంగా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణుల కొరతను తీర్చేలా.. జాతీయ ప్రాముఖ్యత దృష్ట్యా ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ బిహేవియరల్ సైన్స్, క్రిమినాలజీ రంగాల్లో పరిశోధనలు నిర్వహించేందుకు ఈ యూనివర్సిటీ

మిగతా 2వ పేజీలో ▶

బ్రహ్మోస్ ప్రయోగం సక్సెస్



భారత రక్షణ రంగం మరింత బలోపేతమయ్యే దిశగా కీలక ముందడుగు పడింది. బ్రహ్మోస్ ప్రయోగం విజయవంతమైంది. సుఖోయ్–30 యుద్ధ విమానం నుంచి ఎక్స్‌టెండెడ్ రేంజ్ క్షిపణిని ప్రయోగించగా.. అది 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని పేల్చేసింది.

- వివరాలు 6లో ▸

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు సీజే




తిరుమలలో శ్రీవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ←



బెజవాడ దుర్గమ్మ ఆలయంలో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా తదితరులు ←

తిరుమల/రేణిగుంట(తిరుపతి జిల్లా)/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/గన్నవరం: సీజేఐ డీవై చంద్రచూడ్ గురువారం ఉదయం తిరుమలలో శ్రీవారిని, శ్రీ వరాహస్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న సీజేఐకి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో(ఎఫ్‌ఏసీ) అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామివారి మహిమను, ఆలయ చరిత్రను అర్చకులు సీజేఐకు వివరించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం సీజేఐ, ఇతర ప్రముఖులకు తీర్థప్రసాదాలు, డ్రైఫ్లవర్ టెక్నాలజీతో రూపొందించిన శ్రీవారి చిత్రపటం, 2023 టీటీడీ క్యాలెండర్, డైరీలను వైవీ సుబ్బారెడ్డి అందజేశారు. అంతకుముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిరుద్ధ బోస్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు కూడా అధికారులు ప్రత్యేక దర్శనం

మిగతా 2వ పేజీలో ▶



కాటన్ ప్రింటు శారీ ₹89	మ్యాజిక్ చెక్ శారీ ₹222	జరీలైన్ బోర్డర్ శారీ ₹298	చందేరి వర్క్ శారీ ₹333
మంజీర పట్టు ~~1430~~ ₹999	కంచి దీపం బుట పట్టు శారీ ~~2150~~ ₹1499	రూపాలి ఫ్యాన్సీ శారీ ~~1995~~ ₹1199	డిజిటల్ ఇండియా ఫ్యాన్సీ శారీ ~~2340~~ ₹1399
అనుపమ కాటన్ శారీ 2 PCS ₹398	జరీన ఫ్యాన్సీ కాటన్ శారీ 2 PCS ₹548	ఇక్కత్ పట్టు 2 PCS ₹2498	పోచంపల్లి పట్టు 2 PCS ₹3198

చున్నీస్ 3 PCS ₹329	క్యూట్ లేడి కుర్తీస్ 3 PCS ₹499	కాటన్ వర్క్ డ్రెస్ మెటీరియల్ 2 PCS ₹698	స్ట్రయిట్ కట్ చుడీదార్ ~~1495~~ ₹898	ఫ్యాన్సీ చుడీదార్ ~~2080~~ ₹1248

బాయ్స్ షర్ట్స్ 2 PCS ₹899	బాయ్స్ ప్యాంట్స్ 2 PCS ₹1299	క్యూట్ గర్ల్స్ టాప్స్ 2 PCS ₹399	హోసరీ కాప్రి 2 PCS ₹449
టీ-షర్ట్స్ 4 PCS ₹499	ట్రెండీ క్యాజువల్స్ 2 PCS ₹999	ప్యాంట్స్ 2 PCS ₹1199	మోడల్ జీన్స్ 2 PCS ₹1399

SR Shopping Mall

క్లుప్తంగా...

ఏపీ తరహా 'ఎస్డీఏ'లు అన్ని రాష్ట్రాల్లోను ఉండాలి

సాక్షి, అమరావతి: ఏపీలాగే అన్ని రాష్ట్రాల్లో ఇంధన పరిరక్షణ కోసం స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ (ఎస్డీఏ)లను ఏర్పాటు చేయాలని కేంద్రానికి పార్లమెంటరీ కమిటీ సూచించింది. ప్రస్తుతం ఏపీ, కేరళ మాత్రమే వీటిని ఏర్పాటు చేశాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఏపీ ఎస్డీఏగా వ్యవహరిస్తోంది. ఇటీవల ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయిలో అవార్డు కూడా అందుకుంది.

చిత్రకారుడు బాలి తనయుడు మంచు తుపానులో మృతి

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): రాష్ట్రానికి చెందిన ప్రముఖ రచయిత, చిత్రకారుడు, బొమ్మల శిల్పి బాలి కుమారుడు మేడిశెట్టి గోకుల్ (45) అమెరికాలో మంచు తుపానులో చిక్కుకుని మరణించాడు. అమెరికాలో గుంటూరుకు చెందిన దంపతులను రక్షించబోయి గోకుల్ ప్రమాదంలో చిక్కుకుని మరణించాడు. ఆ సమయంలో గోకుల్ భార్య శ్రీదేవి, కూతురు మహతి ఒడ్డునే ఉన్నారు. వారి కళ్లెదుటే దుర్ఘటన జరగడంతో వారు కుప్పకూలిపోయారు. గోకుల్ కుటుంబం గత 15 ఏళ్లుగా అమెరికాలో స్థిరపడింది. ఈయన అమెరికాలో ఓ ప్రముఖ బీమా కంపెనీలో అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. గోకుల్ మరణ వార్త తెలియడంతో ఇక్కడ బాలి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. బాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరూ అమెరికాలోనే ఉంటున్నారు.

ప్రత్యేక మంత్రిత్వ శాఖతోనే 'బీసీలకు న్యాయం'

ఢిల్లీలో 'బీసీల మహాదీక్షలు' కార్యక్రమంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య



ధర్నాలో ఆర్.కృష్ణయ్య తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బీసీలకు న్యాయం జరగాలంటే కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉన్నప్పుడే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చర్యలు తీసుకోకపోతే.. దేశంలో తిరుగుబాటు తప్పదని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో 'బీసీల మహాదీక్షలు' చేపట్టారు. ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరైన ఈ దీక్షల్లో మాజీ ఎంపీ వీహెచ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బీసీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టే వరకు బీసీ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపచేస్తామన్నారు. బీసీలకు చట్టసభలలో జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించి రాజ్యాధికారంలో వాటా కల్పించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం లభిస్తుందని చెప్పారు.

నేడు సీఎం నర్సీపట్నం పర్యటన

ఏలేరు-తాండవ అనుసంధాన పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం జగన్



తాండవ జలాశయం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 30న (శుక్రవారం) అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పర్యటించనున్నారు. ఉ.9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి 10.25 గంటలకు నర్సీపట్నం మండలం బలిఘట్టం చేరుకుంటారు. 11.15 నుంచి 12.50 గంటల వరకు జోగునాథునిపాలెం వద్ద నర్సీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన, తాండవ-ఏలేరు ఎత్తిపోతల పథకం కాలువల అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఆ తర్వాత మ.1.25కు తిరుగు ప్రయాణమై తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ఏలేరు-తాండవ అనుసంధానానికి నేడు శ్రీకారం

తన పర్యటనలో భాగంగా.. ఏలేరు, తాండవ ప్రాజెక్టుల అనుసంధానానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. రూ.470.05 కోట్లతో చేపట్టిన ఈ అనుసంధానం పనులకు శుక్రవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆయన శంకుస్థాపన చేస్తారు. ఏలేరు ఎడమ కాలువను తాండవ కాలువతో అనుసంధానం చేయడం ద్వారా కొత్తగా 5,600 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు తాండవ ప్రాజెక్టు కింద 51,465 ఎకరాలను స్థిరీకరించనున్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేసేందుకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తిచేయాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్.. గోదావరి జలాలను 8 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా రూ.17,411.40 కోట్లతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని చేపట్టారు. తాజాగా.. ఏలేరు-తాండవ అనుసంధానం చేపట్టడం ద్వారా ఉత్తరాంధ్రలో సాగునీటి సదుపాయాలను మరింత మెరుగుపర్చి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడంలో సీఎం మరో అడుగు ముందుకేశారని రైతులు, నీటిపారుదలరంగ నిపుణులు ప్రశంసిస్తున్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలకు కూడా..

ఇక రాష్ట్రంలో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం వడివడిగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా.. నర్సీపట్నం వైద్య కళాశాలకు కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. అనకాపల్లి జిల్లా మాకవారిపాలెం మండలం భీమబోయినపాలెంలో 52.15 ఎకరాల్లో ఈ వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో బోధనాస్పత్రి, వైద్య, నర్సింగ్ కళాశాలలు, వైద్య విద్యార్థుల హాస్టళ్లు, ఇతర నిర్మాణాలను అత్యాధునిక వసతులతో చేపట్టనున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి రూ.16వేల కోట్లకు పైగా అంచనాలతో నాడు-నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏకంగా 17 నూతన వైద్య కళాశాలల నిర్మాణంతోపాటు ప్రస్తుతమున్న 11 వైద్య కళాశాలలు, ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నారు. నిజానికి.. రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లా చేసి ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఉండేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఆ మేరకు 16 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం 26 జిల్లాలను ఏర్పాటుచేసింది. కానీ, కొత్తగా ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఉండటంలేదని సీఎం గుర్తించారు. ఈ జిల్లాలో కొత్త వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న వైద్య కళాశాలల సంఖ్య 17కు చేరింది. ఇందులో మచిలీపట్నం, నంద్యాల, రాజమండ్రి, విజయనగరం, ఏలూరు జిల్లా ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా ఇప్పటికే అభివృద్ధి చేశారు.

ఫోరెన్సిక్ వర్సిటీ ఏర్పాటు చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు ఎంతో అవసరమని సీఎం వివరించారు. దేశంలో ప్రపంచ స్థాయి విద్యను అందించడంతో పాటు, దేశ వ్యాప్తంగా క్రిమినల్ జస్టిస్ ఇన్‌స్టిట్యూట్‌లను బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, ఇందులో భాగంగా గుజరాత్‌లోని గాంధీనగర్ కేంద్రంగా ఇప్పటికే నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. దీంతోపాటు ఢిల్లీ, గోవా, త్రిపురలో కూడా క్యాంపస్‌లు స్థాపించిందని గుర్తు చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రెండవ రోజు గురువారం ఉదయం ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో 25 నిమిషాల పాటు భేటీ అయ్యారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు విన్నవించిన అంశాలు సహా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన పలు విషయాల గురించి అమిత్ షాతో చర్చించారు. రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లు గడిచినప్పటికీ, విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో చాలా వరకు ఇప్పటికీ నెరవేర్చలేదని వివరించారు. రెండు రాష్ట్రాల మధ్య కీలక అంశాలు ఇంకా పరిష్కారం కాలేదని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

రూ.6,886 కోట్ల విద్యుత్ బకాయిలు ఇప్పించండి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పనపై ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం.. అమిత్‌షాను కోరారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా ఆవశ్యకమని పునరుద్ఘాటించారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన రూ.6,886 కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే ఇప్పించాలని కోరారు. కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంటుకు సరిపడా ముడి ఖనిజాన్ని అందుబాటులో ఉంచడానికి ఏపీఎండీసీకి గనులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో 76.9 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, ఈ ప్రాజెక్టుకు కావాల్సిన సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఒప్పందాలను ఉల్లంఘిస్తున్న తెలంగాణ

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు సంబంధించి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లకు సంబంధించిన పలు అంశాలను అమిత్ షాకు ముఖ్యమంత్రి వివరించారు. కృష్ణానదిపై ఉన్న ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అన్ని ఆపరేషనల్ ప్రొటోకాల్స్‌ను, ఒప్పందాలను, ఆదేశాలను ఉల్లంఘిస్తోందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అనధికారికంగా, ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండానే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (3టీఎంసీలు), దిండి పథకాలను 800 అడుగుల వద్ద నిర్మిస్తున్న విషయం గురించి ఇదివరకే కేంద్రం దృష్టికి తెచ్చామని చెప్పారు.



కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

> ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ బిహేవియరల్ సైన్స్, క్రిమినాలజీ రంగాల్లో పరిశోధనలు మరింతగా ఊపందుకోవాలి. ఈ దిశగా గుజరాత్‌లో ఎన్ఎఫ్ఎస్‌యూ వర్సిటీ.. ఢిల్లీ, గోవా, త్రిపురలో ఇప్పటికే క్యాంపస్‌లు ఏర్పాటయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఆ రంగాలు మరింత బలోపేతమవ్వడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం చేకూర్చే దిశగా మరిన్ని అడుగులు ముందుకు పడతాయి.
>
> 2014–15కు సంబంధించి రూ.18,330.45 కోట్ల బిల్లులు, 10వ వేతన సంఘం బకాయిలు, పెన్షన్లు మొదలైన వాటి రూపేణా మొత్తంగా రూ.32,625.25 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వెంటనే విడుదల చేయాలి. పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2,937.92 కోట్ల సొంత నిధులు ఖర్చు చేసింది. ఈ డబ్బును రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చెల్లించలేదు. ఇప్పటికైనా ఇచ్చేలా వెంటనే చర్యలు తీసుకోగలరు.
>
> - కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సీఎం వైఎస్ జగన్

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు సీజే



తిరుమలలో సీజేఐ దంపతులకు లడ్డూ ప్రసాదాలు అందజేస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాట్లు చేసి వేదాశీర్వచనాలు అందించారు. కాగా మూడు రోజుల తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని వెళ్తున్న సీజేఐ డీవై చంద్రచూడ్‌కు గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణరావు, చిత్తూరు ఉమ్మడి జిల్లా జడ్జి జస్టిస్ భీమారావు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

దుర్గమ్మ సేవలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సీజేఐ డీవై చంద్రచూడ్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ హరిజవహర్‌లాల్, ఆలయ ఈవో భ్రమరాంబ సాదర స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ మర్యాదలతో అర్చకులు సీజేఐను స్వాగతించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న సీజేఐ డీవై చంద్రచూడ్‌కు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, పట్టువస్త్రాలను మంత్రి కొట్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణరావు, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు. కాగా దర్శనానికి ముందు సీజేఐ డీవై చంద్రచూడ్‌కు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన తిరుపతి నుంచి సాయంత్రం 6.45 గంటలకు గన్నవరం చేరుకున్నారు. విమానాశ్రయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, జ్యుడిషియల్ అకాడమీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ జాషువా, ఎయిర్‌పోర్ట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ పీవీ రామారావు, పలువురు హైకోర్టు, జిల్లా కోర్టు న్యాయమూర్తులు, జ్యుడిషియల్ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం సీజేఐ డీవై చంద్రచూడ్ రోడ్డు మార్గంలో విజయవాడ చేరుకున్నారు.



సుప్రీంకోర్టు సీజేతో సీఎం జగన్ భేటీ

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం విజయవాడ నోవాటెల్ హోటల్‌లో ఆయనను కలిసిన సీఎం జగన్ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రతిమను అందజేశారు.

వైద్య సేవలు సంతృప్తికరమేనా?

- చికిత్స అనంతరం రోగుల నుంచి అభిప్రాయ సేకరణ
- ప్రారంభించిన రాష్ట్ర వైద్య శాఖ

సాక్షి, అమరావతి: 'ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు సంతృప్తికరమేనా? వసతులు బాగున్నాయా? డాక్టర్లు తగిన సమయం కేటాయించారా?..' అంటూ రాష్ట్ర వైద్య శాఖ రోగుల నుంచి అభిప్రాయ సేకరణను ప్రారంభించింది. వారి అభిప్రాయాలకు అనుగుణంగా.. మరింత నాణ్యమైన సేవలందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించింది. ఈ అభిప్రాయ సేకరణ కోసం ఒక వెబ్ అప్లికేషన్‌ను రూపొందించింది. ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స తీసుకొని.. ఇంటికి వెళ్లిన రోగులకు అదే రోజు సాయంత్రంలోగా అప్లికేషన్ లింక్‌ను మొబైల్ ఫోన్‌కు టెక్స్ట్ మెసేజ్ పంపిస్తారు. ఆ లింక్‌పై క్లిక్ చేస్తే వెబ్ అప్లికేషన్‌లోకి వెళ్తారు. అక్కడ 10 ప్రశ్నలు ప్రత్యక్షమవుతాయి. ప్రతి ప్రశ్నకు మూడు ఆప్షన్‌లు ఉంటాయి. ఆస్పత్రికి చేరుకున్న తర్వాత మీరు డాక్టర్‌ను కలవడానికి ఎంత సమయం వేచి ఉన్నారు? డాక్టర్ కోసం వేచి ఉన్న సమయంలో మీరు కూర్చోవడానికి కుర్చీలు ఉన్నాయా? చికిత్స సమయంలో డాక్టర్ మీ అనారోగ్య వివరాలు, లక్షణాలు అర్థం చేసుకోవడానికి తగిన సమయం కేటాయించారా? మీ సమస్య గురించి చెప్పేటప్పుడు డాక్టర్, నర్స్‌లు వింటున్నట్టు అనిపించిందా? శరీర పరీక్షలు చేస్తున్నప్పుడు వేరే వారికి కనపడకుండా అడ్డుగా కర్టెన్ వేశారా?.. ఇలా వైద్య సేవలు, రోగి గోప్యత, ఆస్పత్రిలో సౌకర్యాలపై పది ప్రశ్నల ద్వారా అభిప్రాయం సేకరిస్తారు. 10 ప్రశ్నలకు 11 పాయింట్‌లు ఉంటాయి. అభిప్రాయాల ఆధారంగా 0–4 పాయింట్లు వస్తే బిలో యావరేజ్, 4–8 పాయింట్లు వస్తే యావరేజ్, 8–10 పాయింట్లు వస్తే గుడ్, 11 పాయింట్‌లు వస్తే ఎక్సలెంట్ అని ఆస్పత్రులకు గ్రేడింగ్ ఇస్తారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో ఒక డ్యాష్‌బోర్డును కూడా అందుబాటులోకి తెస్తున్నారు. బిలో యావరేజ్, యావరేజ్ గ్రేడింగ్ ఉన్న ఆస్పత్రుల్లో.. ఏ అంశాల్లో రోగులు అసంతృప్తిగా ఉన్నారో మెడికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లకు అలర్ట్ వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు డ్యాష్ బోర్డును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉంటారు.

ఈ 'ఖర్మ'కు కర్త, క్రియ చంద్రబాబే!

8 మంది ప్రాణాలు బలిగొన్న ప్రచారార్భాటం

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రచారార్భాటం మరోసారి సామాన్యుల ప్రాణాలు హరించింది. లేని ప్రజాదరణను ఉన్నట్టుగా కనికట్టు చేసేందుకు వేసిన చవకబారు ఎత్తుగడ అమాయకుల పాలిట యమపాశమైంది. చిన్నపాటి సభకు వచ్చిన జనాన్ని అంతకంటే ఎక్కువగా చూపించేందుకు చేసిన చీప్ ట్రిక్ 8 మందిని బలితీసుకుంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో టీడీపీ బహిరంగ సభ నిర్వహించేందుకు తొలుత నిర్ణయించిన విశాలమైన ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్న చంద్రబాబుకు అక్కడ జనం పలుచగా కనిపించారు. దీంతో డ్రోన్ కెమెరాల షూటింగ్‌లో జనం కిక్కిరిసినట్టు కనిపిస్తారన్న ఎత్తుగడతో బాబు వెంటనే తన వాహనాన్ని ఎదురుగా ఉన్న ఇరుకు ప్రదేశంలోకి పోనిచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్నవారిని కూడా ఆ ఇరుకు సందు వద్దకు తరలించారు. దీంతో అప్పటికే ఆ ఇరుకు రోడ్డులో ఉన్న వారు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఒకరి మీద ఒకరు పడిపోయి, అమాయక జనం హాహాకారాలు చేస్తుంటే.. చంద్రబాబు వాహనం ఉన్నట్లుండి కొంచెం వెనక్కి వెళ్లింది. అక్కడ మరింత గందరగోళం చోటుచేసుకుంది. ఏం జరుగుతుందో తెలియక ప్రాణ భయంతో ఎవరంతకు వారు అక్కడినుంచి బయట పడాలనే ఆతృతే 8మంది మృతికి కారణమైంది.

ఎన్టీఆర్ సర్కిల్‌లో సభ ఎందుకు పెట్టలేదు?

ముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కందుకూరులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో బుధవారం రాత్రి చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించాలి. ఈ మేరకు చంద్రబాబు ప్రైవేటు కార్యదర్శి ఆర్.కృష్ణ కాపర్తి ముందుగా విడుదల చేసిన పర్యటన షెడ్యూల్‌లో స్పష్టంగా తెలిపారు. దాంతో పోలీసులు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అక్కడ నాలుగు వైపులా కాస్త విశాలంగా ఉంటుంది. దాంతో బహిరంగ సభ నిర్వహణ సజావుగా సాగుతుందని అంతా భావించారు. కందుకూరులోని టీడీపీ శ్రేణులు ముందుగానే ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నాయి. కానీ తన ప్రచార వాహనంలో బుధవారం రాత్రి 7.30 గంటలకు కందుకూరు ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్న చంద్రబాబు.. అక్కడ జనం తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. కందుకూరులో జనం ఎక్కువగా రారని టీడీపీకి ముందుగానే తెలుసు. అందుకే ఇతర ప్రాంతాల నుంచి తరలించిన జనం చంద్రబాబు వాహనాన్ని అనుసరిస్తూ వచ్చేలా చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో సభ నిర్వహిస్తే జనం తక్కువగా ఉన్నారనే విషయం వెల్లడవుతుందని చంద్రబాబు భావించారు. అక్కడకు 50 మీటర్ల దూరంలో రోడ్డు కాస్త ఇరుకుగా ఉన్నట్టు గమనించిన చంద్రబాబు.. తన వాహనాన్ని అక్కడకు తీసుకువెళ్లాలని చివరి నిమిషంలో డ్రైవర్‌ను ఆదేశించినట్టు సమాచారం. దాంతో ఎన్టీఆర్ సర్కిల్‌లో నిలపాల్సిన వాహనాన్ని డ్రైవర్ మరో 50 మీటర్లు ముందుకు తీసుకువెళ్లి ఇరుకుగా ఉన్న రోడ్డులో నిలిపారు.


From
Sri R. Krishna Kaparthi,
Private Secretary to LoP, APLA, Govt. of AP.
Tour Programme of Sri Nara Chandrababu Naidu, Leader of Opposition, AP Legislative Assembly, Govt. of Andhra Pradesh to Nellore District, AP on 28.12.2022 to 31.12.2022

Time	Arr. / Dep.	Programme
28.12.2022 (Wed)		
10.00 PM	Dep.	Residence, Undavalli Village, Tadepalli Mandal, Guntur District. (By Road)
04.00 PM	Arr.	[illegible]
04.00 to 05.15 PM		Road Show (Via: [illegible])
05.15 to 07.00 PM		Public Meeting at NTR Circle
07.00 PM	Dep.	NTR Circle, Kandukur Town (By Road)
07.30 PM	Arr.	[illegible], Kandukur Town
		Night Halt
29.12.2022 (Thu)		
03.00 PM	Dep.	[illegible], Kandukur Town (By Road)
04.30 PM	Arr.	[illegible], Kavali Town
04.30 to 05.30 PM		Road Show ([illegible])
05.30 to 07.00 PM		Public Meeting at Near RTC Center, Kavali Town
07.00 PM	Dep.	Near RTC Centre, Kavali Town (By Road)
07.15 PM	Arr.	[illegible], Kavali Town
		Night Halt

Contd..2

కందుకూరులోని ఎన్టీఆర్ సర్కిల్‌లోనే సభ నిర్వహిస్తామంటూ చంద్రబాబు ప్రైవేటు కార్యదర్శి కృష్ణ ఇచ్చిన షెడ్యూల్

పూల మాల వేసేందుకు నిలిపినా సరిపోయేది

ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూల మాల వేసి నివాళి అర్పించాలి. విగ్రహం వద్ద వాహనం నిలిపి ఉంటే అక్కడ ఉన్న జనంతోపాటు వాహనం వెంట ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన జనం నలువైపులా సర్దుకునేందుకు అవకాశం ఉండేది. అనంతరం చంద్రబాబు వాహనాన్ని ఎదురుగా 50 మీటర్లు ముందుకు పోనిచ్చినా సరిపోయేది. అప్పటికే ఎక్కడికక్కడ సర్దుకున్న జనం.. ఉన్న చోటు నుంచే చంద్రబాబు ప్రసంగాన్ని వినేవారు. కానీ అలా చేస్తే వాహనం చుట్టూ జనం భారీగా ఉన్నట్టు కనిపించరని చంద్రబాబు భావించారు. అందుకే ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేయడాన్ని కూడా రద్దు చేసుకుని, తన వాహనాన్ని ముందుకు పోనిచ్చారు.



కందుకూరులో చంద్ర బాబు సభ నిర్వహించాల్సిన ఎన్టీఆర్ సర్కిల్(కింద)
చివరి నిముషంలో 50 అడుగులు ముందుకు వెళ్ళి సభ నిర్వహించిన ప్రదేశం(పైన)

మిగిలింది 38 అడుగులే

నిజానికి చంద్రబాబు వాహనం నిలిపింది 100 అడుగుల రోడ్డు. కానీ ఆయన పర్యటన కోసం టీడీపీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలతో ఆ రోడ్డును ఆక్రమించేశారు. రోడ్డుకు అటూ 30 అడుగులు, ఇటు 30 అడుగుల మేర ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటితోపాటు పెద్ద పెద్ద సౌండ్ బాక్సులు పెట్టారు. దాంతో రాకపోకలకు కేవలం 38 అడుగుల రోడ్డే మిగిలింది. (కందుకూరు మున్సిపల్ అధికారులు గురువారం ఆ రోడ్డులో కొలతలు కొలిచారు. ఫ్లెక్సీలు, సౌండ్ బాక్సులు పోగా మిగిలింది 38 అడుగుల రోడ్డే) అందులో కూడా టీడీపీ నేతలు అడ్డదిడ్డంగా బైకులు పార్క్ చేశారు. అలాంటి ప్రాంతంలోకి చంద్రబాబు వాహనం వచ్చి నిలుచొంది. చంద్రబాబు వాహనం ఎన్టీఆర్ సర్కిల్‌ను దాటి ఎదురుగా ప్రయాణించడంతో ఆ ప్రదేశంలో ఉన్న జనం వాహనంతోపాటు ముందుకు కదిలారు. అప్పటికే అక్కడ ఉన్న జనంతోపాటు వాహనాన్ని అనుసరించి వచ్చిన వారు, వెనుక ఉన్న వారితో ఆ ప్రాంతం ఇబ్బందికరంగా మారింది.

దుర్ఘటనకు దారితీసిందిలా..

కేవలం 38 అడుగుల రోడ్డులో చంద్రబాబు వాహనం నిలపడంతో అప్పటికే ఉన్న జనానికి వాహనంతో పాటు వచ్చిన వారు తోడయ్యారు. ఒక్కసారిగా జనం గుమిగూడటంతో ఊపిరి తీసుకునేందుకు కూడా సాధ్యం కాక హాహాకారాలు చేశారు. ప్రాణభయంతో అక్కడి నుంచి బయట పడటానికి ఎవరికివారు యత్నించారు. ఇందులో భాగంగా కొందరు చంద్రబాబు వాహనం ఎక్కేందుకు యత్నించగా, చంద్రబాబు వ్యక్తిగత సిబ్బంది అనుమతించలేదు. పరిస్థితిని గమనించి, చంద్రబాబు తక్షణమే స్పందించనూ లేదు. పైగా డ్రైవర్ వాహనాన్ని కొంచెం వెనక్కు జరపడంతో వెనుక ఉన్న వారు బెంబేలెత్తిపోయారు. ఏం జరుగుతుందో తెలీక భయంతో కేకలు వేశారు. ప్రాణాలు కాపాడుకునేందుకు ఒక్కసారిగా వారూ వేగంగా వెనక్కి జరగడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. కొందరు ఆ ప్రదేశంలో పార్క్ చేసిన బైకులపై పడ్డారు. దీంతో జనం ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరవుతూ సమీపంలోని గుండంకట్ట వీధిలోకి చేరారు. ఆ వీధి కేవలం 15 అడుగుల వెడల్పు మాత్రమే ఉంది. పక్కనే కాలువ ఉంది. చంద్రబాబు వాహనం చుట్టూ ఉన్న జనం అప్పటికే ఆ వీధిలోకి చొచ్చుకు రావడంతో పలువురు కాలువలో పడిపోయారు. మరికొందరు నలిగిపోయారు. దీంతో మొత్తంగా 8 మంది మృత్యువాత పడగా, మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు.



ఘటన సమయంలో ప్రాణ భయంతో చంద్రబాబు వాహనం పైకి ఎక్కడానికి ప్రయత్నిస్తున్న జనం

నాడు గోదావరి పుష్కరాల్లో 29 మంది దుర్మరణం

గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాల సమయంలోనూ అదే రీతిలో వ్యవహరించి 29 మంది మృతికి కారణమయ్యారు. తాను పుష్కర స్నానం చేస్తున్నప్పుడు చుట్టూ భారీగా జనం ఉన్నట్టుగా వీడియోలు చిత్రీకరించాలని ఆయన భావించారు. అందుకోసం సినీ దర్శకుడు బోయపాటి నేతృత్వంలో ఏకంగా సినిమా షూటింగ్ స్థాయిలో హడావుడి చేశారు. అంత భారీ స్థాయిలో జనం రావడం కష్టమని భావించి, పుష్కర ఘాట్ల గేట్లను కొన్ని గంటలపాటు మూసి వేశారు. దాంతో గేట్ల వద్దకు జనం భారీగా చేరుకోగానే, ఒక్కసారిగా గేట్లు తీశారు. వారంతా నీటిలో స్నానం చేయడానికి పరుగెత్తి వస్తుంటే.. తనను చూసేందుకే వారు అలా వస్తున్నారనేలా చిత్రీకరించాలన్నది బాబు ఎత్తుగడ. దాంతో తొక్కిసలాట జరిగి 29 మంది దుర్మరణం చెందారు.



గోదావరి పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాటలో మృతదేహాలు(ఫైల్)

క్లుప్తంగా...

అవినీతి ఎంవీఐ అరెస్ట్

- రూ.3.22కోట్ల అక్రమ ఆస్తులను గుర్తించిన ఏసీబీ



విజయవాడలోని మృత్యుంజయ రాజు ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి, అమరావతి: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏలూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) ఎర్లపాటి మృత్యుంజయ రాజును ఏసీబీ అధికారులు గురువారం అరెస్టుచేశారు. అంతకుముందు ఏలూరుతోపాటు విజయవాడలోని మృత్యుంజయరాజు, ఆయన కుటుంబ సభ్యుల నివాసాల్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ప్రభుత్వ విలువ ప్రకారం ఆయన రూ.3.84కోట్ల ఆస్తులు కలిగి ఉన్నట్లు.. వాటిలో రూ.3.22కోట్ల ఆస్తులు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించారు. విజయవాడ పటమట ప్రాంతంలో ఓ నివాస గృహం, విజయవాడ పంటకాలువ రోడ్డులో ఓ నాలుగు అంతస్తుల భవనం, విజయవాడ మొగల్రాజుపురంలోని ఓ అపార్టుమెంటులో నాలుగో అంతస్తు మొత్తం, కృష్ణాజిల్లా కపిలేశ్వరపురంలో 7.8 ఎకరాలతోపాటు భారీగా బంగారు ఆభరణాలు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దర్యాప్తు అనంతరం మృత్యుంజయరాజును ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరుస్తామని వివరించారు.

ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు భూముల పరిశీలన



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న నీరజ్‌కుమార్

గుడ్లూరు: నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలోని జాతీయ రహదారి పక్కన తెట్టు–శాంతినగర్ గ్రామాల మధ్య ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు భూములను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సీఈవో నీరజ్‌కుమార్ గురువారం పరిశీలించారు. భూముల రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించి భూములకు నాలుగు వైపులా తిరిగి హద్దులు చూశారు. నీరజ్‌కుమార్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నందున వాటికి దగ్గరలో ఎయిర్‌పోర్ట్ ఉండాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు తెట్టు–శాంతినగర్ గ్రామాల మధ్య అటవీ శాఖకు చెందిన 2,024 ఎకరాల భూములను పరిశీలించినట్లు తెలిపారు. పెద్ద కార్గో విమానాలు దిగడానికి అనుకూలంగా 1.5 కిలోమీటర్ల నుంచి 2 కిలోమీటర్లు అదనంగా రన్‌వేను పెంచి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. సీఈవో వెంట ఆంధ్రప్రదేశ్ అర్బన్ అథారిటీ ఎండీ శ్రీనివాస్ ఉన్నారు.

గుజ్జు కలపకు మంచి ధర

యూకలిప్టస్, సరుగుడు, సుబాబుల్ రైతుల్లో ఆనందం

సాక్షి, అమరావతి: సుబాబుల్, యూకలిప్టస్, సరుగుడు వంటి గుజ్జు కలప సాగుదారులకు మంచి రోజులొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం కృషి ఫలితంగా రికార్డు స్థాయిలో ధరలు పలుకుతున్నాయి. ముందెన్నడూ లేనివిధంగా కంపెనీలు పోటీపడి నేరుగా రైతు క్షేత్రాల వద్దే గుజ్జు కలపను కొంటున్నాయి. రాష్ట్రంలో 1,04,985 మంది రైతులు 3,28,954 ఎకరాల్లో సుబాబుల్, యూకలిప్టస్, సరుగుడు తోటల్ని సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల టన్ను రూ.1,600 నుంచి రూ.1,800 వరకు మాత్రమే పలికేది. ఫలితంగా వాటిని పండించే రైతులకు కనీస ఖర్చులు కూడా వచ్చేవి కాదు. ఈ నేపథ్యంలో గుజ్జు కలపకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్ల క్రితం మంత్రుల కమిటీని నియమించింది. ఈ కమిటీ కృషితో 2019–20లో 4.35 లక్షల మెట్రిక్ టన్నులు, 2020–21లో 1.38 లక్షల టన్నులు, 2021–22లో 5.60 లక్షల టన్నుల చొప్పున గిట్టుబాటు ధరలకే గుజ్జు కలపను కంపెనీలు కొనుగోలు చేశాయి.

ఫలించిన ప్రభుత్వ కృషి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కాగితం తయారీ కంపెనీలు, రైతులతో పలు దఫాలుగా జరిపిన చర్చలు ఫలించాయి. గత ప్రభుత్వ హయాంలో ఏకపక్షంగా ధరలు నిర్ణయించడం, వాటి



అమలు కోసం ఒత్తిడి చేయడంతో కంపెనీలు ఒక్కొక్కటిగా రాష్ట్రానికి దూరమయ్యాయి. ఇప్పుడు కంపెనీలు, రైతుల సమన్వయంతో గిట్టుబాటు ధర నిర్ణయించడంతో పాటు కొనుగోలుకు సుహృద్భావ వాతావరణం కల్పించడంతో పొరుగు రాష్ట్రాల కంపెనీలు ఇక్కడి కలపను కొనుగోలు చేసేందుకు క్యూ కడుతున్నాయి. కొత్త కంపెనీల రాకతో పోటీపెరిగి ధరలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిన్న మొన్నటి వరకు రాజమండ్రి, భద్రాచలం, బల్లార్‌పూర్ పేపర్ మిల్లులు మాత్రమే రాష్ట్రంలో గుజ్జు కలప కొనుగోలు చేసేవి. ఇప్పుడు ఏపీతోపాటు కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 20కు పైగా కంపెనీలు మన రాష్ట్రంలోని గుజ్జు కలప కొనుగోలు చేసేందుకు పోటీపడుతున్నాయి. 15 ఏళ్ల క్రితం కొనుగోళ్లు నిలిపివేసిన గ్రాషిం ఇండస్ట్రీస్, వెస్ట్ కోస్ట్(కర్ణాటక), జేకే సిర్పూర్ (తెలంగాణ), జేకేసీ (గుజరాత్), శేషసాయి (తమిళనాడు), ఓరియంట్ (మధ్యప్రదేశ్) పేపర్ మిల్లులతో పాటు తొలిసారి 10కి పైగా ప్లేవుడ్ కంపెనీలు సైతం గుజ్జు కలప కొంటున్నాయి. నాణ్యత, ప్రాంతాలను బట్టి టన్ను సుబాబుల్ రూ.2,400 నుంచి రూ.3,200, యూకలిప్టస్ రూ.2,900 నుంచి రూ.3,500 వరకు చెల్లిస్తున్నారు. ఇక సరుగుడు కలపను రికార్డు స్థాయిలో రూ.6 వేల నుంచి రూ.6,500కు కొనుగోలు చేస్తున్నారు.

సీఎం కృషి వల్లే..

గత ప్రభుత్వ హయాంలో సుబాబుల్ రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీస గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోయారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడం, కంపెనీలు, రైతులతో పలు దఫాలు చర్చలు జరపడంతో రాష్ట్రానికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. రైతులకు మంచి ధర లభిస్తోంది. రానున్న ఆరు నెలల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖమంత్రి

శ్రీసిటీని సందర్శించిన జాగృతి యాత్ర బృందం

- యాత్రలో పాల్గొన్న 600 మంది సభ్యులు



మాట్లాడుతున్న శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): దేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాలకు చెందిన సుమారు 600 మంది జాగృతి యాత్ర బృందం సభ్యులు గురువారం శ్రీసిటీని సందర్శించారు. యువ పారిశ్రామికవేత్తలను తయారుచేసే లక్ష్యంతో జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతి సంవత్సరం జాగృతి యాత్రను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ప్రత్యేక రైలులో ఈ నెల 25వ తేదీన ముంబై నుంచి ప్రారంభమైన జాగృతి యాత్ర గురువారం ఉదయం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అక్కడి నుంచి బస్సుల్లో శ్రీసిటీకి చేరారు. బృందం సభ్యులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. కోవిడ్ కారణంగా రెండేళ్ల విరామం తర్వాత జాగృతి యాత్ర బృందం శ్రీసిటీకి రావడం ఆనందంగా ఉందని రవీంద్ర అన్నారు. ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగాలన్న భారతదేశ ఆశయానికి ఊతమిస్తూ, భారీగా ఉద్యోగాల కల్పనతో అత్యంత అనుకూల వ్యాపార నగరాల్లో ఒకటిగా రూపుదిద్దుకున్న శ్రీసిటీని జాగృతి యాత్ర తమ దర్శనీయ స్థలాల్లో చేర్చడం, ఐదోసారి సందర్శనకు రావడం అత్యంత గౌరవంగా భావిస్తున్నామని చెప్పారు. అనంతరం శ్రీసిటీ ప్రత్యేకతల గురించి ఆయన వివరించారు. శ్రీసిటీ సందర్శనకు అవకాశం కల్పించిన యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈవో అశుతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బాలికను వేధించిన జనసేన నేత అరెస్ట్

- 15 రోజులుగా వేధిస్తున్న రాఘవరావు
- చాకుతో దాడిచేసేందుకు యత్నించినట్లు వెల్లడించిన విశాఖ తూర్పు ఏసీపీ

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు)/సాక్షి, అమరావతి: జనసేన విశాఖ తూర్పు నియోజకవర్గ నాయకుడిగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న రాఘవరావు ఒక బాలికను వేధిస్తున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ బాలికపై వేధింపులకు సంబంధించి వీడియోలు వైరల్ కావడంతో రాఘవరావుపై విశాఖ 3వ పట్టణ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. విశాఖలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తూర్పు జోన్ ఏసీపీ మూర్తి ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. చినవాల్తేర్‌లోని కొటాక్ స్కూల్ దరి ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్న రాఘవరావు కొంతకాలంగా ఆ బాలికను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. 15 రోజులుగా వాట్సాప్‌లో అసభ్య మెసేజ్‌లు పెట్టడంతోపాటు ప్రేమించాలంటూ ఒత్తిడి చేస్తున్నాడు. బుధవారం ఆ బాలిక స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకలు చేసుకుంటుండగా రాఘవరావు మద్యం తాగి అక్కడికి వెళ్లి గొడవకు దిగాడు. ఫ్లాట్‌లో నుంచి ఆ బాలికను బయటకు రావాలని ఒత్తిడి చేశాడు. చాకు చూపించి బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన ఆ బాలిక స్నేహితులు, కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు అతడిని వారించేందుకు ప్రయత్నించారు. ఈ పెనుగులాటలో బాలికకు స్వల్పగాయాలయ్యాయి. లైంగిక వేధింపులు,



రాఘవరావు

అసభ్య మెసేజ్‌లు, చాకుతో దాడి అంశాలకు సంబంధించి రాఘవరావుపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఏసీపీ మూర్తి తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఈ సమావేశంలో త్రీటౌన్ సీఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ సీరియస్

జనసేన పార్టీ విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ నాయకుడు రాఘవరావు బాలికను వేధించడంపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె గురువారం విశాఖ నగర పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. బాలికను వేధించిన రాఘవరావుపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాఘవరావు పలుకుబడి కారణంగా తమకు హాని కలుగుతుందనే భయంతో ఉన్న బాలిక కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలో అర్ధరాత్రి ఇంటికి వెళ్లి సుత్తితో తల్లి, ఇద్దరు కూతుళ్లపై దాడి ఘటన మరవక ముందే విశాఖ జనసేన నేత రాఘవరావు వేధింపుల పర్వం దారుణమన్నారు. ఈ సంఘటనలపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ స్పందించాలని వాసిరెడ్డి పద్మ డిమాండ్ చేశారు.

జల క్రీడల్లో గాయత్రి, అచ్యుత్‌కు రజత పతకాలు



అచ్యుత్‌కుమార్



గాయత్రి

సాక్షి, అమరావతి: పదో జూనియర్ జాతీయ కానో స్లాలోమ్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో రాష్ట్రానికి చెందిన నాగిడి గాయత్రి, పురుషుల సింగిల్స్‌లో వేముల అచ్యుత్‌కుమార్ రజత పతకాలు సాధించినట్టు రాష్ట్ర కానోయింగ్, కయాకింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.బలరామ్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన వాటర్ స్పోర్ట్స్ జూనియర్ చాంపియన్‌షిప్, ఖేలో ఇండియా ఏషియన్ గేమ్స్, ఒలింపిక్ చాంపియన్‌షిప్ అర్హత పోటీల్లో ఏపీ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారన్నారు. ఖేలో ఇండియాకు పతకాలు సాధించిన గాయత్రి, అచ్యుత్‌తో పాటు కొల్లకాని విష్ణు, నాగిడి భార్గవి కూడా అర్హత సాధించినట్టు తెలిపారు.

తెలంగాణ

పెట్రోల్ పోసుకుని.. నిప్పంటించుకుని..

- ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య– మృతురాలిది గుంటూరు జిల్లా గురజాల

జగద్గిరిగుట్ట(హైదరాబాద్): ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా గురజాలకు చెందిన కోటయ్య, భూలక్ష్మిల కుమార్తె ఎస్. శిరీష (22) ఐదు నెలల క్రితం గుంటూరులో బీటెక్ పూర్తి చేసింది. కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో జావా లాంగ్వేజ్ నేర్చుకుంటూ ఆల్విన్ కాలనీలోని తన బంధువుల (పెద్దమ్మ కూతురు) ఇంట్లో ఉంటోంది. నాలుగు అంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో శిరీష బంధువులు ఉంటుండగా, మిగతా ఫ్లోర్లు అద్దెకు ఇచ్చారు. పెంట్‌హౌస్ ఖాళీగా ఉంది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన శిరీష తను తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌తో నేరుగా భవనం టాప్ ఫ్లోర్‌కు వెళ్లింది. అక్కడ బాటిల్‌లోని పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. మంటల వేడిమి భరించలేక బిగ్గరగా ఆర్తనాదాలు చేయడంతో గమనించిన యువతి బంధువులు, అద్దెకు ఉంటున్నవారు టెర్రస్‌పైకి వెళ్లి మంటలు ఆర్పివేశారు. ఆమె శరీరం పూర్తిగా కాలిపోవడంతో ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందింది.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు..

శిరీష మృతికి కారణాలు తెలియరాలేదు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని, కుటుంబ సభ్యులు, బంధువులతో ఎంతో ఆప్యాయంగా ఉంటుందని తెలిసింది. దీంతో జగద్గిరిగుట్ట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పోలవరం పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ అథారిటీ బృందం

పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలన

- ఇంజనీరింగ్ అధికారులతో పీపీఏ బృందం సమీక్ష

పోలవరం రూరల్: పోలవరం పనులను ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. బృంద సభ్యులు రఘురామ్, రాజేష్‌కుమార్, వెంకట సుబ్బయ్య, దేవేంద్రరావు తదితరులు స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్, గ్యాప్–1, గ్యాప్–2, గ్యాప్–3 పనులతోపాటు ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో శాండ్ ఫిల్లింగ్ పనులను పరిశీలించారు. నీటిపారుదల శాఖ సీఈ బి.సుధాకర్‌బాబు, ఈఎన్‌సీ నారాయణరెడ్డి పనులు జరుగుతున్న తీరును బృందానికి వివరించారు. వరదల కారణంగా దెబ్బతిన్న డయా ఫ్రమ్ వాల్‌ను కూడా బృందం పరిశీలించింది. అనంతరం ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులతో పీపీఏ బృందం సమావేశమై సమీక్ష నిర్వహించింది.





ప్రభూ! నిన్ను వేడుకుని నేను ఎన్నడూ నిష్ఫలుణ్ణి కాలేదు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, డిసెంబర్, 30

భయం లేదు... భయం లేదు...

చైనాలో విజృంభిస్తున్న కరోనా ఇప్పుడు ప్రపంచానికి తంటాగా మారింది. ప్రత్యామ్నాయ వ్యూహమేదీ లేకుండానే లోపభూయిష్ఠమైన కఠోర జీరో కోవిడ్ విధానాన్ని హఠాత్తుగా చైనా ఎత్తేయడం అందరికీ తలనొప్పి తెచ్చిపెడుతోంది. చైనాలో వేలల్లో వస్తున్న కోవిడ్ కేసుల ఫలితంగా జనవరిలో భారత్‌లో కరోనా విజృంభణ తప్పకపోవచ్చనీ, రానున్న 40 రోజులు మన దేశానికి అత్యంత కీలకమనీ కేంద్ర ఆరోగ్యశాఖ బుధవారం పేర్కొనడాన్ని ఆ దృష్టితో చూడాలి. ఈ ప్రకటన ప్రజలూ, పాలకులూ అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని మరోమారు గుర్తు చేస్తోంది. అయితే, భారీ సంఖ్యలో కేసులు బయటపడ్డా దేశంలో నాలుగోవేవ్ రాకపోవచ్చనీ, వచ్చినా ఆస్పత్రి పాలవడాలు, మరణాలు తక్కువగానే ఉండవచ్చనీ ఆరోగ్య శాఖ చెప్పడం ఒకింత ఊరట. అలాగని చైనాలో పరిస్థితులు, జపాన్‌లో బుధవారం ఒక్కరోజులో 415 మరణాలు మనల్ని అజాగ్రత్త పనికిరాదంటున్నాయి. గత రెండు రోజుల్లో దేశంలోని వివిధ నగరాల్లో ర్యాండమ్ శాంపిల్ టెస్టింగ్‌లోనే 39 మంది అంతర్జాతీయ విమాన ప్రయాణికులు పాజిటివ్‌గా తేలడం లాంటి ఘటనలు పారాహుషార్ చెబుతున్నాయి.

ప్రపంచీకరణ వల్ల ఏ దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నా, ఇతర దేశాలు అప్రమత్తమై, పరిస్థితిని సమీక్షించుకోక తప్పదు. చైనా వార్తలతో మన దేశంలోనూ ఉన్నత స్థాయి సమావేశాలు, అన్ని రాష్ట్రాల్లో ముందుజాగ్రత్తగా మాక్ డ్రిల్స్ చేసింది అందుకే. చైనా, జపాన్ తదితర 6 దేశాలల నుంచి భారత్‌కు వచ్చే యాత్రికులకు 72 గంటల ఆర్టీ పీసీఆర్ పరీక్షలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో టీకాకరణ జోరు పెంచాలి. రెండు ప్రాథమిక డోసులే వేసుకున్నవారు మూడోదైన ముందుజాగ్రత్త డోస్ (బూస్టర్ డోస్) వేసుకోవాలని వైద్యుల సూచన. ప్రపంచంలో సగటున ప్రతి 100 మందిలో 30 మందికి పైగా బూస్టర్ వేసుకున్నా, మన దగ్గర ఆ సంఖ్య 16 చిల్లరే కావడం పెరిగిన అలక్ష్యానికి చిహ్నం. కొత్తగా ముక్కులో చుక్కలుగా వేసే టీకా (భారత్ బయోటెక్ వారి ఇన్‌కోవాక్)కు బూస్టర్‌గా కేంద్రం అత్యవసర అనుమతి నిచ్చింది. జనవరి చివర నుంచి అలా మరో అస్త్రం చేతికి అందినట్టే!

ఇప్పటికే దేశంలో అధిక శాతం మందికి గతంలో కరోనా సోకడంతో సహజ వ్యాధినిరోధకత ఉంది. టీకాలు తెచ్చిన వ్యాధినిరోధకత దానికి జత కలసి, హైబ్రిడ్ ఇమ్యూనిటీ వచ్చినట్టయింది. అలాగే, కరోనా మొదటి వేవ్ నాటితో పోలిస్తే ఇప్పుడు చికిత్సలో అనుభవం, కనీసం 7 టీకాలు వచ్చాయి. అప్పట్లో ప్రజా ఆరోగ్య వ్యవస్థలోని లోపాలన్నీ కరోనా బహిర్గతం చేయడంతో, ప్రభుత్వాల తప్పనిసరి కృషితో చాలా రాష్ట్రాల్లో ఆరోగ్య వసతులు, వ్యవస్థ మునుపటి కన్నా గణనీయంగా మెరుగయ్యాయి. అందుకే, ఇప్పుడు అతిగా ఆందోళన అవసరం లేదని నిపుణులు భరోసా ఇస్తున్నారు. చైనా దెబ్బకు మళ్ళీ టెస్టులు పెరిగే ప్రస్తుత పరిస్థితుల్లో కేసుల సంఖ్య కన్నా ఆసుపత్రి పాలైన వారి సంఖ్యను కీలకమైన లెక్కగా పరిగణించాలి. అలాగే, పాజిటివ్ నమూనాల జీనోమ్ సీక్వెన్సింగ్‌పై దృష్టి పెట్టి, వైరస్‌లో కొత్త ఉత్పరివర్తనాలు దేశంలోకి వస్తున్నాయేమో ఓ కంట కనిపెట్టడం, వస్తే వాటిని అరికట్టే చర్యలు తీసుకోవడమే అతి ముఖ్యం.

కోవిడ్ కథ కంచికి చేరలేదు... ఇప్పుడప్పుడే చేరే అవకాశమూ లేదు. కరోనా వైరస్‌లో ఎప్పుడు ఏ కొత్త వేరియంట్ వస్తుందో ఏ శాస్త్రవేత్తలూ చెప్పలేరు కాబట్టి ఓ మాదిరి నుంచి తీవ్ర ఇన్ఫెక్షన్లు వస్తూ, పోతూ ఉండవచ్చు. కాబట్టి ఉన్నంతలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, దీర్ఘకాలిక రోగాలకు చికిత్స చేయించుకుంటూ, ప్రాథమికమైన ముందు జాగ్రత్తలతో కోవిడ్ అనారోగ్యం నుంచి మనల్ని మనమే కాపాడుకోవాలి. చైనాలో ఇప్పుడు కాకరేపుతున్న బీఎఫ్.7 ఒమిక్రాన్ ఉప-వేరియంట్ ఉద్ధృతి కొద్దివారాల్లో ముగిసిపోతుందని అంచనా. అలా చైనాలోని తాజా కరోనా వేవ్ ముగిసిపోతే, ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ సామాన్య జలుబు, జ్వరం దశకు వస్తుందని శాస్త్రవేత్తల ఆశాభావం.

కరోనాతో సహజీవనం తప్పదన్న మాటలను ఒకప్పుడు వెటకారం చేసినా, అది అనివార్యమని ఇప్పుడు ప్రపంచానికి తెలిసొచ్చింది. ఈ సుదీర్ఘకాల సహజీవనంలో ప్రపంచంలో ఏ మూల ఎప్పుడైనా కొత్త కేసులు వెల్లువెత్తవచ్చు. తాజా వేవ్‌లు విరుచుకుపడవచ్చు. ఆ ముప్పును గమనంలో ఉంచుకొని, ముందుకు సాగాలి. భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ తగు సంసిద్ధతతో ఉండడమే ప్రస్తుత కర్తవ్యం. అంతేతప్ప, పొరుగునున్న మరో దేశంలో కరోనా వేవ్ వచ్చిందని వార్త వచ్చినప్పుడల్లా బెంబేలెత్తిపోతే ఉపయోగం లేదు. శాస్త్రీయ ధోరణితో కరోనాపై చర్యలు ముఖ్యం.

వెరసి వ్యూహాల పునఃసమీక్షా సమయం ఇది. కేంద్రం ఎప్పటికప్పుడు చైనాలో పరిస్థితిని గమనిస్తూ ఉండాలి. పుకార్లు వ్యాపించకుండా ప్రజలకు సమాచారం అందిస్తూ, చైతన్యం తేవాలి. ప్రపంచానికి కరోనా పరిచయమై సరిగ్గా మూడేళ్ళయింది. ఇన్నేళ్ళుగా అనుసరిస్తున్న కరోనా వ్యూహాలను ఇప్పుడు ఆగి, పరిశీలించుకోవాలి. గత అనుభవాల ఆధారంగా శాస్త్రీయంగా, సాక్ష్యాధారాలపై ఆధారపడి చర్యలు చేపట్టాలి. తాజా పరిస్థితులకు తగ్గట్టు సాక్ష్యాధారాలపై ఆధారపడ్డ కరోనా పోరాట ప్రణాళిక, వ్యూహం సిద్ధం చేసుకోవాలి. పరిశోధన, అభివృద్ధికి మరిన్ని ప్రోత్సాహకాలిచ్చి టీకాలు సహా ఆరోగ్యరంగంలో బలోపేతం కావాలి. గత మూడేళ్ళుగా పాలకులు పక్కనబెట్టిన టీబీ సహా ఇతర వ్యాధుల నియంత్రణపైనా చర్యలకు విధాన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజలేమో కరోనాపై స్వీయ నియంత్రణతో మాస్క్ ధారణ సహా జాగ్రత్తలను పాటించాలి. అప్రమత్తత వల్ల ఎప్పుడూ ఎంతో కొంత లాభమే. ఎంతైనా మన జాగ్రత్తే మనకు రక్ష కదా!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు
పుష్యమాసం, **తిథి:** శు.అష్టమి రా.11.56 వరకు, తదుపరి నవమి,
నక్షత్రం: ఉత్తరాభాద్ర సా.5.06 వరకు, తదుపరి రేవతి,
వర్జ్యం: తె.4.44 నుండి 6.27 వరకు (తెల్లవారితే శనివారం),
దుర్ముహూర్తం: ఉ.8.44 నుండి 9.30 వరకు, తదుపరి ప.12.25 నుండి 1.08 వరకు, **అమృతఘడియలు:** ప.12.26 నుండి 2.01 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.32
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కులాంతర వివాహాలు శాస్త్రబద్ధమే

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

భారతీయ సమాజంలో ఇప్పుడు కుల, మతాలకు అతీతంగా విందులూ, వినోదాల్లో పాల్గొనడం కొంతమేర పెరిగింది. అయినా వివాహ బంధాలతో కులాన్నీ, మతాన్నీ చెరిపి వేయలేకపోతున్నారు. ఇటువంటి వారందరిపైనా హిందూ పురాణాలు, ఇతిహాసాల ప్రభావం ఎక్కువ. అయితే ఈ గ్రంథాల్లోనే అనేకమంది రుషులు కులాంతర, జాత్యంతర వివాహాలు చేసుకున్నట్లు ఉన్నా... నిజ జీవితంలో మాత్రం కులాంతర వివాహాలకు అంగీకరించకపోవడం విడ్డూరం. పైగా కృష్ణుడు వంటి దేవుళ్లను చూపించి... దేవుళ్లకే కులం బాధ తప్పలేదు మనమెంత అని తప్పించుకుంటూ ఉంటారు. ఇది అన్యాయం. నిజానికి కులాంతర వివాహాలు అత్యంత శాస్త్రీయమైనవని శాస్త్రజ్ఞులు అంటున్నారు.

దేశంలో కుల దురహంకార జాడ్యం ప్రమాదకర సమస్యగా మారిందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రేమ వివాహాల విషయంలో విపరీతమైన వధ జరుగుతోంది. డా॥ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రూపొందించిన కుల నిర్మూలనా భావన ఆధిపత్య కులాలకు అర్థం కావడం లేదని చంద్రచూడ్ ఆవేదన చెందారు. పవిత్ర హత్యల వెనక మతోన్మాద, కులోన్మాద భావనలున్నాయి. కులం... వర్ణ వ్యవస్థ నుండి జనించింది. వర్ణాలను కొందరు ఆధిపత్యం కోసం సృష్టించారు. తమ పిల్లలు అణగారిన వర్గాల నుండి వచ్చిన వారిని ప్రేమ వివాహాలు చేసుకోవడాన్ని వీళ్ళు తట్టుకోలేక పోతున్నారు.

వర్ణాన్ని బట్టి కులాన్నో, జాతినో నిర్ణయించడం అశాస్త్రీయమైన విషయం. కుల వ్యవస్థ మీద అత్యంత పరిశోధనలు చేసిన జె.హెచ్. హట్టన్ 'ది క్యాస్ట్ ఇన్ ఇండియా'లో క్యాస్ట్ గురించి ఈ విధంగా అన్నారు. "క్యాస్ట్ అను మాట, 'కాస్ట' అను పోర్చుగీసు శబ్దము నుండి వచ్చింది. 'కాస్ట' అను శబ్దము 'చాలు', 'జాతి', 'రకము' అను పదముల అర్థమును తెలుపును. ఆ భాషలో 'హోమెండీ బోయ కాస్ట' అను పద సమూహమునకు 'మంచి కుటుంబములోని మనిషి' లేక 'కులీనుడు' అని అర్థము".

1563లో గార్సియాడి ఓర్టా "తన తండ్రి నుండి ఎవడూ మారడు, చెప్పులు కుట్టు కులం వారంతా ఒకటే" అని రాసిన నాటి నుండి ఈ 'కాస్ట' మాటను మనమిప్పుడు గ్రహించిన పరిమితమైన "కులం (క్యాస్టు)" అర్థములో వాడుతున్నట్టు కనిపిస్తున్నది. కులాన్ని నిచ్చెనమెట్ల సమాజంగా రూపొందించారని అంబేడ్కర్ తన 'కుల నిర్మూలన' గ్రంథంలో పేర్కొన్నారు. ఒక కులం అబ్బాయి మరొక కులం అమ్మాయిని చేసుకోవటం సామాన్యమైన విషయం. లేని కులం కోసం ఉన్న బిడ్డల్ని చంపుకోవటం అమానుషమైన విషయం. అందుకే అంబేడ్కర్ ఇలా అన్నారు... 'ఇండియాలో వివిధ కులాల మధ్య వర్ణాంతర వివాహాల ద్వారా జాతి మిశ్రణ, రక్త సమ్మేళన జరగనిస్తే వచ్చిన హాని ఏమున్నది? మృగాలకు, మనుష్యులకు మధ్య అనంతమైన భేదం ఉన్నది గనుక మృగాలు, మనుష్యులు రెండు భిన్న రకాల జాతులు సంతతికి చెంది ఉన్నట్లు విజ్ఞానశాస్త్రం అంగీకరించింది. జాతుల స్వచ్ఛతలో నమ్మకం ఉన్న శాస్త్రజ్ఞులు కూడ మనుషుల్లోని వివిధ జాతులు భిన్న రకాల జాతుల సంతతి అని అనడం లేదు. "వారంతా ఒకే సంతతికి చెందిన పలు జాతులు. సర్వజాతుల మానవులూ ఏక జీవాల సృష్టే కనుక ఆయా జాతుల మధ్య అంతః సంయోగం వల్ల కలిగే సంతానం మానవులదే కానీ గొడ్డుది కాజాలదు."

కులాంతర వివాహాలపై ద్వేషం పెరగడానికి కారణం మత మౌఢ్యం, కులతత్వం అని అంబేడ్కర్ ఈ విధంగా చెప్పాడు...



'మొత్తం భరత ఖండం అంతటా హిందువుల జీవిత విధానాన్ని చూస్తే వారి ఆచార వ్యవహారాలలో, ఆలోచనలో ఒక విధమైన పోలిక ఉంది కాబట్టి, ఈ ఏకత్వానికిది తార్కాణమని వాదిస్తారు. పోలికలున్న మాట నిజమే అయితే తత్కారణంగా హిందువులు ఒక సమాజంగా ఏర్పడి ఉన్నారని చెప్పే వాదాన్ని ఎవ్వరూ అంగీకరించరు. అలా అంగీకరించడం అంటే సమాజ నిర్మాణ ప్రాతిపదికల్ని అపార్థం చేసుకోవడమే. మానవులు భౌతికంగా దగ్గర దగ్గరగా నివసిస్తున్నంత మాత్రాన వారు ఒక సమాజంగా ఉన్నట్టు కాదు. మరొక విషయం ఏమిటంటే మానవులు ఒక సమాజంగా నిర్మాణం కావాలంటే ఆచార వ్యవహారాలలోను, సంప్రదాయాలలోను, విశ్వాసాలలోను, ఆలోచనలోను పోలికవుంటే చాలదు. ఏ వస్తువైనా ఇటుకల వలె భౌతికంగా ఒకరి చేతుల నుంచి మరొకరి చేతులలోకి పోవచ్చు. ఒక వర్గానికి చెందిన ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు, భావాలు మరొక వర్గం వారిచే స్వీకరించబడవచ్చు. అప్పుడా రెండు వర్గాల మధ్య పోలిక కన్పించవచ్చు. సంస్కృతి అనేది ఎల్లప్పుడూ వికసిస్తూ విస్తరిస్తూనే ఉంటుంది."

కులాంతర వివాహాలది శాస్త్రీయ బంధమే అని మానవ పరిణామ శాస్త్రవాదులు నిరూపించారు. ఇప్పుడైతే జాత్యంతర వివాహాలు కూడా ముమ్మరంగానే జరుగుతున్నాయి. వాటిని అంగీకరిస్తున్నారు. కులాంతర వివాహాల్లోనూ అస్పృశ్యులుగా చెప్పబడుతున్న దళితుల వివాహాలనే ఎక్కువగా వ్యతిరేకిస్తున్నారు. కారణం వారి మనసుల్లో పేరుకుపోయిన దళిత వ్యతిరేక భావన. రిజర్వేషన్‌ల వల్ల విద్యావంతులు అవుతున్నారనే ద్వేషం కూడా ఉంది. నిజానికి దళితులు చేసుకునే వివాహాలన్నీ సక్సెస్ అవుతున్నాయి. కారణం వారిలో ప్రేమ, అభిమానం, ఆత్మీయత, అనురాగం, రక్షణ వంటి అంశాలు మిక్కుటముగా ఉండటమే. దళిత విద్యావంతులకు సామాన్యంగా కుల భేదాలు ఉండవు. వారు ప్రేమ వివాహాలు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే పగ, ద్వేషం, క్రౌర్యం, హింస, అవమానం, నిరాకరణ అమ్మాయి తల్లిదండ్రుల నుంచి వారికి ఎదురవుతున్నాయి. నిజానికి ప్రేమ వివాహాల్లో కట్నాలు ఉండవు. నిరాకరణ ఉండదు. యువతి యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకోవడం అనేది ఒక శాస్త్రీయమైన భావన. వీరు ఎవరి గ్రంథాలు అయితే చదివి ఈ కుల వర్ణ ద్వేష భావాలు పెంచుకున్నారో ఆ రుషులంతా కులాంతర వివాహాలు చేసుకున్నారు.

హిందువుల సాహిత్యం నిండా కులాల చరిత్రను గురించి రాసి ఉంటుంది. అందులో ఒక కులాన్ని ఉత్తమ జన్మగాను, మరొక కులాన్ని నీచ జన్మగాను చిత్రించే యత్నం జరిగినట్టు కన్పిస్తున్నది. ఈ రకమైన సాహిత్యంలో 'సహ్యాద్రి ఖండం' అనేది పేరు పొందిన గ్రంథం. కులం అనేది ఒక సంస్కృతి కాదు, ఒక మతం కాదు, అది ఒక నమ్మకం. బాబాలు, యోగులు, స్వాములు, గురువులు వివిధ కులాల నుండి వచ్చి ఎలా బోధ చేయగలుగుతున్నారు. ఇదివరకు కొందరికి పరిమితమైన ఈ వేదాంత బోధ అందరికీ ఎలా సాధ్యమైంది. అలాగే వివాహం కూడా ఏ కులం వారైనా ఇంకొక కులం వారిని చేసుకోవచ్చు. మంచి సంతానం కనవచ్చు. ఈ కులాన్ని పోషించడానికీ హిందూమతం తన శక్తిని రంగరించి పోసింది. కరుణరసానికి పెట్టింది పేరైన రామాయణంలో శంబూకుడు ఈ కులం ముద్రతోనే చంపబడ్డాడు. ఇకపోతే భారతంలో ద్రోణుడు ఏకలవ్యుని విద్యా సంపత్తిని కులం పేరుతో అనర్హుడుగా ప్రకటించి దోచుకున్నాడు. కాని ధర్మశాస్త్రం ప్రకారం ద్రోణుడు ఉత్తమ బ్రాహ్మణుడై కూడా తన విద్యను పొట్టకూటికి అమ్ముకున్నాడు. కులగోత్రాలు లేని పాండవులకు విద్య చెప్పడంలో లేని ధర్మ ప్రసక్తి ఏకలవ్యునికి విద్య చెప్పడంలో ఎందుకు వచ్చిందో అర్థం కాదు.

అయితే ఈ పురాణాలు బహుముఖాలుగా ప్రచారమై, పురాణ పురుషులకే, కులధర్మం తప్పలేదు, మనమెంత? అనే భావానికి సమాజాన్ని తీసుకొచ్చాయి. గీతను ప్రవచించి కులాన్ని మానవ ధర్మంగా నిర్దేశించిన కృష్ణుడు కులం పేరుతో రాజసూయయాగంలో శిశుపాలుని చేత నిలవేయబడ్డాడు. హరిశ్చంద్రుడు కులం కోసం రాజ్యాన్ని, భార్యని, కుమారుని చివరకు తన్నుతాను అమ్ముకున్నాడు. అయితే ఇవన్నీ పురాణ గాథలే. ఇవన్నీ సత్యాలు కావు. కాని భారతీయ హృదయ పేటికల మీద ముద్రవేయబడ్డ వాళ్ళు వీళ్ళే కదా! నిజానికి కులాంతర వివాహమే శాస్త్రీయ బంధం. కులం పెళ్లిలో అశాస్త్రీయత ఎక్కువ వుంది. పిల్లలు సరిగా పుట్టరు. మేధలో కూడా తేడా వస్తుంది. జీన్స్ మారితేనే శాస్త్రీయ బంధం రూపొందుతుంది. ఇప్పుడు యువత ఎక్కువ మంది కులాంతర సంస్కృతి జీవనం వైపు, బంధం వైపు నడవడం భారత రాజ్యాంగబద్ధ జీవన విధానానికి ఆయువు పోసినట్టే. భారత రాజ్యాంగ ఆచరణే జీవన సాఫల్యం. చరిత్రతో నడవడం కాదు, చరిత్రను మారుద్దాం.

వ్యాసకర్త దళిత ఉద్యమ నేత । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మొదలు ఒక్కచోటే



మీకు తెలుసా? జొరాస్ట్రియనిజం (పారశీక మతం)లో ఇంద్రుడు ఒక అపకారబుద్ధిగల రాక్షసుడు. సుమారు 3,500 సంవత్సరాల క్రితం ఈ ఇంద్రుడు, రుగ్వేదంలోని ఇంద్రుడు ఒక్కరే!

– అమిత్ షాండీలియా, కాలమిస్ట్

రాకపోకలు వద్దు



మరో దశ కోవిడ్-19 వ్యాప్తిని అరికట్టడానికి ఉన్న ఒకే ఒక్క మార్గం చైనా నుంచి ప్రయాణాలను తక్షణమే ఆపడం. ఆ దేశంతో సంబంధాలకు చెల్లించాల్సిన మూల్యం మరణమే.

– గోర్డాన్ జి.చాంగ్, యూఎస్ కాలమిస్ట్

వాళ్లకేం ఇబ్బంది?



ఇండియా గురించి నేను ఎప్పుడు ప్రశంసించినా – అది ఎంత అందమైన దేశం, ప్రపంచంలోనే అత్యుత్తమ ఆతిథ్యంతో భద్రత ఇచ్చే దేశం అని అన్నప్పుడల్లా వామ పక్షీయులు, ఉదారవాదులు నామీద విరుచుకు పడతారు. సత్యం అనేది ఈ చిత్రమైన జీవులను ఎలా బాధిస్తుందో!

– రెనీ లిన్, హిందూ యాక్టివిస్ట్

నాశన కాలం



యుద్ధానంతర రుణాల కోసం బహుళ జాతి సంస్థ 'బ్లాక్ రాక్'తో ఒప్పందం కుదుర్చుకునేందుకుగానూ ఉక్రెయిన్... దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో చేరనున్నట్టు అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారని వార్త. మరో 'క్లైంట్ స్టేట్' (పరాన్న దేశం) తయారీలో ఉంది.

– రాబర్ట్ డబ్ల్యు మలోని, శాస్త్రవేత్త

ఎంత ప్రగతి!



భూటాన్ కరెన్సీ ఇప్పుడు ఇండియా కరెన్సీతో సమానం. ఒక భూటానీస్ గుల్‌ట్రమ్ ఒక రూపాయితో సమానమైంది. వావ్ మోదీజీ వావ్! భూటాన్ ఒక్కటే కాదు, అఫ్గానిస్తాన్ రూపాయి కూడా ఇండియా రూపాయితో దాదాపు సమానం. మనం ఇప్పుడు తాలిబన్ల రాజ్యానికి సమానం.

– భావికా కపూర్, కాంగ్రెస్ వాది

ఆగ్రహం రావాలిగా!



స్వాతంత్ర్యం వచ్చిన 30 ఏళ్ల తర్వాత ఒకవేళ నైజీరియాను యూకే దురాక్రమించినా; అల్జీరియాకు ఫ్రాన్స్ లేదా అంగోలాకు పోర్చుగల్ అదే చేసినా మనం దాన్ని సామ్రాజ్యవాదం లేదా నయా సామ్రాజ్యవాదం అంటాం. సరైన కారణం కోసమే ఆగ్రహం చూపుతాం. మరి ఉక్రెయిన్‌లో జరుగుతున్న ఈ నయా సామ్రాజ్యవాదం పట్ల ఎందుకు మౌనంగా ఉంటున్నాం?

– మైకేల్ మెక్‌ఫాల్, ప్రొఫెసర్

మనకు తెలిసినవే



జపాన్, దక్షిణ కొరియా, హాంగ్‌కాంగ్‌లలో కోవిడ్ కేసులు ఉన్నట్టుండి పెరగడం చూస్తున్నాం. ఈ దేశాల్లో కనబడుతున్న సాధారణ రకాలు ఒమిక్రాన్ ఉపవంశానికి చెందిన బీఏ.5, బీఏ.2.75, బీక్యూ.1, ఎక్స్‌బీబీ. ఇవన్నీ కూడా గత మూడు నాలుగు నెలలుగా ఇండియాలో ఉన్నవే. కాబట్టి ఈ రకాల వల్ల ఇండియాలో కేసుల సంఖ్య అమాంతం పెరగకపోవచ్చు.

– విజయానంద్, కోవిడ్ డేటా విశ్లేషకుడు

బీసీ జన గణనతోనే న్యాయం

అభిప్రాయం



డాక్టర్ పరికిపండ్ల అశోక్

జనాభా కులాలుగా విడగొట్టబడిన దేశం మనది. ఆధిపత్య కులాలు దేశంలోని భూమి, ఇతర వనరులు; విద్య, ఉద్యోగ అవకాశాలను అధికంగా అనుభవిస్తున్నాయి. సంపద వారి చేతుల్లో ఉన్నందు వల్ల చదువుకోగలరు కాబట్టి... ఉద్యోగావకాశాలూ సహజంగా వారికే అధికంగా లభిస్తాయి. అయితే దేశంలో సంఖ్యాపరంగా వీరి సంఖ్య తక్కువ. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల జనాభా అధికంగా ఉంది. రాజ్యాంగం అందరికీ సమాన అవకాశాలు వాగ్దానం చేసింది. అవకాశాల్లో సమాన భాగం కాకపోయినా... కనీస భాగం పొందాలంటే రిజర్వేషన్లు ఒక్కటే మార్గమని రాజ్యాంగ సభ భావించి రాజ్యాంగంలో అందుకు తగిన ఏర్పాటు చేసింది.

అయితే ఇటీవల కాలంలో కొత్త కులాలనూ, వర్గాలనూ రిజర్వేషన్ వర్గాల్లో కలపడంతో రిజర్వేషన్ వర్గాల వారికి అవకాశాలు పలుచబడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కులాల జన గణన జరిగితే ఎవరి దామాషా ప్రకారం వారు అవకాశాలను పొందవచ్చుగదా అనే ఆలోచన బయలుదేరింది. ముఖ్యంగా వందలు, వేలాదిగా ఉన్న బీసీ కులాలు ఈ డిమాండ్‌ను బలంగా వినిపిస్తున్నాయి. ఇలా కుల గణన జరిగితే ఒనగూరే ఇతర ప్రయోజనాలనూ వారు పేర్కొంటున్నారు. వెనుకబడిన మెజార్టీ ప్రజల సంక్షేమానికి తగిన పథకాల రూపకల్పనకు ఈ డేటా చాలా అవసరం. విద్య, ఉద్యోగ రంగాల్లో ఎవరి వాటా వారు పొందడానికి వీలు కలుగుతుంది. ఇప్పటివరకు రిజర్వేషన్ ఫలాలు అందని ఎన్నో వందల కులాలను వెలుగులోకి తీసుకురావచ్చు. ఫలితంగా అత్యధిక పేదలు ఉన్న బీసీల్లో తమ వాటా తమకు లభిస్తుందన్న సాంత్వన లభిస్తుంది. ఎవరి వాటా వారికి లభిస్తే సామాజిక అశాంతి తగ్గి శాంతి భద్రతలు మెరుగవుతాయి. ప్రభుత్వం తన దృష్టిని అభివృద్ధి కార్యక్రమాలపై నిలపడానికి అవకాశం ఏర్పడుతుంది. కులగణనపై సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం... కులాల వారీగా వెనుకబడిన తరగతుల జనగణన చేపట్టడం పాలనపరంగా కష్టమని తెలిపింది. దీంతో బీసీలు బాగా అసంతృప్తికి లోనయ్యారు.


1931 కులగణన తర్వాత బీసీ జనగణన జరగలేదు. అయితే 1979లో జనతా ప్రభుత్వం బీపీ మండల్ సారథ్యంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులవారిని గుర్తించి వారి అభివృద్ధికి సిఫార్సులు చేయమని ఒక కమిటీని నియమించింది. ఈ మండల్ కమిషన్ 1980లో సమర్పించిన నివేదికలో భారత్ మొత్తం జనాభాలో 52 శాతం వెనుకబడిన తరగతులవారేననీ, వారికి 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలనీ సిఫార్సు చేసింది. బీసీల సమగ్ర అభివృద్ధి కోసం అనేక సిఫార్సులు చేసినా అవన్నీ అటకెక్కాయి. 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అత్యంత దారుణ వ్యతిరేక పరిస్థితుల్లో అమలులోకి వచ్చాయి.

నిజానికి ఇప్పుడు బీసీల జనాభా మరింతగా పెరిగి ఉండాలి. వారూ వీరూ చెప్పే లెక్కలన్నీ కాకి లెక్కలే. ఒక్కసారి కుల గణన జరిపితే అభివృద్ధి ఫలాల్లో ఎవరి వాటా వారు అడగడానికి వీలు ఉంటుంది. సామాజిక న్యాయం సాకారమవుతుంది.

వ్యాసకర్త సామాజిక కార్యకర్త । 99893 10141

తమ్ముండ్లూ రాండ్రి! గాలిగొట్టి పోండ్రి!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

జిద్దు ఇడ్వని విక్రమార్కుడు మోటర్ దీస్కోని బొందల గడ్డ దిక్కు బోయిండు. గాడ రొండంత్రాల బంగ్లల బేతాలుడుంటున్నడు. ఎటూ పొద్దుబోక టీవీ జూస్కుంట గూసున్నడు. విక్రమార్కుడు బొందల గడ్డకు బోయిండు. బేతాలుని ఇంటి ముంగట మోటరాపి హారన్ గొట్టిండు. హారన్ సప్పుడినంగనే బేతాలుడు ఇంట్ల కెల్లి ఇవుతల కొచ్చిండు. మోటరెక్క సీట్ల గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు మోటర్ నడ్పబట్టిండు.

"నన్ను గూసుండ బెట్టుకోని ఎత్తుగడ్డలు, గుంతలని సూడకుంట మోటర్ నడ్పుతవు. నీ మోటర్ ట్రాఫిక్ల ఇర్కపోవచ్చు. నీకు తిక్క లేవొచ్చు. కోపం రావొచ్చు. యాస్ట లేకుంట ఉండె తందుక్క నీకు గిప్పుడు నడుస్తున్న ఒక కత జెప్త ఇను" అని మోటరెక్క సీట్ల గూసున్న బేతాలుడన్నడు.

"నీకు కత జెప్పుడు, నాకు ఇనుడు అల్వాటే గద" అని మోటర్ నడ్పుతున్న విక్రమార్కుడన్నడు.

"గీనడ్మ తెలంగానలున్న కమ్మం పట్నంల తెలుగు దేసం శంకు సప్పుడు సబ బెట్టింది. గాడ కిష్నుని యేసంల శంకమూదుతున్న ఎన్టీఆర్ కటౌట్ బెట్టింంద్రు. పచ్చ జెండలు ఎగిరేసింంద్రు. పచ్చ తోర్నాలు గట్టింంద్రు. బుక్క గులాల్లెక్క తెలుగు దేసమోల్లు ఒకల మీద ఒకలు పస్పు జల్లుకుంంద్రు. శంకు సప్పుడు సబ కాడ రెండేల్లు సూబెడ్తున్న చెంద్రబాబు కటౌట్ గుడ్క బెట్టింంద్రు. 'తెలుగుదేసం పిలుస్తున్నది కదలిరా. సైకిల్ పంపు దీస్కోని ఉర్కిరా' అని రాసి ఉన్న బ్యానర్లను గట్టింంద్రు" అన్కుంట బేతాలుడు ఇంకేమొ జెప్పబోతుంటె –

"సైకిల్ పంపు దీస్కోని వొచ్చుడెందుకు?" అని విక్రమార్కుడు అడిగిండు.

"గాలిబోయిన టీడీపీ సైకిల్ల గాలిగొట్టితందుక్క. శంకు సప్పుడు సబకు చెంద్రబాబొస్తుంటె జెనం గాయిన మీద పస్పు జల్లింంద్రు. నందమూరి సుహాసిని పస్పుతోని గాయినకు బొట్టు బెట్టింది. కద్మ టీడీపీ ఆడి లీడర్లు గాయినకు మంగలార్తి ఇచ్చింంద్రు. పచ్చంగి దొడుక్కున్న గాయిన గాల్లకు రెండేల్లు సూబెట్టిండు. 'తెలుగుదేసం జిందాబాద్, చెంద్రబాబు జిందాబాద్' అని తెలుగు దేసపోల్లు లాసిగ వొల్లుతుండగ గాయిన స్టేజ్ ఎక్కిండు. ముందుగాల పచ్చ రంగు శంకం దీస్కోని ఊదిండు. గని జెర్ర సేపటికే గాయినకు దమ్మొచ్చింది. ఇక దాంతోని శంకమూదుడాపి గాయిన గిలాస నీల్లు దాగిండు."

"తెలుగుదేసంను ఇడ్సిపెట్టి పోయిన తెలుగు తమ్ముండ్లూ మల్లొక్కపారి మీ ఇంటికి రాంంద్రి. సైకిల్ పంపుచర్లు జుడాయించి గాలి గొట్టుంంద్రి. టీడీపీ తెలంగానలనే పుట్టింది. తెలంగానలనే పెరిగింది. ('తెలంగానలనే సచ్చింది' అని ఎన్కకెల్లి ఎవడో లాసిగ వొల్లిండు)



నేను ఒక్క తీర్గ బత్మిలాడంగ బత్మిలాడంగ బిల్స్ గేట్స్ పట్న మొచ్చిండు. కుద్దు నేనే గాలి మోటర్ అడ్డంకు బోయి గాయినకు మంగలార్తి ఇచ్చిన. మూడు నచ్చత్రాల హోటల్ల ఉంచి కుద్దు నేనే ఒక కోపుల చాయ్ ఇచ్చిన. గాయినకు ఒక్క తీర్గ మస్క గొట్టి హైటెక్ సిటీ దెచ్చిన. గాలి మోటర్ల దునియ అడ్డను నేనే గట్టిపిచ్చిన. నేను జెయ్యబట్కెనే ఇయ్యాల పట్నంల కరోన టీక తయ్యారైంది. తెలంగాన, ఆంద్ర నాకు రొండు కండ్లు. గీ రొండు కండ్లు ఒక్కటి గావాలని సిగ్గు శరం లేనోల్లు అంటున్నరు. ఏ కన్నుకు ఆ కన్ను ఉంటెనే నాకు మల్ల ముఖ్యమంత్రి అయ్యేటి మోక దొరుక్తది. టీడీపీ సైకిల్ ఒక గిర్రల ఆంద్ర తమ్ముండ్లు గాలిగొడ్తున్నరు. ఇంకొక గిర్రల తెలంగాన తమ్ముండ్లూ గాలి గొట్టుంంద్రి. మీరు గాలిగొడ్తెనే నా సైకిల్ నడుస్తది. నా సైకిల్ నడుస్తనే బీజేపీ కాడికెల్లి అన్ని పార్టీలు నా దిక్కు జూస్తయి. నాతోని సోపతి జేస్తయి అన్కుంట చెంద్రబాబు సుత్తిగొట్టిండు."

"తెలంగానలనే గాకుంట ఆంద్రల గుడ్క చెంద్రబాబు సబలు బెట్టిండా?"

"గిదేం కర్మ రాస్ట్రంకు సబలు బెట్టిండు. ముఖ్యమంత్రి కుర్సి పోయిన కాన్నుంచి నాకు బువ్వ దిన బుద్దయితలేదు. కన్ను మలుగుతలేదు. కన్ను మల్లకుంటె కలలు యాడబడ్తయి. కలలు బడక ఆకర్కి కలల గుడ్క ముఖ్యమంత్రి అయ్యేటి మోక దొరుక్త లేదు. ఫికర్ తోని బక్కగైన. నన్ను ముఖ్యమంత్రిని జేస్తిరా అంటె అందరి ఇండ్లకు పచ్చ రంగేపిస్త. ఇండ్లకే గాకుంట బళ్లకు, గుళ్లకు, సర్కార్ దఫ్తర్లకు పచ్చరంగు ఏపిచ్చి ఆంద్రప్రదేస్‌ను బంగారి రాస్టం జేస్త. గిదేం కర్మ రాస్ట్రంకు..." అని గాయిన ఇంకేమొ మాట్లాడబోతుంటె –

'నువ్వే కర్మ రాస్ట్రంకు' అని ఎన్కకెల్లి ఎవడో లాసిగ వొల్లిండు.

చెంద్రబాబుతోని ముచ్చట బెట్టెటప్పుడు బిల్ గేట్స్ తప్పిజారి గూడ గాయిన ఈపు ఎందుకు సూబెట్టలేదు? గీ సవాల్‌కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ మోటర్ టైర్లల్ల గాలి బోతది" అని బేతాలుడన్నడు.

"ఈపు గిన గండ్లబడ్తె చెంద్రబాబు యాడ ఎన్నుపోటు పొడుస్తడోనని బిల్‌గేట్స్ బయపడ్డడు" అని విక్రమార్కుడు జెప్పిండు.

ఇంతల బొందల గడ్డ వొచ్చింది. బేతాలుడు మోటర్ దిగి ఇంటి దిక్కు బోయిండు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899


అనంతపురం జిల్లా జానంపల్లిలో వృద్ధురాలికి మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి కలిగిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్



పల్నాడు జిల్లా క్రోసూరులో మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్టుమెంట్లు నిండాయి. సర్వ దర్శన టోకెన్లు లేనివారికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

క్లుప్తంగా...

ఏఎన్‌యూ పూర్వ విద్యార్థుల వెబ్‌సైట్ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) పూర్వ విద్యార్థుల వెబ్‌సైట్, లోగోను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ గురువారం రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. వర్సిటీల్లో భవనాల నిర్మాణం, పేద విద్యార్థులకు సహకారం తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలన్నారు. ఏఎన్‌యూ పూర్వ విద్యార్థుల సంఘం సంచాలకుడు ఆంజనేయులు, సమన్వయకర్త సరస్వతి, దూర విద్యా కేంద్రం సంచాలకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం పోర్టు అరుదైన రికార్డు


సముద్రంలో ప్రయాణిస్తున్న హైరున్ నౌక

ముత్తుకూరు: అత్యధిక పరిమాణంలో ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేయడం ద్వారా కృష్ణపట్నం పోర్టు అరుదైన రికార్డు సాధించినట్లు పోర్టు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఎంవీఎస్ఎస్ హైరున్ అనే నౌక ద్వారా 1,68,100 టన్నుల ఇనుప ఖనిజం చైనాకు ఎగుమతి చేయడం ద్వారా పోర్టు సరికొత్త మైలురాయిని చేరుకొందని చెప్పారు. ఈ నౌక గురువారం తెల్లవారుజామున చైనా బయలుదేరిందని, దేశ సముద్ర రవాణా రంగంలో ఇది సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ విషయమన్నారు. పోర్టు మెరైన్ విభాగం సాధించిన ఈ ఘనతలో కెప్టెన్ పాడి, కెప్టెన్ బిబూపాద సాహు, సీఈవో జీజే రావు, సీవోవో సంజయ్ కోథా భాగస్వాములని పేర్కొన్నారు.

జనవరి 26 నుంచి కాంగ్రెస్ ఉద్యమ బాట

- ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు


మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

కాకినాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణల అంశాలపై జనవరి 26 నుంచి మార్చి 26 వరకు రెండు నెలల పాటు రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు చెప్పారు. ఏపీసీసీ అధ్యక్షుడి హోదాలో తొలిసారి కాకినాడ జిల్లాకు వచ్చిన ఆయన స్థానిక కళా వెంకట్రావు భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు స్థానిక అంశాలపై ఉద్యమ బాట పడుతున్నామన్నారు. 'చేయి చేయి కలుపుదాం–కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం' అన్న నినాదంతో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

పారామెడికల్ కోర్సుల్లో సీట్ల కేటాయింపు జాబితా విడుదల

సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరానికి బీపీటీ, బీఎస్సీ పారామెడికల్ టెక్నాలజీ, బీఎస్సీ నర్సింగ్ వంటి పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాల్లో భాగంగా మూడో విడత సీట్ల కేటాయింపు జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ గురువారం విడుదల చేసింది. విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలల్లో జనవరి 4న సాయంత్రం నాలుగు గంటల్లోగా రిపోర్ట్ చేయాలి. రాష్ట్రంలో 364 కళాశాలలు ఉండగా వీటిలో 10,283 సీట్లు ఉన్నాయి. ఇప్పటివరకూ నిర్వహించిన మూడు కౌన్సెలింగ్‌లలో 9,480 సీట్లు భర్తీ అయ్యాయి.

గిరిజన నిరుద్యోగులకు ఉపాధి

అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తెలిపారు. ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో నూతనంగా నిర్మించిన కాటేజీలను పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కాటేజీల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. పద్మాపురం గార్డెన్‌లో ఆరు కాటేజీలను రూ.44 లక్షలు, కొత్తవలస గార్డెన్‌లో 12 కాటేజీలను రూ.64 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. పర్యాటకుల సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

జేఈఈ మెయిన్ తొలివిడత సాధ్యమేనా?

పలు అంశాలపై అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు

- ఇప్పటికే కోర్టుల్లో పిటిషన్లు
- జాతీయ బాలల పరిరక్షణ కమిషన్‌కు కూడా ఫిర్యాదులు
- జేఈఈ మెయిన్ జనవరి సెషన్ సమయంలోనే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు
- ఇంటర్‌లో 75 శాతం మార్కుల నిబంధనపైనా వ్యతిరేకత
- అభ్యర్థుల డిమాండ్లపై ఇంకా స్పందించని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లు వంటి జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్–2023 జనవరి సెషన్ పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని అభ్యర్థుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే కొందరు బాంబే హైకోర్టులో పరీక్ష వాయిదాను కోరుతూ పిటిషన్ కూడా దాఖలు చేశారు. మరోవైపు అభ్యర్థులు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్)కు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో అభ్యర్థులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌సీపీసీఆర్ పరీక్షల షెడ్యూల్ మార్పు అంశాన్ని పరిశీలించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి లేఖ రాసింది. ఈ నేపథ్యంలో ఈ పరిణామాలన్నీ జేఈఈ మెయిన్–2023 జనవరి సెషన్ పరీక్షల నిర్వహణపై తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

అభ్యర్థుల అభ్యంతరాలు ఇవే..

జేఈఈ మెయిన్–2023ని రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ డిసెంబర్ 15న నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. తొలి సెషన్ పరీక్షలు జనవరి 24 నుంచి 31 వరకు, రెండో సెషన్‌ను ఏప్రిల్ 6 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో జనవరి సెషన్ పరీక్షలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా ప్రారంభించింది. అయితే జనవరిలో సీబీఎస్ఈ సహా పలు రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ బోర్డుల ప్రీ ఫైనల్ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలు ఉన్నాయి. దీనివల్ల జేఈఈ మెయిన్ పరీక్షలకు హాజరయ్యే అవకాశాన్ని తాము కోల్పోవలసి వస్తుందని అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 2021, 2022లో జేఈఈ మెయిన్‌లో విజయం సాధించినా అవకాశం అందుకోలేక డ్రాపర్లుగా మిగిలిపోయిన అభ్యర్థులు కూడా పరీక్ష సన్నద్ధతకు తమకు సమయం లేకుండా పోతోందని అంటున్నారు. దీనివల్ల తాము మళ్లీ నష్టపోతామని పేర్కొంటున్నారు. ఇవే కాకుండా జేఈఈ మెయిన్‌కు ఎన్‌టీఏ పేర్కొన్న అర్హతల్లోనూ కొన్ని సడలింపులు ఇవ్వాలని కొందరు తొలి నుంచి కోరుతున్నారు. ఈ అర్హతలపైన కూడా న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

ఇంటర్‌లో 75 శాతం ఉత్తీర్ణత నిబంధనపైనా..

ఇంకోవైపు జేఈఈ అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు సాధించి ఉండాలన్న నిబంధనను ఎన్‌టీఏ గత మూడేళ్లుగా రద్దు చేసింది. కోవిడ్ కారణంగా తరగతులు, పరీక్షలు జరగకపోవడంతో ఈ మేరకు వెసులుబాటు ఇచ్చింది. అయితే కోవిడ్ తగ్గుముఖం పట్టడం, కళాశాలలు రెగ్యులర్‌గా నడుస్తుండటంతో ఈసారి మళ్లీ 75 శాతం మార్కుల నిబంధనను పునరుద్ధరించింది. జేఈఈ మెయిన్‌లో మంచి స్కోరు సాధించిన అభ్యర్థులు ఎన్ఐటీలు, ఐఐఐటీలు తదితర సంస్థల్లో ప్రవేశాలు పొందాలంటే ఇంటర్‌లో 75 శాతం (ఎస్సీ, ఎస్టీలకు 65 శాతం) మార్కులు సాధించాల్సి ఉంటుంది. దీంతో తాము జేఈఈ మెయిన్‌లో మంచి స్కోరు సాధించినా.. ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించి ఉండాలన్న నిబంధన తమ అవకాశాలకు గండి కొడుతుందని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. కాబట్టి ఈ నిబంధనను ఈసారి కూడా మినహాయించాలని కోరుతున్నారు. ఈ అంశాలన్నిటిపైనా ఎన్‌టీఏ ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువరించలేదు.

ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం

- 823వ రోజు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : అమరావతి ఉద్యమానికి ఆదరణ కొరవడటంతో ప్రజలను రెచ్చగొట్టేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నాడని బహుజన పరిరక్షణ సమితి నేతలు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 823వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు గురువారం పలువురు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన దోపిడీ కోసం కుల రాజధానిని నిర్మించుకుని తరతరాలు ఈ ప్రాంతంలో ఆధిపత్యం కొనసాగించేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి చంద్రబాబు తెరలేపారని విమర్శించారు. ఇప్పుడు ఈ గుట్టు రట్టవడంతో అమరావతి ఉద్యమాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, దీంతో బాబు బరితెగించి ప్రజలను రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు. జనాన్ని ఎక్కువగా చూపించేందుకు ఇరుకు సందుల్లో సభలు నిర్వహిస్తూ జనం ప్రాణాలు తీస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రచార ఆర్భాటానికి నెల్లూరులో 8 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు లైంగికదాడి నిందితులకు 20 ఏళ్ల జైలు

విశాఖ లీగల్: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరూ రూ.10 వేల చొప్పున జరిమానా చెల్లించాలని నగరంలోని మహిళా కోర్టు కమ్ 6వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి మోకా సువర్ణరాజు గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మామిడూరి శైలజ అందించిన వివరాలు.. నిందితులు మహమ్మద్ అమీర్ ఆలమ్, పోటేలు రంజీ, మహమ్మద్ అషరఫ్ న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదగంట్యాడ సమీప భానోజీతోట బాపూజీ కాలనీ నివాసులు. బాధిత చిన్నారి (10) కూడా కుటుంబ సభ్యులతో కలిసి అదే ప్రాంతంలో నివసించేది. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివేది. 2011 నవంబర్ 28న బాలిక తన సోదరికి జ్వరంగా ఉండడంతో రొట్టె కొనడానికి ఇంటి నుంచి బయటకు వచ్చింది. మహమ్మద్ అమీర్ ఆలమ్, పోటేలు రంజీ, మహమ్మద్ అషరఫ్ బాలికకు మాయమాటలు చెప్పి సమీపంలోని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి దారుణంగా ముగ్గురూ లైంగిక దాడికి పాల్పడ్డారు. చిన్నారి ఇంట్లో కనిపించకపోవడంతో బాలిక సోదరుడు ఆలమ్ గిర్ చుట్టుపక్కల వెతకగా సమీపంలోని పొదల వద్ద అత్యంత దయనీయ స్థితిలో కన్పించింది. వెంటనే బాధితురాలిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి దక్షిణ ఏసీపీ పి.త్రినాథ్ కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. ప్రాసిక్యూషన్ 26 మంది సాక్షులను విచారించింది. 11 ఏళ్లపాటు సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయమూర్తి గురువారం తీర్పు వెల్లడించారు.

సమాజాభివృద్ధికి విద్యార్థులూ కృషి చేయాలి

- ఏపీ ఉన్నత విద్య ప్లానింగ్ బోర్డు సమావేశం ప్రారంభం


సమావేశంలో పాల్గొన్న విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో బోర్డ్ చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

గుంటూరు రూరల్: ఏపీ ఉన్నత విద్య ప్లానింగ్ బోర్డు 4వ సమావేశం గురువారం గుంటూరులోని లాంఫాంలో ప్రారంభమైంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి.. ఉన్నత విద్యలో సమూల సంస్కరణలు, అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, సేవా దృక్పథాన్ని పెంపొందించడం, సమాజాభివృద్ధికి కృషి చేయడం వంటి కార్యక్రమాలను రెండు నెలలపాటు తప్పనిసరిగా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆలోచనలకు అనుగుణంగా ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా సాధన దిశగా చదువుల్లో మార్పులు రావాలన్నారు. జేఎన్‌టీయూ మాజీ వీసీ డాక్టర్ డీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. వృత్తి నైపుణ్యం పెంపొందించేలా విద్యా వ్యవస్థలో మార్పులు రావాలన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఏపీ ఎంతో ప్రగతిని సాధించిందని చెప్పారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఇతర రాష్ట్రాల కంటే ముందున్నామని చెప్పారు. ఉన్నత విద్య కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యలో నాణ్యతతో పాటు మౌలిక వసతులు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించాలన్నారు. సమావేశంలో బోర్డు వైస్ చైర్మన్ రామ్మోహనరావు, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలు పాల్గొన్నారు.

పొగమంచుతో విమానాలకు ల్యాండింగ్ కష్టాలు


పొగమంచులో ల్యాండింగ్ అవుతున్న ఎయిరిండియా విమానం

విమానాశ్రయం (గన్నవరం): దట్టమైన పొగమంచు రన్‌వే ప్రాంతాన్ని పూర్తిగా కప్పి వేయడంతో గన్నవరం విమానాశ్రయంలో గురువారం విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. తొలుత హైదరాబాద్ నుంచి ఉదయం 7.35 గంటలకు వచ్చిన ఇండిగో విమానం రన్‌వేపై దిగేందుకు విజిబిలిటీ లేకపోవడంతో 40 నిమిషాలు గాలిలో చక్కర్లు కొట్టింది. అయినప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సూచన మేరకు విమానం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయింది. ఉదయం 8.15 గంటలకు న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఎయిరిండియా విమానం కూడా ల్యాండింగ్‌కు అనుకూలంగా లేకపోవడంతో అరగంట పాటు గాలిలో చక్కర్లు కొట్టింది. ఒకసారి రన్‌వేపై విమానాన్ని ల్యాండ్ చేసేందుకు పైలెట్లు ప్రయత్నించినప్పటికి విజిబిలిటీ లేకపోవడంతో టేకాఫ్ తీసుకున్నారు. మరో ప్రయత్నంలో సురక్షితంగా విమానాన్ని ల్యాండింగ్ చేయడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. పొగమంచు ప్రభావం తగ్గిన తర్వాత హైదరాబాద్ తిరిగి వెళ్లిన ఇండిగో విమానం కూడా గన్నవరం ఎయిర్‌పోర్టుకి ఉదయం 10 గంటలు దాటిన తరువాత చేరుకుంది.

ఫాస్టాగ్ సేవలు ప్రారంభం

గన్నవరం విమానాశ్రయంలోని టోల్‌గేట్‌లో ఫాస్టాగ్ సేవలు గురువారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. రద్దీ సమయాల్లో టోల్‌గేట్ వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఈ సేవలను వినియోగంలోకి తీసుకువచ్చారు. టోల్‌గేట్ వద్ద జరిగిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న విమానాశ్రయ ఇన్‌చార్జ్ డైరెక్టర్ పీవీ రామారావు ఈ సేవలను ప్రారంభించారు.

ఎఫ్ఎంజీ నకిలీ సర్టిఫికెట్ల కుంభకోణం బట్టబయలు

- విజయవాడ, విశాఖ సహా దేశంలో 91 నగరాల్లో సీబీఐ సోదాలు



సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): దేశంలో ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ (ఎఫ్ఎంజీ) ఫేక్ సర్టిఫికెట్ల కుంభకోణం వెలుగు చూసింది. దాంతో సీబీఐ మన రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం సహా దేశంలోని 91 నగరాలు, పట్టణాల్లో గురువారం విస్తృతంగా సోదాలు నిర్వహించింది. ఎఫ్ఎంజీ ఫేక్ సర్టిఫికెట్లకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించింది. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన భారతీయ విద్యార్థులు మనదేశంలో వైద్యవృత్తి చేపట్టాలంటే ఎఫ్ఎంజీ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఈ పరీక్ష నిర్వహిస్తుంది. కాగా, ఇందులో ఉత్తీర్ణులు కాకుండానే ఉత్తీర్ణులైనట్లుగా దేశంలో 73మంది ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు సీబీఐ గుర్తించింది. ఆ ఫేక్ సర్టిఫికెట్లను ఆయా రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్లు సైతం ఆమోదించడం గమనార్హం. దీనిపై సీబీఐ ఈ నెల 22న కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా గురువారం దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించింది. ఈ ఫేక్ సర్టిఫికెట్లతో ప్రమేయం ఉన్న పలువురు ఎఫ్ఎంజీ గ్రాడ్యుయేట్లు, అందుకు సహకరించిన మెడికల్ కౌన్సిళ్లు, వైద్య సంస్థలను గుర్తించింది. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తామని సీబీఐ ప్రకటించింది.

మన రాష్ట్రంలోనూ నకిలీ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్

ఎఫ్ఎంజీ ఫేక్ సర్టిఫికెట్ల కుంభకోణానికి సంబంధించి విజయవాడలోని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ కార్యాలయంలో సీబీఐ అధికారులు ఈ నెల 23న తనిఖీలు నిర్వహించారు. 12 గంటలపాటు ఏకబిగిన కొనసాగిన ఈ సోదాల్లో 2014 నుంచి 18 మధ్య విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసి రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకున్న వైద్యుల వివరాలను పరిశీలించారు. ఇతర రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలు కొనసాగుతున్నంతసేపు కార్యాలయంలో అధికారులు, సిబ్బందిని బయటకు కూడా పంపించలేదు. కాగా గురువారం విజయవాడలోని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌తోపాటు విశాఖపట్నంలోనూ సీబీఐ సోదాలు నిర్వహించింది.

సంక్రాంతికి మరో 30 ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి పండుగ సెలవుల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ముఖ్య నగరాలకు మరో 30 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటికే జనవరి 1 నుంచి 20వ తేదీ వరకు 94 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించారు. అన్ని ప్రత్యేక రైళ్లకు ఈ నెల 31వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రిజర్వేషన్ సదుపాయం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. సికింద్రాబాద్–కాకినాడ టౌన్ (07048) జనవరి 6న, కాకినాడ టౌన్–సికింద్రాబాద్(07049) జనవరి 7న, హైదరాబాద్–నర్సాపూర్ (070 19) రైలు 7న, నర్సాపూర్–వికారాబాద్ (070 20) రైలు 8న, వికారాబాద్–నర్సాపూర్ (070 21) 9న, నర్సాపూర్–హైదరాబాద్ (07022) 10న, సికింద్రాబాద్–కాకినాడటౌన్ (07039) 9న, కాకినాడటౌన్–వికారాబాద్ (07040) 10న, వికారాబాద్–నర్సాపూర్ (07041) 11న, నర్సాపూర్–సికింద్రాబాద్ (07042) 12వ తేదీన నడపనున్నారు. హైదరా బాద్– మచిలీపట్నం (07011) 11, 13 తేదీల్లో, మచిలీ పట్నం–హైదరాబాద్ (07012) 12, 14 తేదీల్లో, సికింద్రాబాద్–కాకినాడ టౌన్ (07035) 11న, కాకినాడ టౌన్–వికారాబాద్ (07036) జనవరి 12న, వికారాబాద్–కాకినాడటౌన్ (07037) 13న, కాకినాడ టౌన్–సికింద్రాబాద్ (07038) 14న, సికింద్రాబాద్–నర్సాపూర్ (07023) 13న, నర్సాపూర్–సికింద్రాబాద్ (07024) 14న, సికింద్రాబాద్–కాకినాడ టౌన్ (07027) 16న, కాకినాడ టౌన్–సికింద్రాబాద్ (07028) 17న, సికింద్రాబాద్–కాకినాడ టౌన్ (07031) 15న, కాకినాడ టౌన్–వికారాబాద్ (07032) 16న, వికారాబాద్–కాకినాడ టౌన్ (07033) 17న, కాకినాడ టౌన్–సికింద్రాబాద్ (07034) 18న, హైదరాబాద్–నర్సాపూర్ (07015) 15, 17 తేదీల్లో, నర్సాపూర్–హైదరాబాద్ (07016) 16, 18 తేదీల్లో నడపనున్నారు.

శ్రీ పండమేటి వెంకటరమణ స్వామి దేవాలయము
రాప్తాడు (గ్రా॥ & మం॥), అనంతపురము జిల్లా.
e-Procurement Tender
NIT No. COE/874/2022-7
Dt : 18-08-2022
దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : జిల్లా దేవదాయ శాఖాధికారి

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
చీఫ్ ఇంజనీర్-II కార్యాలయం, APIIC లిమిటెడ్, 9వ అంతస్తు, APIIC టవర్-I, IT పార్క్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503. వెబ్: www.apiic.in,
ఇ-మెయిల్ ఐడీలు: chiefengineer2-ap@apiic.in; gm-electricals@apiic.in
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండర్ నోటీస్ నం.34/CE(S)/APIIC/2022-23, తేది:26-12-2022
T.N.No.34: YSR EMC, YSR కడప జిల్లా వద్ద RBF స్టాండర్డ్ ఫ్యాక్టరీ షెడ్ నం.లు 5 & 6 కు ఫైర్ ఫైటింగ్, ఫైర్ అలారం సిస్టమ్ మరియు స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు. ECV: రూ. 1,03,26,690.00. ప్రచురణ తేది: 26-12-2022 న సా.5.00 గం.లు, బిడ్ల దాఖలుకు ఆఖరి తేది: 09-01-2023న మ.3.00 గం.లు.
సం/- చీఫ్ ఇంజనీర్-II
టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్ www.apeprocurement.gov.in (లేదా) https://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
DPR RO No.1453PP/CL/ADVT/1/1/2021-22 Dt.29-12-2022

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్
చీఫ్ ఇంజనీర్-II కార్యాలయం, APIIC లిమిటెడ్, IT పార్క్, మంగళగిరి, www.apiic.in,
ఇ-మెయిల్ ఐడీలు: chiefengineer2-ap@apiic.in; g.nagabhushanam@gov.in
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
షార్ట్ టెండర్ నోటీస్ నం.37/CE-II/APIIC/2022-23, తేది:29-12-2022
T.N.No.37: కొప్పర్తి, YSR కడప జిల్లా వద్ద రైల్వే సైడింగ్ పని కోసం CD పనుల నిర్మాణం మరియు స్లీపర్స్ సరఫరా. ECV: రూ. 7,36,70,375/-. ప్రచురణ తేది: 29-12-2022న రా.8.00 గం.లు, బిడ్ల దాఖలుకు ఆఖరి తేది: 06-01-2023న మ.3.00 గం.లు.
సం/- చీఫ్ ఇంజనీర్-II
టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్: www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
DPR RO No.1455PP/CL/ADVT/1/1/2021-22 Dt.29-12-2022

పుర పరిపాలనా శాఖ, పిడుగురాళ్ల పురపాలక సంఘం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
[illegible] 575218, 575219, 575220, 575221, 575223, 575224, 575225, 578748, 579058, 579732, 579918, 579919, 579921, 579922, 579927, 579948, 579957, 579978, 579981, 579990 [illegible] www.apeprocurement.gov.in [illegible] 06-01-2023
కమీషనరు, పిడుగురాళ్ల పురపాలక సంఘం

ఏ.పి. స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
నిర్మాణ్ భవన్, ప్లాట్ నం.11&12, ఆటోనగర్, విజయవాడ - 520007
టెండరు కోరుతూ ప్రకటన
NIT No.2948/3rd Call/APSHCL/R&R Polavaram/Velagapalli/RCVM/2022, తేది: 28.12.2022
ఆంధ్రప్రదేశ్‌లోని "ASR జిల్లాలోని రంపచోడవరం డివిజన్‌లోని దేవీపట్నం మండలంలోని వెలగపల్లి లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలతో 102 ఇళ్ల నిర్మాణం" కోసం టెండర్లు కోరబడుచున్నవి. వివరాలను 30-12-2022 ఉ.11.00 గం. నుండి ఏపి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీర్, APSHCL, విజయవాడ
DIPR RO No.1454PP/CL/Adv/1/1/2021-22, Dt: 29.12.2022

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY KAKINADA
KAKINADA - 533 003, Andhra Pradesh, India
ENGINEERING DEPARTMENT
e-Procurement Tender Notice
Tender Notice No.18/JNTUK/ED/KKD/2022-23 Date : 28.12.2022

S.No.	Name of the Work	Value in Rs. (Approx)
	JNTUK, KAKINADA CAMPUS	
1	Providing Cupboards to Bedrooms of B2 Type Quarters at JNTUK, Kakinada	Rs.8.43 Lakhs

The bidders can view /down load from www.apeprocurement.gov.in market place. Further details contact at Office of Chief Engineer, JNTUK, Kakinada
Sd/- Chief Engineer, Ph. No. 0884-2300984

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజి & అప్లైడ్ న్యూట్రిషన్
(పర్యాటక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ పరిధిలోని స్వయంప్రతిపత్తిగల సంస్థ)
F-రో, D.D.కాలని, విద్యానగర్, హైదరాబాద్-500007 (T.G.) ఫోన్: 040-27427569, మొబైల్: 8374787988
ఇ-మెయిల్: ihmhyd.principal@gmail.com; వెబ్‌సైట్: www.ihmhyd.org
దిగువ తెలిపిన ఉద్యోగానికి ఆన్‌లైన్ దరఖాస్తు కోరబడుచున్నది
అడ్మినిస్ట్రేటివ్–కమ్–అకౌంట్స్ ఆఫీసర్
(డెప్యూటేషన్ ప్రాతిపదికన)
తదుపరి వివరాలకు దిగువ తెలిపిన ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్‌కు లాగాన్ అవండి:
www.ihmhyd.org
సం/- ప్రిన్సిపాల్/సెక్రటరీ

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Head Office: D.No.10-152/1, Sri Sai Towers, 4th & 5th Floor, Ashok Nagar, Besides Siri's Company, Bandar Road, Kanuru, VIJAYAWADA-520007.
SHORT TENDER NOTICE
No.Mktg/M6/RG Dal/tenders/291222 /2022-23 Dated: 29.12.2022
Empanelment and appointment of suppliers for supply of 7,500 MTS Redgram Dal (Fatka) variety in 1 KG packet form with secondary packaging in 50 kg PP bags to all the MLS Points of APSCSCL in all the districts across the Andhra Pradesh State for distribution under PDS and other welfare schemes through NCDEX e Markets Ltd auction platform.
All the interested Redgram Dal Millers/ Manufacturers/Bulk Suppliers/ Traders/ Processors are invited for registration as supplier to participate through e-reverse auction conducting on NCDEX e Markets Ltd auction platform on behalf of APSCSCL Ltd. for supply of 7,500 MTS Redgram Dal (Fatka) variety in 1 KG packet form with secondary packaging in 50 kg PP bags to all the MLS Points of APSCSCL in all the districts across the Andhra Pradesh State for distribution under PDS and other welfare schemes. The interested suppliers may visit or apscsc.in for Zone-wise Tender Quantity, application forms and detailed terms & conditions for registration may visit website www.neml.in
Last date for online registration and completion of formalities for submitting the online tenders shall be up to 05.01.2023.
The date of online e-reverse auction through www.neml.in/platform will be on 07.01.2023 from 1.00 pm onwards.
Sd/- G.VEERAPANDIAN, IAS, VC & Managing Director

పురపరిపాలనశాఖ
పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘం
టెండరు నోటీసు
రోక్తా నెం. 1432/2017/E1/-, 1st Call BOQ No's 793,794 (Reverse Tendering) తే.30.12.2022 ది
పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘంలో 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టు పనులకు ఇ- ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.
పనుల సంఖ్య: 02 అంచనా విలువ సుమారు రూ. 238.40 లక్షలు

Bid Document Download Start Date & Time	: 30.12.2022 11.00 AM
Bid Document Download End Date & Time	: 17.01.2023 03.30 PM
Bid Submission Closing Date & Time	: 17.01.2023 03.30 PM
Bid Document Open Date & Time	: 17.01.2023 04.30 PM

మిగతా వివరములకు ఆఫీసు పనివేళలలో తెలుసుకొనవచ్చును మరియు అంతర్జాలములో https://tender.apeprocurement.gov.in
సం/- టి. రాజగోపాలరావు,
కమిషనరు, పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘం

క్లుప్తంగా...

ఇజ్రాయెల్ ప్రధానిగా మళ్లీ నెతన్యాహు

జెరుసలేం: ఇజ్రాయెల్ ప్రధానమంత్రిగా లికుడ్ పార్టీ చీఫ్ బెంజమిన్ నెతన్యాహు(73) ఆరోసారి ప్రమాణం చేశారు. 120 మంది సభ్యులుండే నెస్సెట్(పార్లమెంట్)లో గురువారం జరిగిన బలపరీక్షలో నెతన్యాహుకు అనుకూలంగా 69 మంది, వ్యతిరేకంగా 54 మంది సభ్యులు ఓటేశారు. నెతన్యాహు బలహీనుడంటూ నినాదాలు చేసిన పలువురు ప్రతిపక్ష సభ్యులను సభ నుంచి బహిష్కరించారు. అనంతరం నెతన్యాహు పదవీ ప్రమాణం చేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల పెద్ద సంఖ్యలో జనం గుమికూడి నూతన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనకు దిగారు. కొత్తగా సంకీర్ణంలో లికుడ్ పార్టీతోపాటు ఛాందసవాద షాస్, యునైటెడ్ టోరా జుడాయిజం, ఓట్జ్మా యెహుడిట్, జియోనిస్ట్, నోమ్ పార్టీలున్నాయి.

జోడో యాత్రలో భద్రతా వైఫల్యాల్లేవ్: కేంద్రం

న్యూఢిల్లీ: భారత్ జోడో యాత్రలో భద్రతా వైఫల్యాలు కనిపిస్తున్నాయంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వ అధికారులు గురువారం ఖండించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆయన 2020 నుంచి ఇప్పటిదాకా 113 సార్లు సెక్యూరిటీ ప్రొటోకాల్స్ ఉల్లంఘించారని ఆక్షేపించారు. ఢిల్లీలో పాదయాత్ర కొనసాగిస్తున్న రాహుల్ గాంధీకి తగిన భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమవుతున్నారని కాంగ్రెస్ పార్టీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాసిన నేపథ్యంలో కేంద్రం పైవిధంగా వివరణ ఇచ్చింది.

బాలికపై అత్యాచారం
మహంత్ సర్జూదాస్ మహారాజ్ అరెస్ట్

జైపూర్: రాజస్తాన్‌లోని బిల్వారా జిల్లాలో 17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహంత్ సర్జూదాస్ మహారాజ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని బుధవారం అతడి ఆశ్రమంలోనే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. పోక్సో చట్టం, ఐపీసీ సెక్షన్ 376 కింద కేసు నమోదు చేశారు. సర్జూదాస్ మహారాజ్‌ను స్థానిక కోర్టులో హాజరుపర్చగా, జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. అతడు గత రెండేళ్లుగా తనపై అత్యాచారానికి పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ బాధితురాలు ఇటీవలే పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహంత్ సర్జూదాస్ మహారాజ్‌కు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఐదు సొంత ఆశ్రమాలు ఉన్నాయి.

ఫిబ్రవరి 21 నుంచి యూజీసీ నెట్

న్యూఢిల్లీ: అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అర్హత పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఎన్‌ఈటీ)ను 2023 ఫిబ్రవరి 21 నుంచి మార్చి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గురువారం తెలిపింది. ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) 83 సబ్జెక్టుల్లో ఉంటుందని పేర్కొంది. డిసెంబర్ 29 నుంచి జనవరి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. భారతీయ వర్సిటీలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, జూనియర్ రీసెర్చి ఫెలోషిప్(జేఆర్ఎఫ్)లుగా అర్హతగా పరిగణించే ఈ పరీక్షను ఏడాదిలో రెండు పర్యాయాలు నిర్వహిస్తారు.

తైవాన్‌కు రూ.1,490 కోట్ల రక్షణ సామగ్రి

వాషింగ్టన్: ఇటీవలి కాలంలో చైనా నుంచి పెరిగిన ముప్పును దృష్టిలో ఉంచుకుని తైవాన్‌కు యాంటీ ట్యాంక్ మైన్ లేయింగ్ వ్యవస్థను విక్రయించాలని అమెరికా నిర్ణయించింది. రూ.1,490 కోట్ల విలువైన 'వొల్కనో'వ్యవస్థ, సంబంధిత సామగ్రిని ఆ దేశానికి సరఫరా చేయనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. చైనా దురాక్రమణకు పాల్పడిన పక్షంలో ఇటువంటి వ్యవస్థలు తైవాన్‌కు ఎక్కువ అవసరమవుతాయని నిపుణులు అంటున్నారు. అమెరికా హౌస్ స్పీకర్ నాన్సీ పెలోసీ ఆగస్టులో తైవాన్‌లో పర్యటించిన తర్వాత చైనా దుందుడుకు చర్యలు పెరిగాయి.

కేసినోలో అగ్ని ప్రమాదం.. 19 మంది మృతి

నాంఫెన్: కాంబోడియా–థాయ్‌ల్యాండ్ సరిహద్దు పట్టణం పోయిపేట్‌లోని గ్రాండ్ డైమండ్ సిటీ కేసినోలో జరిగిన అగ్ని ప్రమాదంలో 19 మంది మృతి చెందగా 60 మందికి పైగా గాయపడ్డారు. 15 అంతస్తులున్న ఈ కేసినో భవనంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో చెలరేగిన మంటలను గురువారం మధ్యాహ్నం 2 గంటల వరకు అతికష్టమ్మీద ఆర్పగలిగారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరగొచ్చని భావిస్తున్నారు. బాధితుల్లో కాంబోడియా, థాయ్‌ల్యాండ్ వాసులతోపాటు వియత్నాం, చైనా, మలేసియా పౌరులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా చేపట్టిన భారీ విద్యుత్ దీపాల అలంకరణలే కేసినోలో ప్రమాదానికి దారి తీసి ఉండొచ్చని భావిస్తున్నారు.

నిలకడగా హీరాబెన్ ఆరోగ్యం

అహ్మదాబాద్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ప్రధాని మోదీ తల్లి హీరాబెన్ కోలుకుంటున్నట్లు ఆస్పత్రి వర్గాలు గురువారం వెల్లడించాయి. 99 ఏళ్ల హీరాబెన్‌ను బుధవారం అహ్మదాబాద్‌లోని యూఎన్ మెహతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీ, రీసెర్చ్ సెంటర్‌లో చేర్పించిన విషయం విదితమే. 'ఆమె నెమ్మదిగా కోలుకుంటున్నారు. కాళ్లు, చేతులు కదపగలుగుతున్నారు. ద్రవాహారం తీసుకుంటున్నారు. ఈరోజు మళ్లీ సీటీ స్కాన్, ఎంఆర్ఐ తీసిన తర్వాత వైద్యుల నిర్ణయం మేరకు డిశ్చార్జ్ ఉండొచ్చు' అని మోదీ పెద్దన్నయ్య సోమాభాయ్ మోదీ చెప్పారు.

ఓటు వెయ్యాలంటే సొంతూరు వెళ్లనక్కర్లేదు

- ఉన్న చోటు నుంచి ఓటు వెయ్యడం కోసం రిమోట్ కంట్రోల్ ఓటింగ్ మిషన్‌లు
- కొత్త ఆలోచన చేసిన ఈసీ, జనవరి 16న రాజకీయ పార్టీలకు డెమో

న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెంచే దిశగా కృషి చేస్తున్న ఎన్నికల కమిషన్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల సమయంలో దేశీయంగా వలస వెళ్లిన వారు తామున్న చోటు నుంచే తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా రిమోట్ కంట్రోల్ ఓటింగ్ మిషన్ (ఆర్‌వీఎం) రూపొందించింది. ప్రస్తుతం అభివృద్ధి చేసిన నమూనా ఆర్‌వీఎంను అన్ని రాజకీయ పక్షాలకు జనవరి 16న డెమో ఇవ్వనున్నట్టు ఈసీ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అందరితో సంప్రదింపులు జరిపి దీనిని అమల్లోకి తీసుకువస్తే సొంతూరుకి వెళ్లకుండానే ఓటర్లు తమ ప్రాంతం నుంచి ఓటు హక్కుని వినియోగించుకోవచ్చు.

ఎలా పని చేస్తుంది?

ఒక ప్రభుత్వ రంగ సంస్థ రూపొందించిన ఈ రిమోట్ ఈవీఎం నుంచి 72 నియోజకవర్గాల్లో ఓటు హక్కుని వినియోగించుకోవచ్చు. ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో రిమోట్ పోలింగ్ బూతుని ఏర్పాటు చేస్తే దాని ద్వారా 72 నియోజకవర్గాల్లో ఎక్కడ ఓటు హక్కు ఉన్నా వినియోగించుకోవచ్చు.



సాంకేతిక సమస్యలు అధిగమించాలి : సీఈసీ

ఈ రిమోట్ ఈవీఎంలను వినియోగించుకోవడంలో సాంకేతికపరమైన, న్యాయపరమైన సమస్యల్ని అధిగమించాల్సి ఉందని భారత ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ చెప్పారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఒక కాన్సెప్ట్ నోట్‌ను ఈసీ రూపొందించింది. ఈ ఆర్‌వీఎంలను ఆచరణలో తీసుకువచ్చినప్పుడు ఎదురు కానున్న న్యాయపరమైన, సాంకేతికపరమైన, పాలనాపరమైన సవాళ్లను గుర్తించి వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. అన్ని అడ్డంకుల్ని దాటుకొని ఆర్‌వీఎంల వినియోగం మొదలైన రోజు వలసదారుల సామాజిక పరివర్తన మొదలవుతుందని కేంద్ర ఎన్నికల కమిషన్ అభిప్రాయపడింది.

ఎందుకీ ఆర్‌వీఎంలు ?

మన దేశంలో ఎంతోమంది విద్య, పెళ్లి, ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారు. ఎన్నికల సమయంలో సొంతూరుకి వెళ్లడానికి ప్రయాణ ఖర్చులు భరించలేకపోవడం, ఇతరత్రా కారణాలతో ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారు. తామున్న ప్రాంతంలో ఓటరు జాబితాలో పేరుని నమోదు చేయించుకోకపోవడానికి కూడా ఎన్నో కారణాలుంటున్నాయి. తరచూ ఇళ్లు మారుతూ ఉండడం, తాముండే ప్రాంతంతో ఒక భావోద్వేగ బంధం ఏర్పడకపోవడం వంటి కారణాలతో ఓటర్ల జాబితాలో పేరు రిజిస్టర్ చేసుకోవడం లేదు. 2019 లోక్ సభ ఎన్నికల్లో దాదాపుగా 30 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఇది అత్యంత ఆందోళన కలిగించే అంశం. మన దేశంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు 85% వరకు వలస వెళ్లారు. వీరంతా ఉన్న చోటు నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చేయాలన్న ఉద్దేశంతో ఈసీ ఈ కొత్త ఆలోచన చేసింది.

యుద్ధ విమానం నుంచి బ్రహ్మోస్ ప్రయోగం



న్యూఢిల్లీ: భారత రక్షణ రంగం మరింత బలోపేతమయ్యే దిశగా కీలక ముందడుగు పడింది. సుఖోయ్–30 యుద్ధ విమానం నుంచి బ్రహ్మోస్ ఎక్స్‌టెండెడ్ రేంజ్ క్షిపణిని గురువారం బంగాళాఖాతంలో పరీక్షించారు. బ్రహ్మోస్ ప్రయోగం విజయవంతమై 400 కి.మీ. దూరంలో ఉన్న నౌకను పేల్చేసింది. ''భారత వాయుసేన సుఖోయ్ యుద్ధ విమానం నుంచి ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణి నిర్దేశిత లక్ష్యాలను కచ్చితంగా ఛేదించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో ఉపరితలం, సముద్ర మార్గంలో సుదూర లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం వైమానిక దళానికి లభించినట్టయింది'' అని రక్షణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ క్షిపణి ప్రయోగం విజయవంతం కావడంతో వాయుసేనకు ఒక వ్యూహాత్మక బలం సమకూరిందని తెలిపింది. భవిష్యత్‌లో కదన రంగాలలో భారత వాయుసేన తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి ఈ క్షిపణి పనితీరు దోహదపడుతుందని రక్షణ శాఖ తెలిపింది. భారత వాయుసేన, నావికాదళం, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ), హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), బ్రహ్మోస్ ఏరోస్పేస్ (బీఏపీఎల్) సంయుక్తంగా చేసిన కృషితో ఈ క్షిపణి ప్రయోగం విజయవంతమైందని పేర్కొంది. యుద్ధ విమానం నుంచి సుఖోయ్‌ని ప్రయోగించడం ఇది తొలిసారి కాదు. ఈ ఏడాది మేలో సూపర్‌సోనిక్ మిస్సైల్ ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌ను సుఖోయ్ యుద్ధ విమానం నుంచి విజయవంతంగా పరీక్షించారు. ఇప్పుడు క్షిపణి పరిధిని 290 కిలోమీటర్ల స్థాయి నుంచి 400 కిలోమీటర్లకు పెంచారు.

పాపులర్ ఫ్రంట్‌పై ఎన్ఐఏ గురి

న్యూఢిల్లీ: నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)తోపాటు దాని అనుబంధ సంస్థలపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు దృష్టి పెట్టారు. చట్టవ్యతిరేక, హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సదరు సంస్థలపై ఇప్పటికే కేసు నమోదయ్యింది. కేసు దర్యాప్తులో భాగంగా కేరళలో 12 జిల్లాల్లో పీఎఫ్ఐ, అనుబంధ సంస్థలకు సంబంధించిన 56 ప్రాంతాల్లో గురువారం అధికారులు సోదాలు నిర్వహించారు. పీఎఫ్ఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, జోనల్ హెడ్స్, ఫిజికల్ ట్రెనింగ్ ఇన్‌స్ట్రక్టర్స్–ట్రైనర్స్‌తోపాటు మారణాయుధాలు ఉపయోగించడంలో శిక్షణ పొందిన మరికొందరి నివాసాల్లో సోదాలు చేసినట్లు ఎన్ఐఏ ప్రతినిధి చెప్పారు. మరో 20 మంది అనుమానితుల ఇళ్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆయుధాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పీఎఫ్ఐ, అనుబంధ సంస్థలపై గతంలోనే కేసు నమోదు చేసింది.

సీటుబెల్ట్ ధరించక 16 వేల మంది మృతి

- హెల్మెట్ పెట్టుకోకపోవడంతో 46,593 మంది..
- 2021లో జరిగిన రోడ్డు ప్రమాదాలపై కేంద్రం నివేదిక



న్యూఢిల్లీ: దేశంలో 2021లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల 16,397 మంది చనిపోయారు. వీరిలో 8,438 మంది సంబంధిత వాహనాల డ్రైవర్లు కాగా, 7,959 మంది ప్రయాణికులున్నారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించక పోవడం వల్ల 46,593 మంది మృతి చెందారు. వీరిలో 32,877 మంది వాహనచోదకులు, మిగతా 13,716 మంది ప్రయాణికులు. కేంద్ర రోడ్డు రవాణా హైవేల శాఖ ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. 2021లో దేశవ్యాప్తంగా జరిగిన 4,12,432 రోడ్డు ప్రమాదాల్లో 1,53,972 మంది దుర్మరణం పాలవగా, 3,84,448 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో హెల్మెట్ ధరించని వారు 93,763 మంది, సీటు బెల్ట్ ధరించని వారు 39,231 మంది అని పేర్కొంది. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 8.2% డ్రంకెన్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, జంపింగ్ రెడ్ లైట్, సెల్ ఫోన్ వాడకం వంటి కారణాలతోనే జరిగాయని తెలిపింది. జాతీయ రహదారులపై జరిగే 9.35% ప్రమాద మరణాలకు ఇవే కారణాలని తెలిపింది. 67.5% ప్రమాదాలు తిన్నగా ఉండే రహదారులపై జరుగుతున్నాయి. గుంతలు, ఇరుకుగా, ఏటవాలుగా ఉండే రోడ్లపై 13.9% ప్రమాదాలు జరుగుతున్నాయని విశ్లేషించింది. కూడళ్లలో 20% ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. టి–జంక్షన్లలో జరిగే ప్రమాదాల్లోనే ఎక్కువ మంది చనిపోవడమో, గాయపడటమో జరుగుతోందని తెలిపింది. 2021లో అనుకూల వాతావరణ పరిస్థితుల్లోనే నాలుగింట మూడొంతుల ప్రమాదాలు సంభవించగా, మంచు, వర్షం, గాలుల తీవ్రత వల్ల 16% ప్రమాదాలు జరిగాయని వివరించింది. దేశంలో రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరిగే రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్తాన్‌లు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి.

హమ్మయ్య.. సూర్యుడు కనిపించాడు

- బఫెలో నగరంలో రాకపోకల పునరుద్ధరణ
- మంచుతుఫాన్ బాధితుల కోసం గాలింపు చర్యలు


బఫెలో సిటీలోని జెఫర్సన్ అవెన్యూలో మొదలైన వాహనాల రాకపోకలు

న్యూయార్క్: అమెరికాలో గత కొద్ది రోజులుగా మంచు తుఫాన్‌కు అల్లాడిపోయిన న్యూయార్క్ రాష్ట్రంలోని బఫెలో సిటీలో ఎట్టకేలకు సూర్యరశ్మి కనిపించింది. గురువారం ఉదయం సూర్యుడి రాకతో కాసేపు వాతావరణం వెచ్చగా మారడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో ప్రజల క్షేమ సమాచారాలు తెలుసుకోవడానికి నేషనల్ గార్డ్ అధికారులు ఇంటింటికి వెళ్తున్నారు. విద్యుత్ సౌకర్యం పోయిన ఇళ్లకి వెళ్లి వారు ఎలా ఉన్నారో వాకబు చేస్తున్నారు. తీవ్రమైన మంచు కురుస్తున్నప్పుడు కరెంట్ పోయిన సమయంలో ఆక్సిజన్ వెంటిలేషన్ మీద ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర సహాయం అందక కొందరు మృతి చెందిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. రహదారులపై కొన్ని అడుగుల మేర పేరుకుపోయిన మంచు కరిగితే ఇంకా ఎన్ని మృతదేహాలు బయటకు వస్తాయోనన్న ఆందోళనైతే నెలకొంది. బఫెలో నగరంలో రాకపోకల్ని పునరుద్ధరించారు. భారీ యంత్రాల సాయంతో రహదారులపై ముంచెత్తిన మంచుని తొలగించే పని యుద్ధ ప్రాతిపదికన జరుగుతోందని బఫెలో నగర మేయర్ బైరన్ బ్రౌన్ వెల్లించారు. అత్యవసరమైతే తప్ప ఇంకా ఇంటి నుంచి బయటకు రావొద్దని ఆయన నగర ప్రజలను హెచ్చరించారు. అమెరికాలోని మరికొన్ని రాష్ట్రాల్లో మంచు ముంచేయడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాతావరణం మైనస్ డిగ్రీలకు పడిపోవడంతో నీటి పైపులు పగిలిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజులుగా కుదిపేసిన మంచు తుఫాన్ కాస్త శాంతించినట్టే కనిపిస్తోంది.

ఉజ్బెక్‌లో 'దగ్గు సిరప్'పై దర్యాప్తు

- సీడీఎస్సీఓ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- ఆరోగ్య శాఖ మంత్రి మాండవీయ
- సిరప్ ఉత్పత్తిని నిలిపివేశామన్న మరియోన్ బయోటెక్ సంస్థ

న్యూఢిల్లీ: భారత్‌లో తయారు చేసిన దగ్గు సిరప్ కారణంగా ఉజ్బెకిస్తాన్‌లో 18 మంది చిన్నారులు మరణించారంటూ వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలు నిగ్గుతేల్చడానికి సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్సీఓ) దర్యాప్తు ప్రారంభించింది. ఈ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా సిరప్ తయారీ సంస్థపై తదుపరి చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆరోగ్య మంత్రి మాండవీయ తెలిపారు. ఉజ్బెకిస్తాన్ నేషనల్ డ్రగ్ రెగ్యులేటర్‌తో కలిసి సీడీఎస్సీఓ దర్యాప్తు కొనసాగిస్తోందని వెల్లడించారు. నోయిడా ప్లాంట్ నుంచి దగ్గు సిరప్ శాంపిల్స్‌ను సేకరించి, పరీక్ష కోసం చండీగఢ్‌లోని రీజినల్ డ్రగ్స్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించామని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఇథైలీన్ గ్లైకాల్ అనే రసాయనం ఆనవాళ్లు కనిపించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు. నోయిడాలోని మరియోన్ బయోటెక్ సంస్థ తయారు చేసి 'డోక్–1–మ్యాక్స్' సిరప్ వల్ల తమ దేశంలో 18 మంది పిల్లలు చనిపోయారని ఉజ్బెకిస్తాన్ భారత్ దృష్టికి తెచ్చింది. డోక్–1–మ్యాక్స్ సిరప్, ట్యాబ్లెట్లు తయారీ చేసి, ఎగుమతి చేసేందుకు మరియోన్ బయోటెక్ సంస్థకు యూపీ సర్కార్ లైసెన్స్ ఇచ్చింది. ప్రస్తుతానికి తయారీని నిలిపివేశామని మరియోన్ బయోటెక్ ప్రతినిధి హసన్ హరీస్ చెప్పారు.

వివరాలు కోరాం: బాలల మృతికి సంబంధించిన వివరాలను ఉజ్బెకిస్తాన్ నుంచి కోరామని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. దర్యాప్తులో భాగంగా ఈ వివరాలు ఇవ్వాలంది. భారత అధికారులు ఉజ్బెకిస్తాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలియజేసింది. ఈ వ్యవహారంపై తాష్కెంట్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దగ్గు సిరప్ వల్ల 18 మంది చిన్నారులు మరణించిన ఘటనపై ఉజ్బెకిస్తాన్ అధికారులు చేపట్టిన దర్యాప్తు వివరాలను భారత్‌కు అందజేయాలని సూచించామని తెలిపింది.



తగినన్ని ఔషధ నిల్వలు సిద్ధం చేయండి

- ఫార్మా కంపెనీలకు మన్‌సుఖ్ మాండవీయ వినతి
- కోవిడ్–19 మేనేజ్‌మెంట్ డ్రగ్స్ లభ్యతపై సమీక్ష

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో కరోనా పాజిటివ్ కేసులు మరోసారి పెద్దసంఖ్యలో పెరుగుతున్న నేపథ్యంలో మనదేశంలోనూ అందరూ అప్రమత్తం కావాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ గురువారం చెప్పారు. కరోనా నియంత్రణకు అవసరమైన ఔషధాలతోపాటు అన్ని రకాల ఔషధ నిల్వలను సిద్ధం చేయాలని ఫార్మా కంపెనీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తగినన్ని నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిటైల్ స్థాయి వరకు ఔషధాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కోవిడ్–19 మేనేజ్‌మెంట్ డ్రగ్స్ లభ్యత, ఉత్పత్తి సామర్థ్యంపై మంత్రి గురువారం ఫార్మా కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరోనా వ్యాప్తి విషయంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. దేశంలో మహమ్మారి వ్యాప్తి ఉధృతంగా ఉన్న సమయంలో ఫార్మా కంపెనీలు అందించిన సేవలను మన్‌సుఖ్ మాండవీయ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఫార్మా కంపెనీల కృషి వల్లే మన దేశానికి అవసరమైన ఔషధాలను, కరోనా టీకాలను ఉత్పత్తి చేసుకోవడంతోపాటు 150 దేశాలకు సైతం ఎగుమతి చేయగలిగామని కొనియాడారు. ధరలు పెంచకుండా, నాణ్యత తగ్గించకుండా ఈ ఘనత సాధించామని హర్షం వ్యక్తం చేశారు.


హిమాచల్‌లోని లాహౌల్ స్పితిలో తక్కువ ఉష్ణోగ్రతకు పాక్షికంగా గడ్డకట్టుకుపోయిన జలపాతం

నిరాడంబరంగా అనంత్ అంబానీ నిశ్చితార్థం

న్యూఢిల్లీ: అపర కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ రెండో కుమారుడు అనంత్ నిశ్చితార్థం పారిశ్రామికవేత్త వీరెన్ మర్చెంట్ కుమార్తె రాధికతో నిరాడంబరంగా జరిగింది. రాజస్తాన్‌లోని నాథ్‌ద్వారా పట్టణంలోని ప్రముఖ శ్రీనాథ్‌జీ ఆలయంలో గురువారం ఈ వేడుక నిర్వహించారు. ఈ నిశ్చితార్థ కార్యక్రమంలో అనంత్ తల్లిదండ్రులు ముకేశ్ అంబానీ, నీతూ, రాధిక తల్లిదండ్రులు వీరెన్ మర్చెంట్, శైల, వారి కుటుంబసభ్యులు, దగ్గరి బంధువులు, అత్యంత ఆప్తులు, స్నేహితులు పాల్గొన్నారు. అయితే, అనంత్, రాధికల పెళ్లి తేదీని ముకేశ్ అంబానీ కుటుంబం ఇంకా ప్రకటించలేదు. అనంత్, రాధిక కొన్ని సంవత్సరాలుగా స్నేహితులుగా కొనసాగుతున్న విషయం తెల్సిందే. ముంబైలోని జియో వరల్డ్ సెంటర్‌లో ఈ జూన్‌లో రాధిక భరతనాట్య అరంగేట్ర కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా ముకేశ్ కుటుంబం జరిపించడం విశేషం. రాధిక తండ్రి ఎన్‌కోర్ హెల్త్‌కేర్‌కు సీఈవో. అనంత్ అమెరికాలోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో చదువుకోగా, రాధిక న్యూయార్క్ వర్సిటీలో గ్రాడ్యుయేట్. అనంత్ తమ రిలయన్స్ గ్రూప్‌లో టెలికం, డిజిటల్, రిటైల్ వెంచర్స్, ఎనర్జీ వ్యాపార విభాగాల్లో బోర్డు సభ్యునిగా ఉన్నారు. ఎన్‌కోర్ హెల్త్‌కేర్‌లో రాధిక డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.


అనంత్ అంబానీ, రాధిక మర్చెంట్

ఉక్రెయిన్‌పై క్షిపణుల వర్షం

కీవ్: ఉక్రెయిన్‌లోని విద్యుత్ కేంద్రాలు, ఇతర కీలక మౌలిక వనరులే లక్ష్యంగా రష్యా మరోసారి భారీగా క్షిపణి దాడులకు పాల్పడింది. గురువారం ఒక్క రోజు వ్యవధిలోనే రష్యా ప్రయోగించిన 69 మిస్సైళ్లలో 54 క్షిపణులను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. రష్యా దురాక్రమణ మొదలయ్యాక ఇది 10వ అతిపెద్ద దాడి అని ఉక్రెయిన్ ప్రధాని డెనిస్ అభివర్ణించారు. బుధవారం రాత్రి నుంచి పేలుడు పదార్థాలతో కూడిన రష్యా డ్రోన్లు వివిధ ప్రాంతాల పైకి దూసుకొచ్చాయని తెలిపింది. దీంతో, దేశవ్యాప్తంగా ప్రజలను అప్రమత్తంగా చేస్తూ సైరన్లు మోగాయి. ఉక్రెయిన్‌కు చెందిన ఎస్–300 క్షిపణిని తమ బ్రెస్ట్ ప్రాంతంలో కూల్చివేశామని రష్యా మిత్ర దేశం బెలారస్ ప్రకటించింది. అది పొరపాటున వచ్చి ఉంటుందని, ఎటువంటి నష్టం వాటిల్ల లేదని తెలిపింది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ మధ్యవర్తిత్వంతో శాంతి చర్చలకు తాము సిద్ధమేనని ఉక్రెయిన్ తెలిపింది. అయితే, తాము ఆక్రమించిన ఉక్రెయిన్‌లోన భూభాగాలను తమవిగా ఒప్పుకుంటేనే చర్చలకు సిద్ధమని రష్యా తెగేసి చెప్పింది.

సమాచారం దాచి.. సంక్షోభం పెంచి

బీజింగ్: తొలిసారిగా వూహాన్‌లో కరోనా వైరస్ ఉద్భవించిన నాటి నుంచి చైనా అంతటా కోవిడ్ కరాళనృత్యం కొనసాగేవరకూ ఏ విషయాన్నీ స్పష్టంగా ప్రపంచదేశాలతో పంచుకోని చైనా మళ్లీ అదే పంథాలో వెళ్తోంది. దాంతో ఈసారి ఇంకా ఎలాంటి వేరియంట్లు పడగవిప్పుతాయో తెలీక ప్రపంచదేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. చైనా హఠాత్తుగా జీరో కోవిడ్ పాలసీ ఎత్తేశాక అక్కడ విజృంభించిన కరోనా కేసులు, కోవిడ్ మరణాల సంఖ్యపై ఎలాంటి సమగ్ర వివరాలను అధికారికంగా బయటపెట్టకపోవడంతో ప్రపంచ దేశాలను ఆందోళన చెందుతున్నాయి. దీంతో ముందస్తుచర్యగా చైనా నుంచి వచ్చే ప్రయాణికులకు కోవిడ్ టెస్ట్‌ను తప్పనిసరి చేస్తూ కొన్ని దేశాలు నిబంధనలు అమల్లోకి తెచ్చాయి. అమెరికా, భారత్, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, ఇటలీ, మలేసియా ఇప్పటికే చైనా ప్రయాణికులపై కోవిడ్ నిబంధనలను అమలుచేస్తున్నాయి. ' చాంద్రమాన నూతన సంవత్సరం సందర్భంగా 30,000 మంది తైవానీయులు చైనా నుంచి స్వదేశం వస్తున్నారు. ప్రతీ ఒక్కరినీ టెస్ట్ చేయాల్సిందే. చైనాలో ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై పారదర్శకత లోపించింది. చైనా ఇతరదేశాలతో సమాచారం పంచుకోకపోవడమే ఇక్కడ అసలు సమస్య' అని తైవాన్ ఎపిడమిక్ కమాండ్ సెంటర్ అధినేత వాంగ్ పీ షెంగ్ అన్నారు.

అప్పుడే సమగ్ర వ్యూహరచన సాధ్యం

ఎప్పటికప్పుడు డాటా ఇస్తున్నామని చైనా తెలిపింది. కాగా,'ఐసీయూలో చేరికలు, ఆస్పత్రుల్లో ఆందోళనకర పరిస్థితిపై పూర్తి సమాచారం అందాలి. అప్పుడే ప్రపంచదేశాల్లో క్షేత్రస్థాయిలో సన్నద్ధతపై సమగ్ర వ్యూహరచన సాధ్యమవుతుంది' అని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథోనోమ్ ఘెబ్రియేసెస్ అన్నారు. 'కరోనాను అంతం చేస్తామంటూ ప్రతిజ్ఞ చేసిన చైనా హఠాత్తుగా కోవిడ్ పాలసీని ఎత్తేయడం ఆందోళనకరం. చైనా దేశీయ పరిస్థితిని చక్కదిద్దాల్సిందిపోయి కోవిడ్ నిబంధనలను గాలికొదిలేయడంతో పశ్చిమదేశాలు ఆగ్రహంతో ఉన్నాయి' అని వాషింగ్టన్‌లోని మేథో సంస్థ హాడ్సన్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ మైల్స్ యూ వ్యాఖ్యానించారు.

చైనా నుంచి వస్తే నెగటివ్ రిపోర్ట్ తప్పనిసరి

జనవరి ఒకటి నుంచి అమలు: భారత్

న్యూఢిల్లీ: చైనా, హాంకాంగ్, జపాన్, దక్షిణకొరియా, సింగపూర్, థాయ్‌లాండ్ దేశాల నుంచి ఇండియాకు వచ్చే విమానప్రయాణికులు కచ్చితంగా ముందుగా కోవిడ్ నెగటివ్ రిపోర్ట్‌ను సమర్పించాలని భారత్ నిబంధన పెట్టింది. జనవరి ఒకటో తేదీ నుంచి దీనిని అమలుచేస్తారు. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ గురువారం చెప్పారు. అక్కడి నుంచి బయల్దేరడానికి ముందే ఎయిర్‌సువిధ పోర్టల్‌లో సంబంధిత రిపోర్ట్‌ను అప్‌లోడ్ చేయాలి. ఆ ఆర్‌టీ–పీసీఆర్ రిపోర్ట్ బయల్దేరడానికి 72 గంటలముందు చేసినదై ఉండాలి. ఒక్కో అంతర్జాతీయ విమానంలోని ప్రయాణికుల్లో 2 శాతం మందికి ర్యాండమ్‌గా ఇక్కడికొచ్చాక టెస్ట్‌చేస్తామని మంత్రి చెప్పారు. కాగా, భారత్‌లో గత 24 గంటల్లో 268 కరోనా కొత్త కేసులు నమోదయ్యాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 3,552కు చేరింది. రోజువారీ పాజిటివిటీ రేటు కేవలం 0.11 శాతంగా ఉంది.

చైనా ప్రయాణికులపై అమెరికా సైతం..

72 గంటల్లోపు సిద్ధమైన కరోనా నెగటివ్ రిపోర్ట్ ఉంటేనే అమెరికాలో అడుగుపెట్టాలని చైనా నుంచి రాబోయే అంతర్జాతీయ ప్రయాణికులకు అమెరికా సూచించింది. ఏ దేశ పౌరుడు, వ్యాక్సినేషన్ పూర్తయిందా లేదా అనే వాటితో సంబంధంలేకుండా ప్రతిఒక్కరికీ జనవరి ఐదు నుంచి ఇవే నిబంధనలు వర్తిస్తాయని అమెరికా తెలిపింది. ' ఆంక్షలు పెట్టినంతమాత్రాన చైనా నుంచి వైరస్ వ్యాప్తి అమెరికాలోకి ఆగదు. అయితే, చైనాలో కోవిడ్ పరిస్థితిపై మరింత సమాచారం రాబట్టేందుకు, చైనాపై ఒత్తిడి పెంచేందుకే అమెరికా ఇలా చేస్తోంది' అని జాన్ హాప్కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో వ్యాధుల నిపుణుడు డాక్టర్ డేవిడ్ డౌడీ అభిప్రాయపడ్డారు. చైనా నుంచి సమాచారం సంగతి పక్కనబెట్టి సొంతంగా కోవిడ్ కట్టడి వ్యూహాలకు అమెరికా మరింత పదును పెట్టాలని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయంలో వ్యాధుల నిపుణుడు డాక్టర్ స్ట్రాట్ క్యాంపబెల్ హితవుపలికారు.

సాక్షి విజయనగరం

శుక్రవారం । 30 । డిసెంబర్ । 2022



నైపుణ్యంతోనే నౌకరీ

యువతలో నైపుణ్యాన్ని మెరుగుపరచి ఉపాధి బాటలు వేసేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) అడుగులు వేస్తోంది. - 8లో



షటిల్ విజేత ఎస్.కోట

ఈ నెల 26 నుంచి బొబ్బిలిలోని మున్సిపల్ షటిల్ కోర్టులో మూడు రోజుల పాటు జరిగిన వైఎస్సార్ వీర బొబ్బిలి షటిల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌ను ఎస్.కోట జట్టు కైవసం చేసుకుంది. - 8లో



చెరకు తరలింపు

బొబ్బిలి ప్రాంతం నుంచి ఈ సీజన్‌లో 31వేల టన్నుల చెరకును సంకిలి సుగర్స్‌కు తరలించామని బొబ్బిలి డిప్యూటీ కేన్ కమిషనర్ జీబీవీ సత్యనారాయణ, ఫ్యాక్టరీ ఏజీఎం కె.అప్పారావులు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఆర్చరీ పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఆర్చరీ పోటీలకు విజయనగరానికి చెందిన పలువురు క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల పార్వతీపురం - మన్యం జిల్లాలో అండర్ - 14, 17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన ఎంపిక పోటీల్లో నగరంలోని పీఎస్ఆర్ పాఠశాలకు చెందిన డి.ధీరజ్, నీరజ్, సాత్విక్‌లతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పవన్‌కుమార్ ఎంపికయ్యారు. అండర్ - 17 విభాగంలో శ్యామ్, కుషల్, ప్రణీత్, ధర్మ రాజ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా స్థాయిలో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందించారు.

3న వైద్యాధికారి పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని బొబ్బిలి సంగంవీధి, గొల్లవీధి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న రెండు వైద్యాధికారి పోస్టులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జనవరి 3వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి ఒరిజనల్ ధృవపత్రాలతో హాజరు కావాలన్నారు.

సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు శ్రీనివాసరావు



రెడ్డిపల్లి శ్రీనివాసరావు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు విజయనగరం మండలం గోకపేట ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు అర్హత సాధించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శ్రీనివాసరావు ఉత్తమ ప్రతిభ కనబరిచి 2023 జనవరి 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దేశ రాజధాని న్యూఢిల్లీలో గల త్యాగరాజు స్టేడియంలో జరగబోయే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు అర్హత సాధించిన శ్రీనివాసరావును జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు, సహోపాధ్యాయులు అభినందించారు.

బదిలీలను వెంటనే చేపట్టాలి

విజయనగరం పూల్‌బాగ్: షెడ్యూల్ ప్రకారం జీఓ నంబరు 187, 190లను సవరణ చేసి టీచర్ల బదిలీలను వెంటనే చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బుకారీబాబు, పి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్ చేయకుండా అన్ని ఖాళీలను చూపించాలన్నారు. కోర్టు అడ్డంకులతో నిలిచిపోయిన పదోన్నతుల సమస్యలను పరిష్కరించి, వెంటనే అభ్యర్థులకు పదోన్నతులు కల్పించాలన్నారు. 98 డీఎస్సీ అభ్యర్థులకు బదిలీలు అయిన వెంటనే నియామకాలు చేపట్టాలని కోరారు.

గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కలిగించే పలు కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతిగృహంలో నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ జీబీవీ రమణ తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాల గ్రామీణ యువకులకు హౌస్ వైరింగ్, టూవీలర్ మెకానిక్ కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వసతి భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు పదో తరగతి పాస్/ఫెయిల్, తెల్లకార్డుదారులు, 45 ఏళ్లలోపున్న గ్రామీణ ప్రాంత యువకులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలు దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 20లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు. వివరాలకు 9959521662, 9985787820 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

జగనన్న పాలనలో ప్రజలకు భరోసా

- అధికారం దోచుకోవడానికి కాదు
- టీడీపీ హయాంలో అదే జరిగింది
- దుర్మార్గమైన ఆలోచనలతో ఎల్లో మీడియా వ్యవహరిస్తోంది..
- వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు..
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: ప్రజలు అధికారం ఇచ్చింది దోచుకోవడానికి కాదని, ప్రజా జీవితాలకు భరోసా కల్పించడానికని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. టీడీపీ హయాంలో లంచాలు, దోపిడి, అవినీతి, పెట్టుబడిదారులకు బాసటగా నిలిస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గరివిడి పట్టణంలోని ఫేకర్ క్లబ్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నర సంవత్సరాలుగా పరిపాలన సాగిస్తూ నేరుగా పేదల ఖాతాల్లోకి సంక్షేమ పథకాల ఫలాలను అందించారని చెప్పారు. ఒక్క చీపురుపల్లి నియోజకవర్గంలోనే రూ.850 కోట్లు పేదల ఖాతాల్లో సంక్షేమ పథకాల రూపంలో జమ చేశారన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని ధైర్యం జగన్‌మోహన్‌రెడ్డి చేశారని చెప్పారు. దీనికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిదర్శనమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలను ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అంటూ అడిగే ధైర్యం ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి చేయలేదన్నారు. పేదల ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు సంక్షేమ పథకాలు అమలు పరచడం తప్పా? అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం నూరు శాతం ఖాయమని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబునాయుడు జిల్లాకు ఏం చేసారో చెప్పకుండా అర్థం లేని ఆరోపణలు చేశాడన్నారు. దానికి అనుకూలంగా ఉన్న ఎల్లో మీడియా దుర్మార్గపు ఆలోచనలతో ఇష్టా రాజ్యంగా చూపించిందన్నారు. తాజాగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలు సమష్టిగా పని చేయాల్సి ఉందన్నారు. జనవరి 1 నుంచి పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇవ్వనున్న రూ.2,750 డబ్బులను వలంటీర్లతో కలిసి కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలన్నారు. అంతేకాకుండా అదే రోజు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పంపిన లేఖను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు నిమ్మన దాస్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి సీతంరాజు సుధాకర్, పలాస నియోజకవర్గ పరిశీలకుడు కెవి.సూర్యనారాయణరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి.రమణరాజు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల ఎంపీపీలు ఇప్పిలి వెంకటనర్సమ్మ, మీసాల విజయలక్ష్మి, తాడ్డి కృష్ణవేణి, గరివిడి, గుర్ల జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, చీపురుపల్లి, గరివిడి మేజర్ పంచాయతీ సర్పంచ్‌లు మంగళగిరి సుధారాణి, పి.ప్రమీల, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెవర ఉమ, నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, బమ్మిడి అప్పలస్వామి, తాడ్డి వేణు, బూర్లె నరేష్, పొట్నూరు సన్యాసప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రూ.850 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు



పార్టీ క్షేత్ర స్థాయిలో బలోపేతం కోసం సచివాలయాల్లో కన్వీనర్ల నియామకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామ స్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ, వలంటీర్లతో కన్వీనర్లు సమన్వయం చేసుకుని పార్టీ అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలి. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోనికి వచ్చిన తరువాత చీపురుపల్లి నియోజకవర్గంలో ఈ మూడున్నర ఏళ్ల కాలంలో వివిధ రకాల అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల రూపంలో రూ. 850 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశాం. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో 7,919 ఇళ్లను అర్హులైన ప్రతీ ఒక్కరికీ మంజూరు చేశాం. ఈ నియోజకవర్గ ప్రజలకు తాగునీటిని అందించటం కోసం ఆనాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ హయాంలో రూ.100 కోట్లతో సంకిలి నుంచి నీటిని తీసుకువచ్చాం. ఈ రోజు జలజీవన్ మిషన్ కార్యక్రమంతో ప్రతి ఇంటికీ కుళాయిలతో తాగునీటిని అందించే బృహత్తర కార్యక్రమం చేపడుతున్నాం.

– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్, విజయనగరం

జిల్లాలో అన్ని స్థానాల్లో రికార్డు మెజార్టీ రావాలి



చీపురుపల్లి నియోజకవర్గంలో పులివెందుల మాదిరిగా బొత్స సత్యనారాయణకు రికార్డు మెజార్టీని తీసుకురావాలి. అదే విధంగా విజయనగరం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రికార్డు మెజార్టీని అందించాలి. ఈ ప్రభుత్వంలో జిల్లాలో అమలవుతున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఎంతో గర్వంగా ఉంది.

– నిమ్మాన దాస్, చీపురుపల్లి నియోజకవర్గ పరిశీలకుడు

పార్టీని మరింత బలోపేతం చేయాలి



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం దిశగా ముందుకు తీసుకువెళ్లాలి. ఈ ప్రభుత్వం నెలకొల్పిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివి. గ్రామస్థాయిలోనికి పాలన తీసుకువెళ్లిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కటే. వందేళ్ల తరువాత సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని చేపట్టి రైతుల భూసమస్యల పరిష్కరించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే.

– బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం పార్లమెంటు సభ్యుడు

తరతరాల తలరాత... మారిందిలా...



సాలూరులోని గిరిశిఖర ప్రాంత గర్భిణుల వసతికేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్ (ఫైల్)

- కాన్పు 'మార్పు'
- గిరిశిఖర గ్రామాల గర్భిణులకు ఐటీడీఏ తోడ్పాటు
- రెండు ప్రత్యేక వసతిగృహాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- కొండల పైనుంచి ముందుగానే తరలింపు
- నిత్యం వైద్య సిబ్బంది పర్యవేక్షణ
- మెనూ ప్రకారం పౌష్టికాహారం
- ఆపరేషన్ కన్నా సుఖ ప్రసవాలకే మొగ్గు
- ప్రసవం తర్వాత తల్లీబిడ్డలకు ప్రయాణ సౌకర్యం
- అంబులెన్స్‌లో ఇంటికి తరలింపు



స్కానింగ్ కోసం గర్భిణులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రసవం... బిడ్డకు జన్మ, తల్లికి పునర్జన్మ. కానీ గిరిశిఖర ప్రాంతాల్లోని గిరిజన మహిళలకు మాత్రం జీవన్మరణ సమస్య! ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పోయిన గర్భిణులు ఎందరో! పురిటినొప్పులొస్తే కొండ పైనుంచి దిగువన మైదాన ప్రాంతాల్లోనున్న ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే డోలీ ఒక్కటే మార్గం. రాళ్లూ రప్పలనూ, ముళ్లూ పొదలను దాటుకుంటూ రావాల్సిందే! అదంతా గతం. తరతరాలుగా వీడని ఆ బాధల నుంచి ఇప్పుడు విముక్తి కలిగింది. పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అందిస్తున్న తోడ్పాటుతో వారి తలరాత మారింది. సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన గిరిశిఖర ప్రాంత గర్భిణుల ప్రత్యేక వసతిగృహాలు వారికి పుట్టిల్లు మాదిరి రక్షణను ఇస్తున్నాయి. నెలలు నిండక ముందే గిరిజన గర్భిణులను ఇక్కడకు తీసుకొచ్చి ప్రత్యేక వైద్యం, పౌష్టికాహారం అందిస్తున్నారు. శస్త్రచికిత్సల కన్నా సుఖ ప్రసవానికే మొగ్గు చూపిస్తున్నారు. ప్రసవం తర్వాత తల్లీబిడ్డలను మళ్లీ ఇంటికి క్షేమంగా అంబులెన్స్‌లో పంపిస్తున్నారు. నాలుగేళ్లలో 2,316 మంది ప్రసవం కోసం వచ్చిన వారిలో పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయినవారు ఒకే ఒక్కరు! అదీ నాలుగో కాన్పు కావడమే కారణం. ఇక ప్రసవం అంటే ఆపరేషన్ అనే ఈ రోజుల్లో అక్కడ సుఖ ప్రసవం పొందిన వారు 2,017 మంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆపరేషన్ చేయించుకున్నది 298 మంది మాత్రమే.

అధిక శాతం సుఖప్రసవాలే...

సాలూరు, గుమ్మలక్ష్మీపురంలోనున్న యువజన శిక్షణ కేంద్రా (వైటీసీ)ల భవనాల్లో నాలుగేళ్ల క్రితం గిరిశిఖర ప్రాంత గర్భిణుల వసతి కేంద్రాలను పార్వతీపురం ఐటీడీఏ ఏర్పాటు చేసింది. సాలూరులోని వసతిగృహంలో ఇప్పటివరకూ 1,102 మంది గిరిజన గర్భిణులు ప్రసవం పొందారు. వారిలో 950 మంది సుఖప్రసవం కాగా కేవలం 152 మందికి మాత్రమే ఆపరేషన్ ద్వారా డెలివరీ చేశారు. గుమ్మలక్ష్మీపురంలోని వసతిగృహంలో మాత్రం కేవలం ఒక్కరు నాలుగో కాన్పు కావడం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరణించారు. ఇక్కడ గత నాలుగేళ్లలో 1,214 మంది ప్రసవం పొందారు. వాటిలో 1,067 సాధారణ ప్రసవాలే కావడం విశేషం. కేవలం 146 మందికి మాత్రమే ఆపరేషన్ ద్వారా డెలివరీ చేశారు. ప్రాణాపాయంలేని ప్రసవానికి ఇప్పుడు గిరిశిఖర ప్రాంత గర్భిణుల వసతికేంద్రాలు చిరునామాగా మారాయి.

ముందస్తు 'మేలు'కొలుపు...

ప్రసవ సమయానికి నెలన్నర, రెండు నెలల ముందే గర్భిణులను గిరిశిఖర ప్రాంతాల నుంచి స్థానిక వైద్యారోగ్య శాఖ సిబ్బంది వసతిగృహాలకు తీసుకొస్తున్నారు. కాన్పు సమయం వరకూ అక్కడ వారిని కంటికి రెప్పలా కాపాడుతున్నారు. వారికి పురిటినొప్పులు ప్రారంభం కాగానే సమీపంలోనున్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తరలిస్తున్నారు. క్లిష్ట పరిస్థితి ఉంటే మాత్రమే ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. సాలూరు కేంద్రంలో ఉన్నవారికి స్థానిక సీహెచ్‌సీ వైద్య సిబ్బంది, గుమ్మలక్ష్మీపురం కేంద్రంలో ఉన్నవారికి భద్రగిరి సీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిరంతర సేవలు అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో తక్షణ వైద్యం అందుబాటులోకి వచ్చింది. అంతేకాదు వారానికి రెండుసార్లు చొప్పున అక్కడి వైద్యులు వసతికేంద్రాలకు వచ్చి గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం...

వసతిగృహంలో చేరిన ప్రతి ఒక్కరికీ ప్రతిరోజూ క్రమం తప్పక పౌష్టికాహారం అందిస్తున్నారు. అంతేకాదు ఉదయం పూట తేలికైన వ్యాయామం, యోగా చేయిస్తున్నారు. ఇక వినోదం కోసం టీవీలను ఏర్పాటు చేశారు. ఆట విడుపుగా చీరలపై ఫ్యాబ్రిక్ పెయింటింగ్, అల్లికలు, కుట్లు నేర్పిస్తున్నారు. ఇక రెండో కాన్పు కోసం వచ్చే గర్భిణులు తమ పిల్లలను ఇంటి వద్ద విడిచిపెట్టలేని పరిస్థితి ఉన్నప్పుడు వారికి కూడా వసతికేంద్రంలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఆయా తల్లీపిల్లలకు చేదోడువాదోడుగా ఉండేలా కుటుంబ సభ్యుల్లో ఒకరు ఉండటానికి అవకాశం కల్పిస్తున్నారు. ఇక్కడ అందుతున్న సేవలను గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్, నీతి ఆయోగ్ సభ్యులు, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర వంటి వారు ప్రశంసిస్తున్నారు.

నిత్యం ఏఎన్ఎంలు ఉంటున్నారు...



గిరిశిఖర ప్రాంత గర్భిణులకు వసతిగృహంలో నాణ్యమైన భోజనంతో పాటు మంచి వసతి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఏఎన్ఎంలు నిత్యం కనిపెట్టుకొని ఉంటున్నారు. వైద్యాధికారులు వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. స్కానింగ్ కోసం కూడా అంబులెన్స్‌లోనే ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి తీసుకొస్తున్నారు.

– హిమరిక జానకమ్మ, వాటయికోన గ్రామం, నయా గ్రామ పంచాయతీ, కొమరాడ మండలం

కాన్పు అంటే భయం అక్కర్లేదు...



ఒకప్పుడు డెలివరీ అయ్యేవరకూ ఆందోళన పడాల్సిన పరిస్థితి. ఇప్పుడు వసతిగృహంలో చేరిన తర్వాత కాన్పు అంటే భయం అక్కర్లేదు. మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారు. పౌష్టికాహారం అందిస్తున్నారు. తరచూ వైద్యపరీక్షలు చేస్తున్నారు.

– శిరీష, నీలమామిడివలస, పాచిపెంట మండలం

డోలీ కష్టాలు తప్పాయి..



మా గ్రామానికి రోడ్డు లేదు. నా మొదటి కాన్పు సమయంలో పురిటినొప్పులు వచ్చినప్పుడు డోలీలో వలసబల్లేరు గ్రామం వరకు మా కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో మొండెంఖల్లు ఆస్పత్రికి చేర్చారు. ఇప్పుడు రెండో కాన్పు. డెలివరీ డేట్‌కు ముందుగానే వసతిగృహంలో చేర్పించారు. నాలాంటి గిరిశిఖర ప్రాంత గ్రామాల్లోని గర్భిణులకు డోలీ కష్టాలు తప్పాయి.

– బిడ్డిక జయసుధ, చాపరాయిగూడ, వలసబల్లేరు గ్రామ పంచాయతీ, కురుపాం మండలం



పట్టాల పండగ

విజయనగరం మండలం సారిక గ్రామ సమీపంలో రూపొందించిన గృహ నిర్మాణ లేఅవుట్‌లో సుమారు మూడు వేల మందికి పైబడి ఇళ్ల పట్టాలను శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పండగ వాతావరణం నెలకొంది. లబ్ధిదారుల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. కార్యక్రమంలో భాగంగా పట్టాల పండగ పేరిట వేసిన ముగ్గు అందరినీ ఆకర్షించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

'గురుదేవ'ను సందర్శించిన త్రిపుర ప్రధాన న్యాయమూర్తి



అవయవ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అమర్‌నాథ్‌గౌడ్

కొత్తవలస రూరల్: మానవ సేవే మాధవ సేవగా దివ్యాంగులకు సేవలు అందించడం అందరికి ఆదర్శం అని త్రిపుర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి టి.అమర్‌నాథ్ గౌడ్ అన్నారు. మంగళపాలెం శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్టు గురువారం నిర్వహించిన కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 20 సంవత్సరాలకు పైగా దివ్యాంగుల సేవలో నిరంతరం తమ జీవితాన్ని గడుపుతున్న జగదీష్‌కుమార్ ధన్యుడు అని కొనియాడారు. అనంతరం నూతనంగా నిర్మించిన గురుదేవ చారిటబుల్ ఆస్పత్రిని సందర్శించారు.



క్లుప్తంగా

వాలీబాల్ పోటీల్లో బంగారు పతకం


బంగారు పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి టి.కూర్మారావు సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ నెల 27 నుంచి 29 వరకు విశాఖ జిల్లా యలమంచిలిలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఆ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, పీడీ బి.శ్రీనివాసరావులు గురువారం అభినందించారు.

కుస్తీ పోటీల్లో పతకాల పంట

● కాపుశంభాం పాఠశాల విద్యార్థినుల ప్రతిభ


కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో సత్తా చాటి బంగారు, రజత, కాంస్య పతకాలను కై వసం చేసుకున్నారు. గడిచిన వారంలో తిరుపతి జిల్లా రేణిగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి బాల బాలికల కుస్తీ పోటీల్లో అండర్–14,అండర్–17 విభాగాల్లో పాఠశాలకు చెందిన పప్పల పావని బంగారు పతకం, పిల్లా ఉష రజత పతకం, లెంక రోష్మిత, రఘుమండ అనూషలు కాంస్య పతకాలు సాధించారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించి పాఠశాలకు పేరును తీసుకువచ్చిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు దూలికేశ్వర్ రావు, పీడీ ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పేకాట కేసులో 9 మందికి జైలు శిక్ష

కురుపాం/గుమ్మలక్ష్మీపురం : మండలం ఎల్విన్‌పేట పోలీస్టేషన్ పరిధిలో 2017లో 9మందిపై పేకాట కేసు నమోదు కాగా కురుపాం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఇ.ఆంజనేయులు ముద్దాయిలకు ఐదు రోజుల జైలు శిక్షతో పాటు విధించి, రూ.3,500 చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో ఒక్కొక్కరు రెండు వారాల జైలు శిక్ష అదనంగా అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కిమిడి చంద్రకుమార్ వాదించారు.

వివాహిత ఆత్మహత్య


నైదాన భారతి మృతదేహం

సాలూరు: పట్టణంలోని శ్రీనివాస కాలనీలో నివాసముంటున్న వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీనివాసకాలనీకి చెందిన నైదాన భారతి (34) భర్తతో విభేదాల నేపథ్యంలో కొన్నేళ్లుగా వేరుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు చెప్పారు. మృతురాలి తండ్రి రామకృష్ణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నైపుణ్యంతోనే నౌకరీ

సర్టిఫికెట్లు చేత పట్టుకుని ఉపాధి అవకాశాల కోసం చెప్పులరిగేలా తిరిగే రోజులు పోయాయి. ఎక్కువ మార్కులు వస్తే అది ప్రతిభ అని మురిసిపోయే కాలం చెల్లింది. ప్రస్తుతం ప్రతిభతో కూడిన నైపుణ్యం మాత్రమే ముందుకు నడిపిస్తూ భవిష్యత్తుకు బంగారు బాట వేస్తోంది. ఏదో ఒక రంగంలో నైపుణ్యం అందిపుచ్చుకుంటే తప్ప భవిష్యత్‌కు సరైన దారి దొరకడం లేదు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి ఏ ఒక్కరూ ఉపాధి దొరకలేదని బాధపడకూడదన్న కృతనిశ్చయంతో ఉంది. చదివిన చదువుకు సార్థకత చేకూరాలంటే అందుకు నైపుణ్యం తప్పనిసరి అని గుర్తించింది. చదువుకుంటున్న సమయంలోనే విద్యార్థుల్లో ఈ భావన నూరిపోయాలని నిర్ణయించి ఆ దిశగా చర్యలు చేపట్టింది. యువతలో నైపుణ్యం పెంచేందుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముందడుగు వేస్తోంది.

– పార్వతీపురంటౌన్


సీతంపేట స్కిల్‌హబ్‌లో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువత

● స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో యువతకు ఉపాధి
● ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నాలుగు స్కిల్‌హబ్‌లు
● తొలివిడతలో శిక్షణ పొందుతున్న 240 మంది

యువతలో నైపుణ్యాన్ని మెరుగుపరచి ఉపాధిబాటలు వేసేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) అడుగులు వేస్తోంది. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు స్కిల్ హబ్ సెంటర్లలో యువతకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 18 నుంచి 28 ఏళ్ల వయస్సులోపు యువతకు మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు. మొదటి విడతగా పార్వతీపురం పాలిటెక్నిక్ కళాశాల, గుమ్మలక్ష్మీపురం పాలిటెక్నిక్ కళాశాల, సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాల, సాలూరులోని డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక్కో స్కిల్‌హబ్‌సెంటర్‌లో 60 మంది చొప్పున నాలుగు సెంటర్లలో 240 మంది నిరుద్యోగులు శిక్షణ పొందుతున్నారు. వారందరికీ శిక్షణ అనంతరం మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు.


జీఎల్‌పురం స్కిల్‌హబ్‌లో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువత


సీతంపేట స్కిల్‌హబ్‌లో నైపుణ్య శిక్షణ పొందుతున్న మహిళలు

ఉపాధి కల్పన ఇలా..

జాబ్‌మేళాలో పాల్గొన్న కంపెనీలు		పాల్గొన్న యువత	ఎంపికైన యువత
ఐసీఎస్టీపీ డ్రైవ్	1	65	15
ఐసీఎస్టీపీ డ్రైవ్	1	58	26
జాబ్‌మేళా పార్వతీపురం	12	2321	385
జాబ్‌మేళా పాలకొండ	12	1244	324
మినీ జాబ్‌మేళా	2	57	9
జాబ్‌మేళా సాలూరు	12	420	181

నైపుణ్య కోర్సుల వివరాలు
● గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, పార్వతీపురం
● డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్
● జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, జీఎల్‌పురం
● డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషన్ మెకానిక్
● గవర్నమెంట్ ఐటీఐ, సీతంపేట
● డొమెస్టిక్ ఎలక్ట్రికల్ సొల్యూషన్, స్యూయింగ్ మెషీన్ ఆపరేటర్
● గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, సాలూరు
● ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్, ట్రైనీ ప్రొడక్షన్ ఆపరేటర్.

జాబ్‌మేళాల ద్వారా 940మందికి ఉపాధి

పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా ఏర్పాటైన తరువాత గడిచిన ఆరునెలల్లో నిర్వహించిన స్కిల్‌డెవలప్ మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో పలు పరిశ్రమలు నిర్వహించిన జాబ్ మేళాల్లో జిల్లాకు చెందిన 940మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించారు. జిల్లాలో ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. యువత భవిష్యత్‌కు మంచి అవకాశాలు కల్పించేందుకు మల్టీనేషనల్ కంపెనీలతో మాట్లాడి యువత ఎంచుకున్న కంపెనీల్లో అవకాశాలను కల్పిస్తున్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనే ధ్యేయం



నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనే ధ్యేయంగా ప్రభుత్వం కృషిచేస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటివరకు 940 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. అంతేకాకుండా స్కిల్ హబ్‌ల ద్వారా సంవత్సరానికి 500మందికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం. నిరుద్యోగ యువత సమీప స్కిల్‌హబ్ సెంటర్లలో వారి వివరాలు నమోదు చేసుకుని శిక్షణ తీసుకుని ఉద్యోగావకాశాలు పొందాలి.

సాయికుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, పార్వతీపురం మన్యం

ప్రణాళికలు రూపొందించాం



నిరంతర ప్రయత్నంతోనే యువత విజయం సాధించవచ్చు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా పూర్తి ప్రణాళికలు రూపొందించాం. అందులో భాగంగా జాబ్‌మేళాలు నిర్వహించి ఉపాధి కల్పిస్తున్నాం. యువతలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు నాలుగు స్కిల్‌హబ్ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ కల్పిస్తున్నాం. నిరుద్యోగాన్ని అరికట్టేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13 మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగం కల్పిస్తున్నాం. యువత ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగం పొందాలి.

–శ్రీనివాసరావు, ఏపీఎస్ఎస్‌డీసీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

నిరాశ, నిస్పృహ వీడి ఆత్మవిశ్వాసంతో యువత ముందుకు వెళ్లేలా జిల్లా యంత్రాంగం వారిని ప్రోత్సహిస్తోంది.

ఐక్యంగా ఉద్యమిద్దాం

● కార్మిక హక్కులు కాపాడుకుందాం
● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు
● బస్సుయాత్రకు ఘనంగా స్వాగతం

విజయనగరం ఫూల్‌బాగ్: ఐక్యంగా ఉద్యమించి ప్రభుత్వ రంగాన్ని, కార్మిక హక్కులను కాపాడుకుందామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమైన కార్మిక చైతన్య బస్సుయాత్ర గురువారం విజయనగరానికి చేరుకుంది. జిల్లా సీఐటీయూ నాయకులు దాసన్నపేట విద్యుత్ భవనం వద్ద బస్సుయాత్రలో ఉన్న వారికి పూల మాలలు వేసి ఘనంగా స్వాగతించారు. అనంతరం బైక్ ర్యాలీతో కోట జంక్షన్ వరకు ర్యాలీగా బస్సు యాత్ర చేరుకుంది. కోట జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం రాక ముందు కార్మికుల పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న చట్టాల స్థానంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రతిరోజూ దేశభక్తి జపం చేసే బీజేపీ విశాఖ స్టీల్ ప్లాంటును దక్షిణకొరియా కంపెనీకి కట్టబెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోందని ధ్వజమెత్తారు.

అన్ని రంగాల ప్రైవేటీకరణకు యత్నం

అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా బీజేపీ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైళ్లు, పోర్టులు, రక్షణ, విద్యుత్‌తో సహా అన్ని రంగాలను ప్రైవేట్ పరం చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రైవేటీకరణ జరిగితే చార్జీలు పెరిగి ప్రజలపై భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర మహాసభల్లో కార్మిక సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. భీమవరంలో జరిగే రాష్ట్ర మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, నాయకులు టీవీ రమణ,రెడ్డి శంకరరావు, యుఎస్ రవికుమార్, ఎ.జగన్మోహన్, బి.రమణ, బి.సుధారాణి, కృష్ణమ్మ అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. అంతకు ముందు జానపద కళాకారులు పాడిన విప్లవ గీతాలు అలరించాయి.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


ఎన్.అజయ్‌వర్మ


బి.మనీష్


సీహెచ్ సురేంద్ర

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న సీనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. నవంబర్‌లో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు దక్కించుకున్న క్రీడాకారులు ఈనెల 31 నుంచి 2023 జనవరి 6వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగబోయే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బి.ఈశ్వరరావు గురువారం తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారిలో 66–70 కేజీల విభాగంలో ఎన్. అజయ్‌వర్మ, 86–92 కేజీల విభాగంలో బి.మనీష్, 92 కేజీల విభాగంలో సీహెచ్.సురేంద్రలు ఉన్నట్లు పేర్కొన్నారు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్, అసోసియేషన్ సభ్యులు ఎస్. రాజు, సీనియర్ బాక్సింగ్ క్రీడాకారులు వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావులు అభినందించారు. జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేటితో ముగియనున్న రంజీ మ్యాచ్

● రెండవ ఇన్నింగ్స్‌లో మహారాష్ట్ర 250 ఆలౌట్


మూడు వికెట్లు తీసిన ఆంధ్రా బౌలర్ కె.నితీష్‌కుమార్ రెడ్డి

విజయనగరం: ఆంధ్రా–మహారాష్ట్ర జట్ల మధ్య రంజీ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. డెంకాడ మండలం చింతవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మూడు రోజులుగా జరుగుతున్న మ్యాచ్ నేటితో ముగియనుంది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. 27 ఓవర్లలో వికెట్ నష్టానికి 89 పరుగుల ఓవర్ నైట్ స్కోరు వద్ద మూడవ రోజు గురువారం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు మొత్తం 81.1 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటైంది. బౌలింగ్‌లో ఆంధ్రా క్రీడాకారులు కె.నితీష్‌కుమార్ రెడ్డి 3 వికెట్లు చేజిక్కించుకోగా..కేవీ.శశికాంత్, ఎం.రాయుడు, కార్తీక్‌రామన్‌లు చెరో రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 100 పరుగులు జోడించింది. బ్యాటింగ్‌లో ఆంధ్రా కెప్టెన్ హనుమవిహారి 73 బంతుల్లో 36 పరుగులతో నాటౌట్‌గా కొనసాగుతుండగా..కేఎస్ భరత్ 37 బంతుల్లో 31 పరుగులు చేశారు. అంతకు ముందు మొదటి ఇన్నింగ్స్‌లో మహారాష్ట్ర జట్టు 200 పరుగులు, ఆంధ్రా జట్టు 211 పరుగులు చేసిన విషయం విదితమే. ఇదిలా ఉండగా నాలుగు రోజుల పాటు టెస్ట్ మ్యాచ్ తరహాలో జరిగే మ్యాచ్‌లో చివరి రోజు ఆంధ్రా జట్టుకు కీలకంగా మారింది. రెండవ ఇన్నింగ్స్‌లో 140 పరుగులు లక్ష్యాన్ని ఛేదిస్తే విజయం సొంతమవుతుంది.

వైఎస్సార్ షటిల్ టోర్నమెంట్ రాష్ట్రస్థాయి విజేత ఎస్.కోట


విన్నర్, రన్నర్‌లకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, నాయకులు, శిక్షకులు

బొబ్బిలి: ఈనెల 26 నుంచి బొబ్బిలిలోని మున్సిపల్ షటిల్ కోర్టులో మూడు రోజుల పాటు జరిగిన వైఎస్సార్ వీర బొబ్బిలి షటిల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌ను ఎస్.కోట జట్టు కై వసం చేసుకుంది. బుధవారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు పలుమార్లు వర్షం అంతరాయం కలిగించింది. అయితే అర్ధరాత్రి సమయంలో వర్షం తెరిపివ్వడంతో మ్యాచ్‌ను కొనసాగించారు. ఫైనల్ మాజ్ విజయవాడ, ఎస్.కోటల మధ్య జరగ్గా మంచి ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిన ఎస్.కోట జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి ప్రదానం చేశారు. ఎస్.కోట డబుల్స్‌లో ఆదిత్య, దినేష్‌లు రూ.40వేల ప్రైజ్‌మనీ, ట్రోఫీని పొందారు. సెకెండ్ ప్రైజ్‌గా విజయవాడకు చెందిన ఉదయ్‌భాస్కర్, అప్పారావులు ట్రోఫీతో పాటు, 20వేలను అందుకున్నారు. మూడో బహుమతిగా విశాఖకు చెందిన కిరణ్, సాయికిరణ్‌లు ట్రోఫీతో పాటు రూ.10వేలు అందుకున్నారు. అలాగే నాలుగో ప్రైజ్ రూ.5వేలను విశాఖ వాసులే గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో మున్సిపల్ ఛైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యలు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాల నాయుడు, డాక్టర్ గుల్ల రామ్ నరేష్, శిక్షకుడు కె.అప్పలబాబా, రోటరీక్లబ్ గవర్నర్ టీఎస్ఎస్ కార్తీక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వి మనోజ్‌కుమార్, ఎస్.బాబు, కింతలి శ్రీనివాసరావు, దిబ్బ గోపి, అలజంగి చిన్న, జయరాం ఏఎంసీ డైరెక్టర్ సాధిక్, పలు జిలాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్.కోట వచ్చిన అహోబిలం జియర్‌స్వామి


పుణ్యగిరిలో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న అహోబిలం చినజియర్ స్వామి, తదితరులు

శృంగవరపుకోట: పుణ్యగిరి వద్ద నిర్మాణమవుతున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అహోబిలం చినజియర్ స్వామి గురువారం దర్శించారు. ఈ సందర్భంగా ఆయన మఠానికి చెందిన భక్తుడు ఎం.వి.రమణమూర్తిరాజు ఆలయ నిర్మాణం కోసం విరాళంగా రూ.1,00,116లు చెక్‌ను జియర్‌స్వామి సమక్షంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు అందజేశారు. కార్యక్రమంలో ముందుగా జియర్‌స్వామి బొడ్డవర గ్రామంలో రఘురాజు ఇంటివద్ద కొంతసమయం పాటు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆయన భర్తాపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ధనుర్మాస వైశిష్ట్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, జెడ్పీటీసీ తదితరులు పాల్గొన్నారు.

సంకిలి ఫ్యాక్టరీకి 31వేల టన్నుల చెరకు తరలింపు

● సీహెచ్ బొడ్డ వలసలో చెరకు కాటా ప్రారంభం


చెరకు కాటాను ప్రారంభిస్తున్న డీసీసీ జీవీవీ సత్యనారాయణ, ఏజీఎం అప్పారావులు

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంతం నుంచి ఈ సీజన్‌లో 31వేల టన్నుల చెరకును సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి తరలించామని బొబ్బిలి డిప్యూటీ కేన్ కమిషనర్ జీవీవీ సత్యనారాయణ, ఫ్యాక్టరీ ఏజీఎం కె.అప్పారావులు తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం బొడ్డవలసలో చెరకు కాటాను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన అనంతరం రైతులకు పాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 15 వరకూ తరలించిన చెరకు బిల్లులు రైతుల అకౌంట్లలో జమ చేశామని చెప్పారు. అలాగే డిసెంబర్ 25వ తేదీవరకూ సరఫరా చేసిన చెరకుకు సంబంధించిన బిల్లుల మొత్తాలను బ్యాంకుల్లో గురువారం జమ చేసినట్లు చెప్పారు. సంకిలి రైతులకు అందజేసే చెరకు సాగు రాయితీలనే బొబ్బిలి ప్రాంత రైతులకూ కల్పించనున్నామని చెప్పారు. రైతు సోదరులంతా ఈ విషయాన్ని గమనించి చెరకు సాగు పెంచే దిశగా కృషి చేయాలని, అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చొంగలి రామకృష్ణ, త్రినాథ్, సత్యం నాయుడు, సన్యాసిరావు, తదితర రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి


తోటపల్లి రిజర్వాయర్‌లో చేపపిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పార్వతీపురం: మత్స్య రంగాన్ని ప్రోత్సహించి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఉపముఖ్యమంత్రి, కురుపాం శాసన సభ్యురాలు పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. ఈ మేరకు గురువారం తోటపల్లి రిజర్వాయర్ వద్ద జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చేపపిల్లల విడుదల కార్యక్రమంలో ఆమె పాల్గొని చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్య సంపద పెంపొందించడం ద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని చెప్పారు. మత్స్యకారులకు అవసరమైన వలలు, యంత్రపరికరాలు సబ్సిడీపై అందజేస్తుందని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ఫిష్ ఆంధ్ర పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ ఏడాది 3 లక్షల చేపపిల్లల విడుదల

జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య మాట్లాడుతూ మండలంలోని కోటవానివలస, మార్కొండపుట్టిలలో స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం(పీఎంఎస్ఎస్‌వై) కింద గతంలో మత్స్య రైతు భాగస్వామ్యంతో 40 శాతం సబ్సిడీ ద్వారా రెండు లక్షల చేప విత్తనాలు విడుదల చేశామని, ప్రస్తుతం 60 శాతం సబ్సిడీ ద్వారా 3 లక్షల చేప పిల్లల విత్తనాలు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, గరుగుబిల్లి మండల పరిషత్ అధ్యక్షుడు ఉరిటి రామారావు, ఎఫ్‌డీఓ టి.నాగమణి, జిల్లా మత్స్యశాఖ వైస్ ప్రెసిడెంట్ డి.లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవాల కన్నయ్య, కోటవాని వలస, మార్కొండపుట్టి సంఘం అధ్యక్షుడు ఈదల తిరుపతి, మరుముల్ల శ్రీనివాసరావు, గ్రామ మత్స్య సహాయకులు శ్రీకాంత్, ప్రదీప్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24కి. 10గ్రా.)	54,490–00
బంగారం(22కి. 10గ్రా.)	49,950–00
వెండి (కిలో)	73,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India
అసెట్ రికవరీ బ్రాంచి
డోర్ నెం. 26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, వెంగలరావుపేట, విశాఖపట్నం - 530001, ఫోన్ : 0891-2537792/82, మొబైల్ : 8919518082, 8074858053, ఇ-మెయిల్ : ubin0817295@unionbankofindia.bank

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (6) / 6(2) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తి/ చరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం ప్రకటన. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పూర్వం ఆంధ్రాబ్యాంక్)కు తనఖాపెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పూర్వం ఆంధ్రాబ్యాంక్) అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు ఋణగ్రహీత: (1) (1) మెసర్స్ సుస్థ మహాలక్ష్మీ స్టీల్స్, విజయనగరం, మేనేజింగ్ పార్టనర్, శ్రీ పాలుకూరి దినేష్‌కుమార్ తండ్రి శ్రీ పి.సూర్యనారాయణ, షాపు నెం. 11, పి డబ్ల్యూ మార్కెట్, విజయనగరం, (2) శ్రీమతి పాలుకూరి కన్యాకుమారి, భర్త శ్రీ పి.సూర్యనారాయణ, డి.నెం. 4-4-11/ఎ, 3వ వీధి, కొత్త అగ్రహారం, విజయనగరం మరియు కో-ఆబ్లిగెంట్స్ : (1) శ్రీ పాలుకూరి సూర్యనారాయణ తండ్రి లేటు పి.జగన్నాధం, డి.నెం. 4-4-11/ఎ, 3వ వీధి, కొత్త అగ్రహారం, విజయనగరం (2) శ్రీ పందిరి వెంకటరెడ్డి తండ్రి లేటు బాబురావు, డి.నెం. 14-7-10, కొత్తపేట దక్షిణం వార్డు, శివాలయం వీధి దగ్గర, విజయనగరం. ఋణఖాతా : మెసర్స్ సుస్థ మహాలక్ష్మీ స్టీల్స్, మేనేజింగ్ పార్టనర్ శ్రీ పాలుకూరి దినేష్ కుమార్ తండ్రి శ్రీ పి.సూర్యనారాయణ, షాపు నెం. 11, పి డబ్ల్యూ మార్కెట్, విజయనగరం నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పూర్వం ఆంధ్రాబ్యాంక్)కు తేది.30-11-2022 నాటికి చెల్లించ వలసిన బకాయి రూ॥ 3,58,26,770.20 పై॥ (అక్షరములా మూడు కోట్ల యాభై ఎనిమిది లక్షల ఇరవై ఆరు వేల ఏడు వందల డెబ్బై రూపాయల ఇరవై పైసలు మాత్రమే) దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిలో తేది.09.02.2023 న ఆన్‌లైన్ ద్వారా విక్రయించబడుతుందని ముఖ్యంగా ఋణగ్రహీత (లు) మరియు హామీదారు (లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేయడమైనది.

సెక్యూర్డ్ ఆస్తుల రిజర్వు ధర మరియు బయానా దిగువ వివరించబడినవి.

స్థిరాస్తి వివరములు : విజయనగరం జిల్లా, శివాలయం వీధి దగ్గర, కొత్తపేట దక్షిణం వార్డు, డోర్ నెం. 14-7-10 కలిగిన 66 చ॥గ॥ల భూమి మరియు భవనం శ్రీ పందిరి వెంకటరెడ్డి గారికి చెందినది (క్రయదస్తావేజు నెం.1473/2009, తేది.29-04-2009) హద్దులు : తూర్పు : జరజపు పైడిరాజు యొక్క ప్రహరీగోడ, పడమర : శివాలయం వీధి, మున్సిపల్ రోడ్, ఉత్తరం : వారాడ ఆదినారాయణ గారికి చెందిన ఆస్తి, దక్షిణం : తాడి కృష్ణ ఆస్తి మరియు ఈ ఆస్తికి మధ్య ప్రహరీ గోడ.

రిజర్వుధర : రూ॥ 37,00,000/- (అక్షరములా ముప్పై ఏడు లక్షలు మాత్రమే) ధరావత్తు : రూ॥ 3,70,000/- (అక్షరములా మూడు లక్షల డెబ్బై వేలు మాత్రమే) బిడ్ ఇంక్రిమెంట్ : రూ॥ 40,000/- (అక్షరములా నలభై వేలు మాత్రమే)

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు.
1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ : www.mstcecommerce.com
2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp క్లిక్ చేయండి.
3) ఇ-వేలం అమ్మకం నియమ నిబంధనలు బ్యాంకు వారి వెబ్‌సైట్ : www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) రూల్ 9(1) రూల్ 6(2) క్రింద చట్టబద్ధ 30 రోజుల అమ్మకం ప్రకటన
పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించడం గురించి సదరు లోన్ యొక్క ఋణగ్రహీత /లు మరియు హామీదారు/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) /రూల్ 9(1)/ రూల్ 6(2) క్రింద ప్రకటనగా కూడా ఇది పరిశీలించబడును.

తేది. 26-12-2022
ప్రదేశం : విశాఖపట్నం
అధీకృత అధికారి & అసిస్టెంట్ జనరల్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■ బంపర్ ఆఫర్ : గోల్డ్ కాయిన్ ఫ్రీ. విజయనగరానికి 10 కి.మీ. దూరంలో 200 ఫీట్ బైపాస్ రోడ్‌లో ఆనుకొని 36 నెలలు సులభ వాయిదా పద్ధతిలో VMRDA ప్లాట్లు కలవు. ఫోన్ : 95739 99737 [V-2090]

■ 200 Feet Highway Facing VUDA Plots @ Vizianagaram Best for House Construction, Investment & Returns, Bank Loan Available. Cont : 94940 43456 [V- 3727]

WANTED

■ గార్మెంట్స్‌షాపులో సేల్స్ గర్ల్స్ (రోజుకి 350/-) సేల్స్ బాయ్స్ (రోజుకి 400/-) కావలెను. ఉచిత వసతి + భోజనం. పవన్ ఫ్యామిలీ ఆఫ్‌మాల్, ద్వారకానగర్, వైజాగ్ -16 ఫోన్: 62811 60029, 94408 02456 [V- 424]

■ చదువుతో సంబంధం లేకుండా వైజాగ్ ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18 నుండి 35 సం॥లు గల యువకులు కావలెను. జీతం 12,000/- + ఫుడ్ రూమ్స్ సదుపాయం కలదు. డైరెక్ట్ జాయినింగ్. ఫోన్: 91542 96345, 91542 96346 [V- 26450]

■ UC INFO TECH సంస్థ నందు (1,500 to 20,000) పనిచేయుటకు వయస్సు : 18 to 28 లోపు (UN MARRIED) యువతీ, యువకులు (10th to PG) ఉచితవసతి. ఫోన్: 77996 54777, 63051 36884 [V-2513]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9058509586 [G-776230]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 7815877445 [M-1203188]

■ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో పర్మినెంట్ ఉద్యోగాలకు సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, లోడర్స్, సెక్యూరిటీగార్డ్స్ కావలెను. జీ. 21,000/- to 30,000/- రూం+మీల్స్ ఫ్రీ Q: 5th to డిగ్రీ. 9160675049 [H-778951]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

సచివాలయం పరిశీలన



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ నిర్మలాదేవి, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి జీఎస్ నిర్మలాదేవి గురువారం పరిశీలించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని సూచించారు. ఆమెతో పాటు ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జనవరి 4న మండల సర్వసభ్య సమావేశం

నెల్లిమర్ల: మండల సర్వసభ్య సమావేశం వచ్చే నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి. గిరిబాల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులతో పాటు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం పూల్‌బాగ్: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన 2023 డైరీని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం అతని స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ, ఉపాధ్యాయ బదిలీల నిర్వహణలో ఉన్న ఇబ్బందులను సరిచేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి. రవీంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. రాంబాబు, ఉత్తరాంధ్ర మీడియా ఇన్‌చార్జ్ బి. శివప్రసాద్, అల్తి రాంబాబు, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాస్కులు తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్బీసీసీ అధికారి రామకృష్ణ

విజయనగరం రూరల్: పొరుగు దేశాల్లో కరోనా విజృంభిస్తున్న వేళ మనం ముందస్తుగా మాస్కులు వినియోగించాలని జిల్లా సామాజిక, పరివర్తన సమాచార వ్యవస్థ (ఎస్బీసీసీ) సమన్వయ అధికారి బి.రామకృష్ణ సూచించారు. మండలంలోని ద్వారపూడి మండల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కోవిడ్ నిబంధనలు, రక్తహీనత, పౌష్టికాహారం, బాల్య వివాహాల నిర్మూలన, జంక్ ఫుడ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలంటే బాల్య వివాహాలు సున్నాకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.త్రివేణి, పి.రమేష్, ఎం.జయంతి, ఎం.సత్యనారా యణ, బి.సత్యనారాయణనాయుడు, ఎంఎస్‌కే శిరీష, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తూర్పుకాపు రిజర్వేషన్లపై వినతి



రుద్రరాజుకు వినతిపత్రం అందజేస్తున్న తూర్పుకాపు సంక్షేమ సంఘ ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్: తూర్పుకాపు రిజర్వేషన్ల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును తూర్పుకాపు సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ కోరారు. ఈ మేరకు నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రుద్రరాజును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘ జాతీయ ఆర్గనైజింగ్ కో ఆర్డినేటర్ కె. శ్యామసుందరరావు, జాతీయ కో కన్వీనర్ కె. రమణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాత్రాజు రాజారావు, రాష్ట్ర నాయకులు డి. జోగినాయుడు, జమ్ము ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు పి. వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఉద్యోగ మేళా రేపు

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఆర్‌కే డిగ్రీ కళాశాలలో ఈ నెల 31న హెటిరో డ్రగ్స్ కంపెనీ ఉద్యోగ మేళా నిర్వహించనుందని కళాశాల డైరెక్టర్ కోలా సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019-22 మధ్య పాసైన బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీటెక్ (కెమికల్ ఇంజనీరింగ్), ఐటీఐ, డిప్లమా, ఎంబీఏ (హెచ్‌ఆర్, ఐబీ) అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 8.30 గంటలకు పూర్తి బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

పేద కుటుంబాల్లో సంతోషం...

- సారికలో 3,600 ఇళ్ల పట్టాల పంపిణీ
- సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదే
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: రాజకీయాలకు అతీతంగా, వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా, సొంత ఇల్లు కట్టుకోవాలన్న పేదల కలలను నిజం చేస్తూ వారి కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని సారిక గ్రామ సమీపంలో రూపొందించిన గృహ నిర్మాణ లే అవుట్‌లో సుమారు 3 వేల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ కుల, మత, వర్గ వివక్షకు తావులేకుండా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన పాదయాత్రలో ప్రజా సమస్యలు తెలుసుకున్న జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక, అన్ని సమస్యలనూ పరిష్కరిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేస్తాం గాని, ఇతరత్రా సమయంలో ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్నామని స్పష్టం చేశారు. అందువల్లే సామాన్య కార్యకర్త నుంచి తాను ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. 2014 ఎన్నికల ముందు 600 హామీలను ఇచ్చిన చంద్రబాబునాయుడు, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రజల ఆలోచనలో మార్పు రావడంతోనే 2019 ఎన్నికల్లో అక్కచెల్లెమ్మలను పసుపు, కుంకుమ పథకం పేరుతో మోసం



ఇళ్ల పట్టాలతో లబ్ధిదారులు



సభకు హాజరైన లబ్ధిదారులు

చేయాలనే చూసిన చంద్రబాబుకు పసుపు రాసి, జగనన్నకు వీర తిలకం దిద్ది అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ, దేశంలో మరెక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిందని చెప్పారు. సారిక వద్ద సుమారు 120 ఎకరాల్లో 4 వేల ప్లాట్లతో మరో లే అవుట్‌ను రూపొందించామని చెప్పారు. ఒక్కో పేద కుటుంబానికి సుమారు రూ. 6 లక్షల విలువైన స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం, ఉచితంగా ఇసుక ఇస్తున్నట్లు తెలిపారు.

విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయనగరం మేయర్ వి.విజయలక్ష్మి, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ రమణమూర్తి, మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఎంపీడీఓ జి.వెంకటరావు, మండల స్థాయి అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ...



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఉత్సాహభరిత వాతావరణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

విజయనగరం: గడిచిన మూడున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వపరంగా అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ... స్థానిక సమస్యలు తెలుసుకుంటూ... విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఉత్సాహభరిత వాతావరణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతోంది. నగరంలోని 12వ డివిజన్ పెద్దపల్లివీధిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశబూరు. అనంతరం స్థానికులు పలు సమస్యలు తెలియజేయగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు బొంగ భానుమూర్తి, పైడితల్లి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ వెత్సా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో స్వర్ణయుగం ప్రారంభమైందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో అందిస్తూ సుపరిపాలన అంటే ఏమిటో చేసి చూపిస్తున్నారని కొనియాడారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్థానికంగా సమస్యలను పరిష్కరిస్తూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, డివిజన్ కార్పొరేటర్ రేగాన రూపాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లను అడ్డుకోవాలి

విజయనగరం అర్బన్: గంట్యాడ మండల కేంద్రంలోని రాధాకృష్ణ రైస్ మిల్లులో ధాన్యం అన్‌లోడింగ్‌లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని.. వాటిని అడ్డుకోవాలని ఏపీ రైతు జిల్లా సంఘం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సంఘ జిల్లా కార్యదర్శి బి.రాంబాబు గురువారం జేసీ కె.మయూర్ అశోక్‌కి ఆన్‌లైన్‌లో విషయాన్ని తెలియజేశారు. రైతు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆర్‌బీకేల్లో పరీక్షించినప్పటికీ, మిల్లర్ మళ్లీ పరీక్షించి అదనపు ధాన్యంతో పాటు అన్‌లోడ్ చార్జ్ కింద బ్యాగ్‌కు రూ. 5 వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుంకలాంలో గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రీసు రామలక్ష్మణ (39) గ్రామ శివారులో ఉన్న తాటిచెట్టు ఎక్కి తాటికల్లు తీస్తుండగా.. ప్రమాదవశాత్తూ చెట్టుపైనుంచి జారిపడి మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఏఎస్సై ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్‌ఈ పి. నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చాకలిపేట, గుండాలపేట, సుంకరిపేట, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డెంకాడలో..

డెంకాడ: మండలంలోని అక్కివరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కివరం, బంటుపల్లి, గంట్లాం, గొలగాం, డి.తాళ్లవలస, బెల్లాం, అమకాం, పేడాడ, ఆర్.తమ్మాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పల్లె ముంగిటకు ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి పల్లె ముంగిటకు పాలన తీసుకువచ్చారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బంటుపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ కార్యాలయ భవనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ, గతంలో పలు ప్రభుత్వ సేవల కోసం జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు గ్రామాల్లోనే ఆ సేవలన్నీ అందుతున్నాయని చెప్పారు. అలాగే గ్రామ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవారవు, వైస్ ఎంపీపీలు కూరాకుల అనిత, పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ చిక్కాల హేమలత, సొసైటీ డైరెక్టర్ చిక్కాల జనార్ధనరావు, ఎంపీడీఓ స్వరూపారాణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సచివాలయ కార్యాలయ భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

విద్యకు అధిక ప్రాధాన్యం

- జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



నెల్లిమర్ల: ట్యాబ్‌లు అందుకున్న కొండవెలగాడ విద్యార్థులతో జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నెల్లిమర్ల నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, కో ఆప్షన్ సభ్యుడు చిక్కాల సాంబశివరావు అన్నారు. మండలంలోని కొండవెలగాడ, నగర పంచాయతీలోని బాలికల ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యాబోధనలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను ప్రభుత్వం అందిస్తోందన్నారు. 3వ తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం అందుబాటులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. అందులో భాగంగానే 8వ తరగతి విద్యార్థులకు అవసరమైన ట్యాబ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని, విద్యార్థులంతా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సతివాడ మోడల్ పాఠశాలలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అలాగే పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో స్థానిక కౌన్సిలర్ బూర సుజాత విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ కారుకొండ వెంకట కృష్ణారావు, కౌన్సిలర్ చిక్కాల సంతోష్ కుమార్, సర్పంచ్‌లు కర్రోతు వెంకటరమణ, ఎం. వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు వి. అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.



పూసపాటిరేగ: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

నాణ్యమైన విద్య

పూసపాటిరేగ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని పసపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం నూతన విద్యావిధానంలో విద్యార్థులకు డిజిటల్ విద్య అందించనుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ప్రజాప్రతినిదులు మహంతి శ్రీనివాసరావు, వాళ్లె సన్యాసినాయుడు, కంది రమణ, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం గైర్హాజరు



విచారణ చేపడుతున్న ఎంఈఓ రమణమూర్తి

భోగాపురం: మండలంలోని రావాడ పంచాయతీ గొల్లపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం చింతల రామచంద్రరావు గురువారం విధులకు గైర్హాజరయ్యారు. దీంతో పాఠశాలలో చదువుకుంటున్న చిన్నారులు స్కూలు బయట ఆడుకోవడం చూసి స్థానికులు సీఆర్‌పీ మురళీకృష్ణకు తెలియజేశారు. దీంతో సీఆర్‌పీ ద్వారా విషయం తెలుసుకున్న ఎంఈఓ రమణమూర్తి పాఠశాలకు చేరుకున్నారు. పక్కనే ఉన్న రావాడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గ్రంధి రమణను తీసుకువచ్చి పాఠాలు చెప్పించారు. అలాగే మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సరుకులు అందజేశారు. అనంతరం హెచ్‌ఎం రామచంద్రరావుకు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో గ్రామస్తులు, పీఎంసీ సభ్యులు, సీఆర్‌పీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, పాఠశాలలో 39 మంది విద్యార్థులుండగా ఒక ఉపాధ్యాయుడు, హెచ్‌ఎం ఉన్నారన్నారు. ఉపాధ్యాయుడు ఎస్. ప్రసాద్ వ్యక్తిగత పనిమీద గురువారం సెలవు పెట్టారని, ఈ విషయం హెచ్‌ఎంకు తెలిసినప్పటికీ ఎవ్వరికీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరయ్యారని చెప్పారు. సీఆర్‌పీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు తయారు చేసిన నివేదికను డీఈఓ లింగేశ్వరరెడ్డికి దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం

- బాక్సింగ్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



దుస్తులు అందుకున్న బాక్సింగ్ క్రీడాకారులతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను సమాజం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, అటువంటి అవకాశాలను అందిపుచ్చుకుని క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. గాజులరేగకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జామాన శ్రీనివాసరావు తన జన్మదినాన్ని పురస్కరించుకుని సొంత నిధులతో వంద మంది బాక్సింగ్ క్రీడాకారులకు టీ షర్ట్‌లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడంలో ఎప్పుడూ ముందంజలో ఉంటారన్నారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, సమాజం గురించి ఆలోచించి, తన పుట్టినరోజున శ్రీనివాసరావు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతైనా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డోలా మన్మథకుమార్, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, గాజులరేగ పీఏసీఎస్ అధ్యక్షుడు జమ్ము మధు, పార్టీ నాయకులు కనుగుల రాజా, గార సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..



సీహెచ్ అగ్రహారంలో మొక్కజొన్న సాగును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఎ.డి నాగభూషణరావు, తదితరులు

పూసపాటిరేగ: మొక్కజొన్న సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ విజయనగరం డివిజన్ ఎ.డి నాగభూషణరావు సూచించారు. మండలంలోని సీహెచ్ అగ్రహారంలోని రైతుభరోసా కేంద్రంలో మొక్కజొన్న సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశిస్తున్నందున రైతులు సస్యరక్షణ పాటించాలన్నారు. రైతుభరోసా కేంద్రం ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు సకాలంలో సరఫరా చేయనున్నట్లు చెప్పారు. అనంతరం సీహెచ్ అగ్రహారంలో మొక్కజొన్న వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొల్లి నీలిమ, సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు, వ్యవసాయ విస్తరణాధికారి కె. వాగ్దేవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ప్రజలే సాక్షి




ఆర్థికలబ్ధి పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు లబ్ధిదారులైన ప్రజలే సాక్షి అని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బంటుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి ఇప్పటివరకు ఆయా కుటుంబాలకు అందించిన ఆర్థిక ప్రయోజనాలను వివరించి, అందుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. పార్టీలకు, కుల,మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వేసుకునే యూనిఫాం నుంచి పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే పింఛన్‌ను వచ్చే నెల నుంచి 2,750 రూపాయలు అందివ్వనున్నట్లు చెప్పారు. జన సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీలు కూరాకుల అనిత, పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ చిక్కాల హేమలత, సొసైటీ డైరెక్టర్ చిక్కాల జనార్ధనరావు, ఎంపీడీఓ స్వరూపారాణి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: వైద్యరంగంలో వస్తున్న అధునాతన వైద్య సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ శంబంగి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న గ్రహణంమొర్రి శస్త్రచికిత్సల ఉచిత వైద్యశిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రహణంమొర్రి బాధితులకు శస్త్రచికిత్సలు అందుబాటులోకి రావడంతో వారి జీవితాల్లో వెలుగులు నింపినట్లు అయిందన్నారు. సామాజిక బాధ్యతగా స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జన్ శ్రావణి, డాక్టర్లు తిరుమల ప్రసాద్, మహేశ్వరావు, పీఎస్‌వీ రామారావు, దుర్గాప్రసాద్, ప్రభాకర్, కుష్బూ, స్టాఫ్ అడ్మిన్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా...

కందుకూరు ఘటనపై ప్రధాని మోదీ సంతాపం

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా



సాక్షి, న్యూఢిల్లీ: నెల్లూరు జిల్లా కందుకూరు దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ మేరకు గురువారం మోదీ ట్వీట్ చేశారు. 'నెల్లూరు బహిరంగ సభలో జరిగిన దుర్ఘటన వల్ల తీవ్రంగా కలత చెందాను. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రధాన మంత్రి సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్ గ్రేషియా మంజూరు చేస్తాం' అని ప్రకటించారు.

గవర్నర్ సంతాపం



సాక్షి, అమరావతి: కందుకూరులో బుధవారం రాత్రి జరిగిన దుర్ఘటనలో 8 మంది దుర్మరణం చెందడంపై గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను గవర్నర్ ఆదేశించినట్టు రాజ్‌భవన్ వర్గాలు గురువారం తెలిపాయి.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డవారికి రూ.50 వేల చొప్పున పరిహారం



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నెల్లూరు జిల్లా కందుకూరులో నిర్వహించిన రోడ్ షోలో 8 మంది మరణించిన ఘటనపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డ వారికి రూ.50 వేల చొప్పున పరిహారం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గురువారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఈ మేరకు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ప్రకటించారు.

చంద్రబాబును అరెస్ట్ చేయాలి

కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో కేఏ పాల్ ఫిర్యాదు



కందుకూరు అర్బన్ : రోడ్డు షోలో 8 మంది మృతికి కారణమైన చంద్రబాబుపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన ఘటన స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో చంద్రబాబుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ డబ్బులు, మందు, బిర్యానీ పంచి ప్రజలను తీసుకొచ్చి రెండు వేల మంది పట్టే స్థలంలో సభ పెట్టి 8 మందిని బలితీసుకున్న చంద్రబాబుపై కేసు ఎందుకు నమోదు చేయరని ప్రశ్నించారు. వెంటనే 304 ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేశానని, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకొనే చంద్రబాబు దీనికి బాధ్యత వహించి టీడీపీకి రాజీనామా చేసి రాజకీయాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన హయాంలో రాష్ట్రం ఏం అభివృద్ధి చెందిందో అందరికీ తెలుసన్నారు.

కేఏ పాల్‌పై దాడికి యత్నం

కేఏ పాల్ మీడియాతో మాట్లాడుతుండగా టీడీపీ యువకులు ముగ్గురు ఆయనపై దాడికి యత్నించారు. పోలీసులు రంగప్రవేశం చేసి యువకుల బారి నుంచి పాల్‌ను రక్షించి ఆయనను అక్కడి నుంచి పంపించి వేశారు.

తెలంగాణ

పరిశ్రమకు నేను పెద్దను కాదు: చిరంజీవి



హైదరాబాద్: సినీ పరిశ్రమకు తాను పెద్దను కానని, కొందరు తమ వయసును తగ్గించుకునేందుకు తనను అలా అంటున్నారనిపిస్తోందని మెగాస్టార్ చిరంజీవి వ్యాఖ్యానించారు. తను పరిశ్రమలో ఒకనిగా ఎదిగానని, ఎక్కడా పెద్దరికం చేయలేదన్నారు. సినీ పరిశ్రమ తాను అనుకున్న దానికన్నా అధికంగానే ఇచ్చిందని, ఇక నుంచి నావంతుగా సినీ కార్మికులకు సహాయం చేస్తానని చిరంజీవి హామీనిచ్చారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధి చిత్రపురి కాలనీలో 1176 ఎంఐజీ గృహాలు , 180 హెచ్ఐజీ డ్యూప్లెక్స్ విల్లాలకు సంబంధించి లబ్ధిదారులకు తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పత్రాలను అందజేశారు. లబ్ధిదారులు సామూహిక గృహ ప్రవేశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి కూడా పాల్గొన్నారు.

కొంప ముంచిన ప్రచార పిచ్చి

తన గ్రాఫ్ పెరిగిందని చూపేందుకు తిమ్మినిబమ్మి చేసే యత్నం

- ఇందు కోసం ఎంతకైనా తెగించేందుకు చంద్రబాబు సిద్ధం
- నాడు పుష్కరాల్లో ఓ ఇంగ్లిష్ టీవీ చానల్ షూటింగ్
- నేడు సొంత టీమ్‌తో డ్రోన్ విజువల్స్ కోసం యత్నం
- తన సభకు జనం విరగబడి వచ్చారని చూపించాలనే ఆత్రం
- కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పైగా రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ ఎదురు దాడి



సభ నిర్వహించాల్సిన ఎన్టీఆర్ సర్కిల్ ఇదీ..



సభ నిర్వహించిన ఇరుకు రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతం.. (బాణం గుర్తు వైపు)

సాక్షి, అమరావతి/ సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కందుకూరు : రాజకీయాలకు సంబంధించి ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు ప్రజలను భ్రమింపజేయడంలో చంద్రబాబును మించిన వారెవరూ లేరని మరోమారు నిరూపించుకున్నారు. తన ప్రచార పిచ్చి కోసం అమాయకులైన ప్రజల ప్రాణాలకు ఆయన ఏమాత్రం విలువ ఇవ్వరు. తన రాజకీయ ప్రయోజనాలు, పబ్లిసిటీ తప్ప ఆయనకు మరేమీ కనిపించవు. ఈసారి జరగబోయే ఎన్నికలే తనకు చివరివి అని చంద్రబాబు తన నోట తానే ఒప్పుకున్నారు. ఎలాగైనా గెలవాలని, ఇందుకోసం ఏం చేయడానికైనా వెనుకాడకూడదని నిర్ణయించుకుని.. ప్రభుత్వంపై దుష్ప్రచారానికి తెర లేపారు. ఇదేం ఖర్మ.. అంటూ ఊరూరా తిరగడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో తన సభలకు జనం రావడం లేదనే వాస్తవాన్ని కప్పి పుచ్చుకునేందుకు ఇరుకు సందులను ఎంచుకుని, అక్కడకి భారీగా జనాన్ని సమీకరించడం ద్వారా తండోపతండాలుగా వచ్చినట్లు చూపించే ఎత్తుగడను కొద్ది నెలలుగా అమలు చేస్తున్నారు. తన సభలు సక్సెస్ అయ్యాయని, తన జీవితంలో ఎప్పుడూ చూడనంత మంది జనం వచ్చారని ఆయన ఇటీవల పదేపదే చెబుతుండటమే ఇందుకు నిదర్శనం. పెద్ద కూడళ్లు, గ్రౌండ్లలో సరిపడా జనం తన సభలకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆయన ఈ వైఖరి ఎంచుకున్నారు. ఇరుకు సందుల్లో సభలు నిర్వహిస్తూ.. సొంత టీమ్ ద్వారా డ్రోన్ షూటింగ్/ డ్రోన్ ఫొటోల ద్వారా జనం కిక్కిరిసినట్లు చిత్రీకరించడం ద్వారా పడిపోయిన తన గ్రాఫ్ పెరిగినట్లు చూపించుకునేందుకు తహతహలాడుతున్నారు.

తప్పు చేసి, ప్రభుత్వంపై నెట్టేసే యత్నం

ఈ తాపత్రయంలో భాగంగానే కందుకూరులో ఇరుకు సందులో కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండానే సభ పెట్టి 8 మంది ప్రాణాలు కోల్పోవడానికి చంద్రబాబు కారకుడయ్యారు. ఇంతమంది ప్రాణాలు పోయినా కనీస పశ్చాత్తాపం కూడా ఆయనలో కనిపించకపోవడం అన్యాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సభకు సరైన భద్రత కల్పించకపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందంటూ నెపాన్ని చాలా తేలిగ్గా పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా.. జగన్ సభలో ఒకరు.. పవన్ సభలో ఒకరు చనిపోయారని, ఇలాంటివి మామూలేనని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. 2015లో గోదావరి పుష్కరాల సమయంలో పుష్కరఘాట్‌లో వేలాది మందిని ఒక గేటు వద్ద నిలిపి, ఒక్కసారిగా గేటు తెరిపించి తొక్కిసలాటకు కారణమయ్యారు. ఆ దారుణ ఘటనలో 29 మంది అమాయక యాత్రికులు మృత్యువాత పడగా, 60 మంది గాయాలపాలయ్యారు. అప్పట్లో ఆ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కుంభమేళా తరహాలో తాను గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహించానని ఒక ఇంగ్లిష్ టీవీ చానల్ ద్వారా చూపించుకునేందుకు ఆ షూటింగ్ నిర్వహించే క్రమంలో ఆ దారుణం జరిగింది. ఈ ఘటనపై అప్పట్లోనూ చంద్రబాబు పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా కుంభమేళాలో జనం చనిపోలేదా? రోడ్డు ప్రమాదాల్లో ఎంత మంది చనిపోవడం లేదు? అంటూ బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు కూడా కందుకూరు ఘటనపై ప్రభుత్వంపై ఆవేశంతో జనం వచ్చారంటూ.. వక్రీకరించారు. ఇలా చంద్రబాబుకు మొదటి నుంచీ అలవాటైన విద్యేనని విశ్లేషకులు చెబుతున్నారు.



రోడ్డును ఆక్రమించి టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

కింద పడ్డవారిని తొక్కుకుంటూ వెళ్లారు



నేను, నా ఫ్రెండ్ ఇద్దరం టీడీపీ మీటింగ్‌కు వెళ్లాం. బాబు వాహనానికి కొంచెం దూరంలో నిలబడి ఉన్నాం. ఎందుకో ఒక్కసారిగా జనాలు పరుగులు పెట్టడం మొదలుపెట్టారు. దీంతో మా పక్కనే ఉన్న బైక్‌లు కిందపడ్డాయి. ఒక బైక్ కింద నాఫ్రెండ్ పడ్డాడు. వాడు పెద్దగా అరుస్తున్నాడు. అయినా జనాలు ఆగకుండా తొక్కుకుంటూ వెళ్తున్నారు. వాడి అరుపులకు భయమేసి వాడిని కాపాడానికి వెళ్లాను. బైక్ కింద ఉన్న వాడిని పట్టుకుని గట్టిగా పక్కకు లాగాను. ఈ ప్రయత్నంలో నా కాలు బైక్ కింద ఇరుక్కుపోయి రక్తం కారింది. అయినా ఒకరి కొకరం లొక్కుని ప్రాణాలతో బయటపడ్డాం.

– మోసీన్, ప్రమాదంలో గాయపడిన యువకుడు

మృతుల కుటుంబాలకు చంద్రబాబు పరామర్శ

- ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చెక్కు అందజేత
- పార్టీ నాయకుల సాయం రూ.2.5 లక్షల చొప్పున పంపిణీ
- పోలీసుల వైఫల్యం, నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపణ

కందుకూరు: కందుకూరులో టీడీపీ రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన 8 మంది కుటుంబాలను ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు గురువారం పరామర్శించారు. మొదట కందుకూరు మండలం ఓగూరులో గడ్డం మధుబాబు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కందుకూరులో కాకుమాని రాజా, కొండముడుసుపాలెంలో కలవకూరి యానాది కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ రోడ్‌షో, బహిరంగ సభలకు పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నారని చెప్పారు. అయితే బుధవారం రాత్రి కందుకూరులో తన కళ్ల ఎదుటే దుర్ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. సభ జరిగిన ప్రదేశంలో ఒక ఐస్‌క్రీం బండి పడిపోవడం, దానిపై బైక్‌లు పడటం, ఆ బైక్‌లు అక్కడ ఉన్నవారిపై పడటం వల్ల అలజడి రేగి ప్రమాదం చోటు చేసుకుందన్నారు. తాను గైడ్ చేస్తున్నా వినిపించుకునే పరిస్థితి లేదన్నారు. దేవుడు చిన్న చూపు చూడడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయని అన్నారు. చనిపోయిన వారిలో నలుగురు ఎస్సీలు, ఒకరు ఎస్టీ, ఒకరు బీసీ, ఇద్దరు ఓసీలు ఉన్నారని వివరించారు. పార్టీ తరఫున మృతుల కుటుంబాలను సంపూర్ణంగా ఆదుకుంటామని చెప్పారు. పార్టీ తరఫున ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చెక్కు అందజేస్తున్నామన్నారు. మృతుల కుటుంబాల పిల్లలను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తామని హామీ ఇచ్చారు. ప్రధాన మంత్రి మోదీ స్పందించి రూ.2 లక్షలు ప్రకటించడం పట్ల ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. తాను అనేక రోడ్‌షోలు, మీటింగ్‌ల్లో పాల్గొన్నానని, ఇరుకు రోడ్లలో మీటింగ్‌లు పెట్టుకోవాల్సిన అవసరం తనకు లేదని అన్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లోనే అన్ని పార్టీలు మీటింగ్‌లు పెడుతున్నాయన్నారు. బుధవారం మీటింగ్‌కు అధిక సంఖ్యలో జనాలు రావడంతో పోలీసులు కంట్రోల్ చేయలేకపోయారని, నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అందువల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ప్రమాద ఘటనపై అధికార పార్టీ నాయకుల ఆరోపణలు అర్థరహితమన్నారు. అనంతరం ఆయన గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

పార్టీ తరఫున ప్రకటించిన రూ.15 లక్షల చొప్పున చెక్కులను చంద్రబాబు మృతుల కుటుంబాలకు అందజేశారు. కందుకూరుకు చెందిన నాయకులు ఇంటూరి రాజేష్, కంచర్ల శ్రీకాంత్‌లు చెరో రూ.లక్ష చొప్పున, పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఇచ్చిన రూ.50 వేలను అందజేశారు. మొత్తం మీద ఒక్కో కుటుంబానికి రూ.17.50 లక్షలు అందజేశారు. మిగిలిన నాయకులు ప్రకటించిన ఆర్థిక సాయాన్ని కూడా త్వరలోనే అందజేస్తారని తెలిపారు.

డబ్బులు వద్దు.. మా నాన్న కావాలి

- మృతుడి కుమారుడి నుంచి చంద్రబాబు ఊహించని ప్రశ్న
- అది తన చేతుల్లో లేదని, బాగా చదువుకోవాలని సూచన



గడ్డం మధుబాబు కుమారుడు కార్తికేయతో మాట్లాడుతున్న చంద్రబాబు

కందుకూరు రూరల్ : కందుకూరులో బుధవారం తన సభలో ఒకరిపై ఒకరు పడిపోయి మృతి చెందిన ఓగూరు గ్రామానికి చెందిన గడ్డం మధుబాబు కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన చంద్రబాబుకు మృతుడి కుమారుడి నుంచి ఊహించని ప్రశ్న ఎదురైంది. గురువారం ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేసేందుకు చంద్రబాబు ఆ గ్రామంలోని వారి ఇంటికి వెళ్లారు. మృతదేహానికి నివాళులర్పించి.. తల్లి చినకొండమ్మ, భార్య మాధవి, పిల్లలు కార్తికేయ, లికిత, సుశాంత్‌లతో మాట్లాడారు. వారిని ఓదార్చుతున్న సమయంలో మధుబాబు కుమారుడు కార్తికేయ.. 'మాకు డబ్బులు వద్దు.. నాన్నే కావాలి.. డబ్బులు ఎలాగోలా తెచ్చుకుంటాం.. నాకు నాన్న కావాలి' అని అడిగాడు. 'అది నా చేతుల్లో లేదు.. భగవంతుడు తీసుకెళ్లాడు. మిమ్మల్ని చదివిస్తాను. మీ బాగోగులను మేం చూసుకుంటాం' అని చంద్రబాబు చెప్పారు. 'చివరికి తెలుగుదేశంలో ఇలా కలిసిపోతావనుకోలేదు బిడ్డా' అంటూ మృతదేహం వద్ద తల్లి బోరున విలపించింది. మృతుల్లో మరొకరైన కొండముడుసుపాలెంలోని కలవకూరి యానాది కుటుంబాన్ని కూడా చంద్రబాబు పరామర్శించారు. యానాది భార్య కాంతమ్మ, కుమారులను ఓదార్చి, తాము అండగా ఉంటామని చెప్పారు.

అనుమతి లేని చోట సభ

- చంద్రబాబు రోడ్డు షోలో నిబంధనల ఉల్లంఘన
- ఎన్టీఆర్ సర్కిల్‌లో సభ నిర్వహించుకోవాలని చెప్పాం
- అక్కడ కాకుండా దాదాపు 50 మీటర్లు ముందుకెళ్లారు
- అది చిన్న ప్రాంతం కావడంతోనే ప్రమాదం
- డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తు : డీఐజీ త్రివిక్రమ్ వర్మ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐజీ త్రివిక్రమ్‌వర్మ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కందుకూరు : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో 8 మంది మృతికి కారణమైన చంద్రబాబు నాయుడు రోడ్ షోలో నిబంధనలు ఉల్లంఘించారని గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమ్ వర్మ తెలిపారు. గురువారం ఆయన నెల్లూరు ఎస్పీ విజయారావుతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్షించిన అనంతరం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో విలేకరులతో మాట్లాడారు. పోలీస్ శాఖ ఎన్టీఆర్ సర్కిల్‌లో చంద్రబాబు వాహనం నిలిపి మాట్లాడేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. కానీ వాహనం మాత్రం సర్కిల్ నుంచి దాదాపు 50 మీటర్లు ముందుకు వెళ్లడంతో వెనుక వైపు ఉన్న జనం ఒక్కసారిగా ముందుకు కదిలారని తెలిపారు. వై ఆకారంలో ఉన్న ఆ ప్రాంతంలో రెండు వైపులా జనం ముందుకు చొచ్చుకు రావడంతో ఆ చిన్న ప్రదేశంలో అప్పటికే అక్కడ ఉన్న వారు ఎటూ వెళ్లలేక ప్రమాదంబారిన పడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ అనుమతి లేకుండానే శింగరాయకొండ హైవే నుంచి చంద్రబాబు వాహనం ముందు 1,000 – 1,500 బైకులతో ర్యాలీ నిర్వహించారన్నారు. ఒకవైపు పట్టణ సీఐ బైకు ర్యాలీ వద్దని వారిస్తున్నా లెక్క చేయలేదని తెలిపారు. అనుమతి ఇవ్వకపోయినా క్రాకర్స్ కాల్చారన్నారు. 7.30 గంటలలోపు సభ ముగించాలని ముందుగా స్థానిక డీఎస్పీ స్పష్టం చేసినప్పటికీ, పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఇలా పలు నిబంధనలు ఉల్లంఘించారని తెలిపారు. డీఎస్పీ స్థాయి అధికారి ఈ కేసు దర్యాప్తు చేస్తారని డీఐజీ తెలిపారు.

ఘటనపై కేసు నమోదు

కందుకూరు ఘటనలో గాయపడిన స్థానికుడు పిచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఆర్‌పీసీ 174 ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతానికి ఎవరినీ నిందితులుగా చేర్చలేదు. పూర్తి విచారణ తర్వాత అన్ని అంశాలు చేరుస్తామని పట్టణ ఎస్ఐ కిశోర్ తెలిపారు. ఇదిలా ఉండగా, 8 మంది మృతదేహాలకు గురువారం ఉదయం రిమ్స్ నుంచి వచ్చిన వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి, సురేష్‌ల బృందం పోస్టుమార్టం నిర్వహించింది. ఊపిరి ఆడక పోవడం వల్లే వారంతా మృతి చెందారని నిర్ధారించినట్లు సమాచారం. పంచనామా అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎన్నికల్లో గెలిపిస్తే రౌడీయిజాన్ని రూపుమాపుతా

- కావలి సభలో చంద్రబాబు నాయుడు

కావలి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే నాణ్యమైన, అవినీతి లేని పాలన అందిస్తానని, రౌడీయిజాన్ని రూపుమాపుతానని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో బుధవారం 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి' రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. బుధవారం రాత్రి చంద్రబాబు కందుకూరు రోడ్ షోలో జరిగిన ఘటనకు నెపాన్ని పోలీసులపై నెట్టేందుకు ప్రయత్నించారు. ఈరోజు ఇక్కడికి వచ్చినంత మంది పోలీసులు కందుకూరు వచ్చుంటే ప్రమాదం జరిగుండేది కాదంటూ సమర్థించుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై అర్థంలేని ఆరోపణలు చేశారు. మద్యం బ్రాండ్లన్నీ జగన్‌మోహన్ రెడ్డి జే బ్రాండ్‌లేనని అన్నారు. అమ్మే షాపులు, డిస్ట్రిబ్యూషన్ అన్నీ ఆయనవేనని, డబ్బులు కూడా రెండు ఉంటాయని, ఒకటి గవర్నమెంట్‌కి, ఇంకొకటి తాడేపల్లి ప్యాలెస్‌కి వెళుతుందన్నారు. ఏడాదికి రూ.375 కోట్లు జగన్‌మోహన్‌రెడ్డికి వస్తుందన్నారు. ఈ డబ్బుతో వచ్చే ఎన్నికల్లో ఓటుకు పది వేలు పెట్టి కొంటారని అన్నారు. ఈ డబ్బు తీసుకుంటే మన గోతులు మనమే తవ్వుకున్నట్లు అవుతుందని అన్నారు. అన్న క్యాంటీన్లు తొలగించారని, చంద్రన్న బీమా రద్దు చేశారని, ఉద్యోగాలు రావడం లేదని చెప్పారు. మీ పిల్లలకు ఎవరికైనా న్యాయం జరిగిందా అని ప్రశ్నించారు. తాను ఉద్యోగాలు ఇచ్చానని, రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చానన్నారు. తాను అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం తెస్తానని, మీ ఆరోగ్యాలు బాగు చేస్తానని చెప్పడంతో అక్కడున్న అందరూ అవాక్కయ్యారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి దండ కూడా వేయని బాబు

స్థానిక ట్రంక్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సాయంత్రం 4 గంటలకు జరగాల్సిన చంద్రబాబు రోడ్ షో జనాలు రాకపోవడం, ఇరుకు రోడ్లు కూడా నిండకపోవడంతో రాత్రి 8.15 గంటలకు ప్రారంభించారు. తన ప్రతిభాపాటవాలు గురించి గొప్పలు చెప్పుకున్న చంద్రబాబు నీతి సూక్తులు కూడా వల్లెవేశారు. ప్రభుత్వంపై అర్థం లేని ఆరోపణలు చేయడం ,వాస్తవాలతో సంబంధం లేకుండా మాట్లాడటంతో ఎలా స్పందించాలో అర్థంకాక కార్యకర్తలు తలలు పట్టుకున్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం పక్కన సభ ఏర్పాటు చేసిన చంద్రబాబు కనీసం ఆయన పేరు ఉచ్చరించలేదు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించలేదు. బాబు తీరుపై పట్టణవాసుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి.

కందుకూరు పాపం బాబుదే

- చంద్రబాబుపై హత్యకేసు నమోదు చేయాలి
- దుర్ఘటనపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహజ్వాల

సాక్షి నెట్‌వర్క్ : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో ఎనిమిది మంది మృతిచెందిన ఘటన.. టీడీపీ అధినేత చంద్రబాబు తీరుపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతిపెద్ద విషాదం సంభవిస్తే కార్యకర్తలందరినీ అక్కడే ఉండమని ఆయన చెప్పడం ఏమిటని వైఎస్సార్‌సీపీ చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విశాలమైన ప్రాంతాల్లో అయితేనే అనుమతులు మంజూరు చేయాలని వారు సూచించారు. దుర్ఘటనపై ఎవరెవరు ఏమన్నారంటే..

ఆయనలో పశ్చాత్తాపంలేదు : సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు

కందుకూరులో 'నారా'బలికి చంద్రబాబే బాధ్యుడు. తన సభకు ఎక్కువ మంది తరలివచ్చారని చెప్పుకోవాలనే ప్రచార పిచ్చితో క్రూరమైన ప్రణాళిక అమలుచేశారు. ఇంత జరిగినా ఆయనలో పశ్చాత్తాపం లేదు. పైగా ప్రభుత్వంపై వ్యతిరేకతతో అంతమంది ఆవేశంగా వచ్చారని అంటున్నారు. లెక్కలేనితనంతో చేసే ఇలాంటి కార్యక్రమాలను నేరాలుగానే పరిగణించాలి. ఈ ఘటనను బట్టి భవిష్యత్ కార్యక్రమాల విషయంలో అధికార యంత్రాంగం నిర్ణయాలు తీసుకుంటుంది. సమయం, ప్రదేశం, సభ జరిపిన పద్ధతి, బారికేడ్లు.. ఇవన్నీ నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తాయి. దీనిపై పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖలు నిబంధనల ప్రకారం వ్యవహరిస్తాయి.

చంద్రబాబుకు మృతుల కుటుంబాల ఉసురు : మంత్రి కాకాణి

ప్రచార యావతో ప్రజల్ని పొట్టన బెట్టుకుంటున్న దుర్మార్గుడు ఆయన. కందుకూరు సంఘటనపై చంద్రబాబును ముద్దాయిగా చేర్చి పూర్తిస్థాయి విచారణ చేయాలి. మృతుల కుటుంబాల ఉసురు చంద్రబాబుకు, తెలుగు దేశం పార్టీకి తగులుతుంది. ప్రభుత్వంపై, పోలీసులపై విమర్శలు చేస్తున్న ఆయన, టీడీపీ నేతలు కనీసం ఎక్కడైనా పోలీసులను గౌరవించారా, వారి సలహాలు పాటించారా.. అవేమీ చేయకుండా ప్రభుత్వంపై, పోలీసులపై నిందలు వేయడం మానుకోవాలి.

ఈ పాపం ముమ్మాటికీ బాబుదే : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చంద్రబాబుదే ఈ పాపం. ఎనిమిది మంది మృతిచెందడం, అనేకమంది గాయపడడం చాలా బాధాకరం. దుర్ఘటన జరిగిన వెంటనే సభకు వచ్చిన వారిని ఇక్కడే ఉండండి సభ నిర్వహిద్దామంటూ బాబు అనడం ఆయన అధికార దాహానికి అద్దంపడుతోంది.

బాబు దుష్ట ఆలోచనవల్లే : డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చంద్రబాబు దుర్బుద్ధి, దుష్ట ఆలోచనవల్లే రోడ్‌షోలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రజలకు మంచి చేసేందుకు సీఎం జగన్‌లా ముందుండాలి తప్ప, ప్రచారం కోసం ప్రజలను కష్టపెట్టే చర్యలను బాబు మానుకోవాలి.

ప్రజల ప్రాణాలతో చెలగాటం : మంత్రి కొట్టు సత్యనారాయణ

చంద్రబాబుకు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం అలవాటుగా మారింది. నాడు రాజమండ్రిలో.. ఇప్పుడు కందుకూరులో ఇలా.. ఆయన ప్రచార ఆర్భాటానికి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇప్పటికైనా చంద్రబాబు తన పర్యటనలు, సభలు మానుకుని ఇంట్లో కూర్చోవాలి.

రాష్ట్రానికి పట్టిన ఖర్మ చంద్రబాబు : డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ఏపీకి పట్టిన ఖర్మ చంద్రబాబు. ఆయన ఎక్కడ కాలుపెట్టినా అక్కడ వినాశనమే. చంద్రబాబు ఇకనైనా ఎక్కడబడితే అక్కడ కాలు పెట్టకూడదు.

చంద్రబాబే నైతిక బాధ్యత వహించాలి : మంత్రి విడదల రజిని

కందుకూరు దుర్ఘటన చంద్రబాబు ప్రచార పిచ్చికి పరాకాష్ట. దీనికి ఆయనే నైతిక బాధ్యత వహించాలి. రాజమండ్రి సంఘటన నుంచి ఆయనకు ఇంకా బుద్ధి రాలేదు. ఇలాంటి ఘటనలు ఏ ప్రభుత్వాలు తేలిగ్గా తీసుకోవు.

బాబుపై హత్య కేసు నమోదు చేయాలి : మంత్రి రోజా

పబ్లిసిటీ పిచ్చికోసం ఎనిమిది మందిని పొట్టన పెట్టుకున్న చంద్రబాబుని ఏమనాలో ప్రజలే చెప్పాలి. ఏ1 ముద్దాయిగా పెట్టి చంద్రబాబుపై హత్య కేసు పెట్టాలి. భగవంతుడు ఆయనకు శిక్ష వేస్తాడు. లోకేశ్ యువగళం పోస్టర్ రిలీజ్ చేశారో లేదో.. నిమిషాల్లో ఎనిమిది మంది మృతిచెందారు.

చంపేసి పరిహారం ఇస్తే సరిపోతుందా? : మంత్రి తానేటి వనిత

తన సభలో జనాలను చూపించుకోవాలన్న తపనతో రాత్రిపూట ఇరుకు సందులో చంద్రబాబు సభ నిర్వహించారు. చంపేసి నష్టపరిహారం ఇచ్చేస్తే సరిపోతుందా? పోలీసులు బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

చంద్రబాబువి దిగజారుడు మాటలు : మంత్రి దాడిశెట్టి రాజా

ఎనిమిది మంది అభాగ్యుల ప్రాణాలు పోతే ప్రాణత్యాగం అంటూ చంద్రబాబు రాజకీయ లబ్ధి, సానుభూతి కోసం దిగజారుడుగా మాట్లాడుతున్నాడు. వైఎస్ జగన్ వేల కిలోమీటర్లు యాత్ర చేసినా ఎక్కడా ఇలాంటి సంఘటనలు జరగలేదు.

బాబు వ్యూహం బెడిసికొట్టింది : మంత్రి సీదిరి అప్పలరాజు

వారిని టీడీపీ వాళ్లే తొక్కి చంపేశారు. చంద్రబాబు వ్యూహం బెడిసికొట్టింది. సభలకు ఎవరూ రాకపోవడంవల్లే ఇరుకు సందుల్లో రోడ్డు షోలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి ఘటనలను ఆయన రాజకీయాలకు వాడుకోవడం దురదృష్టకరం.

బాబుకు ఇదేం పిచ్చి : మంత్రి చెల్లుబోయిన

కందుకూరు దుర్ఘటన చాలా విచారకరం. మరణాలకు చంద్రబాబే బాధ్యుడు. ఇరుకు రోడ్లపై సభలను పెట్టకూడదని ఆయనకు తెలీదా. చంద్రబాబుకు ఇదేం పిచ్చి అని ప్రజలందరూ బాధపడుతున్నారు. మాకు ఇదేం ఖర్మ బాబూ అని రోదిస్తున్నారు.

ప్రజలను బలిగొనడం బాబుకు కొత్తకాదు : మంత్రి కారుమూరి

అమాయక ప్రజలను బలిగొనడం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. అయినా ఆయన దాహం తీరలేదు. ఆయనపై కేసు నమోదుచేసి తక్షణమే అరెస్టుచేయాలి. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారు.

చంద్రబాబుది ఐరన్‌లెగ్ : మంత్రి గుమ్మనూరు జయరాం

చంద్రబాబుది ఐరన్‌లెగ్. ఇదేం ఖర్మ కార్యక్రమంలో చంద్రబాబు రోడ్డు షోలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. మృతుల కుటుంబాలను సీఎం జగన్ ఆదుకుంటారు. కార్మిక శాఖ నుంచి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

ఇదే సీఎం సభలో జరిగితే.. : చీఫ్‌విప్ ప్రసాదరాజు

ఈ దుర్ఘటనపై పచ్చ మీడియా పెద్దగా స్పందించకపోవడం విచారకరం. అదే సీఎం సభలో ఇలాంటి చిన్న సంఘటన జరిగితే నానా రభస చేసేవారు. కందుకూరు ఘటనపై దర్యాప్తు, చర్యలు ఉంటాయి.

బాబు నిర్వాకంవల్లే 8 మంది బలి : మంత్రి బుగ్గన

బాబు నిర్వాకంవల్లే ఎనిమిది మంది బలయ్యారు. ఇదేం ఖర్మ పేరుతో చంద్రబాబు కందుకూరులో ఇరుకైన వీధిలో జనం ఎక్కువగా కిక్కిరిసినట్లు కనపడతారని సభ నిర్వహించారు. గతంలో గోదావరి పుష్కరాల్లోనూ చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చికి 29 మంది బలయ్యారు.

ఎక్కడ సభ పెట్టాలో తెలీదా : ఎంపీ భరత్

40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు.. ఎక్కడ సభలు పెట్టాలో తెలీకుండా ఇష్టం వచ్చినట్టు నిర్వహించి, ప్రజల ప్రాణాలతో ఆటలాడుకోవడం సమంజసమా? ఇరుకు ప్రాంతంలో.. అదీ రాత్రి సమయంలో బహిరంగ సభలు పెట్టడమేమిటి?

చంద్రబాబు రాక్షసత్వానికి నిదర్శనం : మాజీమంత్రి బాలినేని

రాజకీయ గుర్తింపు, పబ్లిసిటీ కోసం చంద్రబాబు ప్రజల ప్రాణాలు బలితీసుకోవటం అతనికి అలవాటే. ఈ విషయంలో ఆయన ప్రజలకు సమాధానం చెప్పాలి. అరకొరగా మృతుల కుటుంబాలకు ఆర్థికసహాయం ఇచ్చి చేతులు దులుపుకొంటే సరిపోదు.

వేడుక సమయం

కొత్త సంవత్సరం వచ్చేస్తోంది.
రేపు అర్ధరాత్రి పాత కేలండర్‌కి
టాటా చెప్పి కొత్త కేలండర్ అడుగు పెడుతుంది.
కొత్తగా వస్తున్న అతిథికి
సంతోషంగా స్వాగతం చెప్పాలి.
హగ్ చేసుకుని సెలబ్రేట్ చేసుకోవాలి.
బయట ఈవెంట్స్ హడావిడి అక్కర్లేదు.
భారీ ఖర్చు పెట్టక్కర్లేదు.
రోడ్డు మీద చలిలో తిరగక్కర్లేదు.
ఆత్మీయులతో కలిసి సింపుల్‌గా, వెరైటీగా
ఇంట్లోనే న్యూ ఇయర్‌కు వెల్‌కమ్ చెప్పొచ్చు.
మరి ఆ టైమ్‌లో ఏమేం చేయొచ్చు?
ఇవిగో సలహాలు.

ఇంట్లోనే వెల్‌కమ్ చెప్పండి



‘ఉందిలే మంచి కాలం ముందు ముందునా’ అన్నాడో కవి. ముందు ఉన్నది మంచి కాలమే అని నమ్మకపోతే ముందుకు సాగ లేరు ఎవరూ. తాము, తమ కుటుంబం రాబోయే రోజుల్లో సంతోషంగా ఉండాలనే కోరుకుంటారు ఎవరైనా. కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగా లని, మంచే తేవాలని కోరుకుంటూ అది అడుగు పెట్టే వేళలో వీలైనంత సంతోషంగా ఉండటా నికి ప్రయత్నిస్తారు. ఆ క్షణంలో సంతోషంగా ఉంటే సంవత్సరమంతా సంతోషంగా ఉండొ చ్చనే సెంటిమెంట్. ఆ సమయంలో ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటే సంవత్సరమంతా అలాగే గడిచిపోతుందని నమ్మకం. అందుకే డిసెంబర్ 31 రాత్రి అందరం ఉత్సాహంగా గడపడానికి చూస్తారు. తోచిన రీతిలో సంబరం చేసుకుంటారు. బయట అందుకోసమే భారీ ఈవెంట్స్ ఉంటాయి. పబ్బులు, రిసార్టులు, స్టార్ హోటళ్లు ప్రత్యేక కార్యక్రమాలతో హోరెత్తుతాయి. ఆకర్షి స్తాయి. ఖర్చు పెట్టదలచుకుని, హంగామాగా గడపాలనుకునేవారికి అదంతా బాగానే ఉంటుంది. కాని ఇళ్లల్లో ఉంటూ కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పడానికే ఎక్కువ ఫ్యామి లీలు ఇష్టపడతాయి. మీది అలాంటి ఫ్యామిలీ అయితే ఇంటి నుంచే కొత్త సంవత్సరా నికి స్వాగతం చెప్పండి.

1 మిత్రులను ఎంచుకోండి

ఇంట్లో మనం మాత్రమే ఉండి సెలబ్రేట్ చేసుకోవాలా ఫ్రెండ్స్ గాని బంధువులుగాని ఉండాలా అనేది తేల్చుకోండి. మనం మాత్రమే ఉంటే బోర్ అనుకుంటే నచ్చిన ఫ్రెండ్స్‌ను వారి కుటుంబా లతో పాటు (మరీ ఎక్కువమంది వద్దు) పిల వండి. లేదా ఇష్టమైన బంధువుల్లో ఒకటి రెండు కుటుంబాలను ఆహ్వానించండి. ఇప్పుడు పార్టీకి సిద్ధమైనవారు స్పష్టంగా లెక్క తేల్తారు.

2 ఇల్లు సర్దుకోండి

పార్టీకి వచ్చిన అందరూ లివింగ్ ఏరియాలో ఉంటారు కాబట్టి అక్కడ కూచునే వ్యవస్థను సరి చేసు కోండి. సీటింగ్ అరేంజ్‌మెంట్ చూసుకోండి. రెండో ప్లేస్‌గా ఇంటి ముంగిలిగాని పెరడుగాని డాబా గానీ ఎంచుకోండి. ఇంటి ముంగిలి లేదా పెరడు చలిమంటకు ఉపయోగప డుతుంది. డాబా మీద పార్టీ బాగుంటుంది.

3 వంట ఏమిటి?

పార్టీకి తిండి రెండు పద్ధతులు. సరదాగా వంట చేసుకోవాలంటే అందరూ కలిసి చేయండి. బార్బెక్యూ ఒక అట్రాక్టివ్ ఆలో చన. అలా కాదంటే మంచి రెస్టరెంట్ నుంచి తిండి తెప్పించుకోవాలి. ఏ తిండి అయినా పిలిచి వడ్డించే పద్ధతి వద్దు. డైనింగ్ ఏరియాలో అన్నీ పెట్టేయండి. బఫెలాగా కావాల్సినవి కావాల్సినవారు తింటారు. పార్టీకి ముందు డైనింగ్ సామాగ్రి చెక్ చేసుకోండి. సరిపడా ప్లేట్లు, స్పూన్లు సిద్ధం చేసుకోండి. హోమ్ బార్ ఉంటే గనక ఎవరు ‘ఎంత’ తీసుకుంటున్నారో నిఘా అవ సరం... ఆరోగ్య రీత్యా... అపశ్రుతులు దొర్లకుండా.

4 ఆటలు రెడీయా?

ఇండోర్ గేమ్స్ సరదాగా ఉంటాయి. పరమ పద సోపాన పటం దగ్గరి నుంచి అలనాటి ఆటలు ఎన్నో బయ టకు తీయవచ్చు. గుర్తు చేసుకోవచ్చు. పులిజూదం, వామనగుంటలు, తొక్కుడుబిళ్ల... ఇవన్నీ కొత్త ఉత్సాహం ఇస్తాయి. కళ్లు మూసి ఎదుటివారి ముఖం తాకి గుర్తు పట్టే ఆట తమాషాగా ఉంటుంది... పిల్లల కోసం చాక్లెట్లు, కొద్దిపాటి కాయిన్లు ఇంట్లోనే రకర కాల చోట దాచి ట్రెజర్ హంట్ ఆడొచ్చు. ఇక కార్డ్స్, వీడియో గేమ్స్ ఉండనే ఉంటాయి.

5 థీమ్ పార్టీ

ఏదో ఒక థీమ్ అందరూ పాటిస్తే అదో సరదా. పార్టీకి 1970ల కాలం నాటి స్టయిల్ బట్టలు ధరించాలి... లేదంటే బెల్‌బాట మ్స్‌లో రావాలి... స్త్రీలైతే ‘ప్రేమ్‌నగర్’లో వాణి శ్రీలా కట్టు, బొట్టు పాటించాలి... ఇలా సర దాగా అనుకోవచ్చు. అచ్చ తెనుగు ఆహార్యం పంచె, లాల్చీ, చీర, జడకుప్పెలు ఇలా కూడా అనుకోవచ్చు.

6 వాల్ ఆఫ్ మెమొరీస్

గత సంవత్సరంలోని మంచి జ్ఞాపకాలను తలచుకుంటే వచ్చే సంవత్సరం కూడా మంచి జ్ఞాపకాలు దక్కుతాయి. అందుకని పార్టీ జరిగే ఇంటిలో ఒక గోడను ‘వాల్ ఆఫ్ మెమొరీస్’గా పెట్టి ఫోన్ల లోని మంచి ఫొటోలను ప్రింట్స్ తీసి అంటిం చండి. వచ్చిన అతిథులను కూడా వారి బెస్ట్ మెమొరీస్‌ను ప్రింట్స్‌గా తెమ్మనండి. వాల్ ఆఫ్ మెమొరీస్ దగ్గర నిల బడి ఫొటోలు దిగండి.

7 మూవీ నైట్

సాయంత్రం నుంచి జమ అవుతారు గనుక మూవీలను ఎంచుకోండి. ఒక వైపు టీవీ స్క్రీన్ మీదో, హోమ్ థియేటర్ లోనో సినిమా నడుస్తూ ఉంటే మరోవైపు కబుర్లతో పార్టీ నడ వడం బాగుంటుంది.

8 కరోకి నైట్

పాటలు లేని పార్టీయా? పార్టీలు ఎవరు ఎలా పాడినా బాగానే ఉంటుంది. నవ్వుకోవడానికి వీలుగా ఉంటుంది. ట్రాక్స్‌ను ప్లే చేసి అభి నవ మంటసాలగానో, జాలి సుబ్రహ్మణ్యం గానో, జానకీలగానో రెచ్చిపోవచ్చు. పిల్లలతో కలిసి అంత్యాక్షరి ఎలానూ ఆడొచ్చు. పాటలు రికార్డు చేసి పార్టీకి రాని వారికి పంపి వారి మీద కసి తీర్చుకోవచ్చు.


9 దంపతులకు మాత్రమే

ఇంట్లో ఇద్దరు మాత్రమే ఉంటే మీరిద్దరే కొత్త సంవత్సరానికి స్వాగతం చెబుతూ ఉంటే అది కూడా బాగుంటుంది. ఏ రాత్రి పదకొండుకో మంచి కాఫీ పెట్టుకుని, రగ్గు కప్పుకుని కూచుని గడచిన జీవితంలోని మంచి ఘట్టాలను నెమరు వేసుకోవచ్చు. కలిసి టీవీలో ఏదైనా న్యూ ఇయర్ ఈవెంట్ చూస్తూ గడప వచ్చు. లేదా పక్క పక్కనే కూచుని నిశ్శబ్దంగా పుస్తకం చదువుకోవచ్చు. పన్నెండు కాగానే ప్రేమగా ఒకరినొకరు దగ్గరకు తీసుకుని శుభాకాంక్షలు చెప్పుకోవచ్చు.

ఫ్యాషన్

‘పట్టి’ందల్లా అందమే!

వేడుకల సందర్భాల్లో ధరించే సంప్రదాయ దుస్తులకు ఎంబ్రాయిడరీ చేయించడం చూస్తూనే ఉంటాం. వాటి తయారీ కోసం కొన్ని రోజుల వరకు ఎదురుచూడటం ఖర్చు ఎక్కువ అవుతుందనుకోవడం కూడా వింటుంటాం. వీటి స్థానంలో మార్కెట్లో లభించే వివిధ రకాల డిజైనరీ పట్టీలు విస్తృతంగా వచ్చి చేరాయి. ఈ ఎంబ్రాయిడరీ స్ట్రిప్స్‌తో డ్రెస్ స్టైల్‌లో వచ్చిన మార్పులు మరింత అందాన్ని తీసుకువస్తున్నాయి.










కాటన్, సిల్క్, డెనిమ్... ఫ్యాబ్రిక్ ఏదైనా, ఇండో వెస్టర్న్ స్టైల్‌కి తీసుకురావచ్చు. సంప్రదాయ ఎంబ్రాయిడరీ స్ట్రిప్స్ ఎంచుకుంటే వాటిని కుర్తీ, లెహంగా, శారీ డిజైన్స్‌కు వాడచ్చు. అదే, వెస్టర్న్ ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్నవి లేదా మన ఇతర ప్రాచీన ఎంబ్రాయిడరీ కళతో ఉన్న స్ట్రిప్స్‌ని మోడర్న్ డ్రెస్ డిజైన్స్‌లో ఉపయోగించవచ్చు.



ఇతర అలంకారాలకూ....

బ్యాగ్, బ్యాంగిల్స్, నడుముకు ధరించే బెల్ట్... ఇలాంటి వాటిని కూడా అందమైన ఎంబ్రాయిడరీ పట్టీలను ఉపయోగిస్తూ తమ స్టైల్‌ని మరింత ఆకర్షణీయంగా మార్చేస్తున్నారు. ఇందుకు చేయాల్సిందల్లా మ్యాచింగ్ స్ట్రిప్స్‌ని ఎంచుకోవడమే. అందుకు ఎలాగూ అవకాశం ఉంది కదా!






ముగ్గు - ముచ్చట


బెన్నూరి ఉమాదేవి
సికింద్రాబాద్
15 చుక్కలు: 15 వరుసలు




కట్టమూరి సుభాషిణి
గుంటూరు
21 చుక్కలు
21 వరుసలు





ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

బ్యూటిప్స్



- టీ స్పూన్ పెరుగులో చిటికెడు పసుపు వేసికలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పది నిమిషాల తరువాత కడిగేస్తే చర్మం మృదువు అవుతుంది.
- టీ స్పూన్ బాదం నూనెలో కొన్ని చుక్కల నిమ్మరసం కలిపి ఆ మిశ్రమంతో ముఖంపై సుతిమెత్తగా మర్దన చేయాలి.
- నారింజ రసాన్ని ముఖానికి అప్లైచేసి 10 నిమిషాల తరువాత కడిగేయాలి. ఇలా తర చుగా చేస్తుంటే చర్మం కాంతివంతమవుతుంది.
- ఒకటిన్నర టీ స్పూన్ల నిమ్మరసంలో కొద్దిగా మీగడ వేసి రంగరించాలి.

వంటిల్లు

మెల్టింగ్ మెమరీస్

కాలం కరిగిపోతుంది. చాక్లెట్లు కూడా... నోట్లో వేసుకుంటే కరిగిపోతాయి. చాక్లెట్లనగానే మనకు బయటినుంచి కొనుక్కుని రావడం మాత్రమే తెలుసు. కానీ కాస్త సమయం కరిగిస్తే ... ఇంట్లో కూడా తయారు చేసుకోవచ్చు. చాక్లెట్లతో పాటే తీపి జ్ఞాపకాలను కూడా చప్పరించేయొచ్చు. అదెలాగో చూదండి మరి!

మిల్క్ చాక్లెట్

కావలసినవి: కోకో పౌడర్ – 2 కప్పులు; చక్కెర – అర కప్పు; గోధుమ పిండి– పావు టీ స్పూన్; బటర్ – ముప్పావు కప్పు (ఉప్పు లేనిది); పాలు – ముప్పావు కప్పు; నీరు – కప్పు.

తయారీ: కోకో, బటర్‌ను ప్రాసెసర్‌లో మెత్తని పేస్టు చేయాలి. ఇప్పుడు పెనం వేడి చేసి పావు కప్పు నీరు పోసి అందులో కోకో, బటర్ మిశ్రమం పేస్ట్ ఉన్న పాత్రను ఉంచాలి. కోకో మిక్స్ బాగా కరిగిన తర్వాత ఆ పాత్రను నేరుగా స్టవ్ మీద పెట్టి సన్న మంట మీద కలుపుతూ వేడి చేయాలి. మరిగే స్థాయికి వచ్చిన తర్వాత దించేసి మిశ్రమాన్ని విస్కర్‌తో బాగా చిలకాలి. ఇప్పుడు పాలను మరిగించి పిండి, చక్కెర వేసి కరిగే వరకు కలపాలి. ఇందులో కోకో మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని చాకొలెట్ మౌల్డ్ ట్రేలో పోసి ఫ్రిజ్‌లో పెట్టాలి. ఫ్రిజ్ మ్యాగ్జిమమ్‌లో ఉంచాలి. మిశ్రమం గట్టిపడిన తర్వాత బయటకు తీసి మౌల్డ్ నుంచి వేరు చేయాలి. వెంటనే వేరుపడకపోతే ట్రేని గోరువెచ్చని నీటి మీద తేలేటట్లు నాలుగైదు సెకన్ల పాటు ఉంచితే చాక్‌లెట్‌లు ట్రే నుంచి విడివడు తాయి.



వైట్ చాక్లెట్

కావలసినవి: కోకో బటర్– కప్పు; చక్కెర పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; పాల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; వెనిల్లా ఎసెన్స్– మూడు చుక్కలు.

తయారీ: ఒక పాత్రలో నీటిని వేడి చేసి అందులో కోకో బటర్ ఉన్న పాత్రను పెట్టి కలుపుతూ కరిగించాలి. దించిన తర్వాత అందులో చక్కెర పొడి, పాల పొడి, వెనిలా ఎసెన్స్ వేసి ఉండలు లేకుండా సమంగా కరిగే వరకు కలపాలి. ఈ మిశ్ర మాన్ని చాక్లెట్ మౌల్డ్‌లో పోసి ఫ్రిజ్‌లో పెట్టాలి. మిశ్రమం గట్టి పడడానికి మ్యాగ్జిమమ్ డిగ్రీల్లో అర గంట నుంచి ముప్పావు గంట పడుతుంది. ఇంకా త్వరగా కావా లంటే ఫ్రీజర్‌లో పెడితే 20 నిమిషాల్లో చాక్లెట్ తయారవుతుంది.



డార్క్ చాక్లెట్

కావలసినవి: కొబ్బరినూనె – అర కప్పు (వంటకు ఉపయోగించే నూనె); **కోకో పౌడర్**– అర కప్పు; **తేనె** – 3 టేబుల్ స్పూన్‌లు; వెనిలా ఎసెన్స్ – అర టీ స్పూన్; **వైట్ చాక్లెట్** – అంగుళం ముక్క (చిన్న పలుకులు చేయాలి).

తయారీ: పెనం వేడి చేసి కొబ్బరి నూనె వేడి చేయాలి. మరిగే ఉష్ణోగ్రతకు చేరిన తర్వాత అందులో కోకో పౌడర్, తేనె, వెనిల్లా ఎసెన్స్ వేసి బాగా కలిపి దించేయాలి. ఈ మిశ్రమం వేడి తగ్గిన తరవాత చాక్లెట్ మౌల్డ్‌లో పోసి, వైట్ చాక్లెట్ పలుకులు వేసి ఫ్రిజ్‌లో పెట్టి గంటసేపు ఉంచాలి. చాక్లెట్ మౌల్డ్ లేకపోతే ఐస్ క్యూబ్స్ ట్రేలు వాడుకో వచ్చు.



● సక్సెస్ స్టోరీస్

2022 యంగ్ స్టార్స్



ఇష్టంతో కష్టపడితే సక్సెస్ వచ్చి సలామ్ కొడుతుంది. సక్సెస్‌పై కొందరికి మాత్రమే పేటెంట్ రైట్స్ లేవు. ఎవరి దగ్గర కష్టపడే తత్వం ఉంటుందో, ఎవరి దగ్గర కొత్తగా ఆలోచించే శక్తి ఉంటుందో.... అలాంటి వారి దగ్గరికి సక్సెస్ పరుగులు పెడుతూ వస్తుంది. 2022లో తమ అద్భుతశక్తిసామర్థ్యాలతో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న కొందరు యువప్రతిభావంతుల గురించి....

'నాకు అప్పుతో పనిలేదు' అని ఎప్పుడూ అనుకోవడానికి లేదు. ఎవరైనా, ఏదో ఒక సందర్భంలో అప్పును ఆప్యాయంగా పలకరించక తప్పదు. రుణానుబంధం గాఢమైనది! ఒకప్పుడు అప్పు కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అయితే ఫిన్‌టెక్ కంపెనీల రాకతో అప్పు చేయడం సులభం అయింది. గంటల వ్యవధిలోనే రుణం పొందే అవకాశం వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఫిన్‌టెక్ కంపెనీల హవా కొనసాగుతున్న దేశాల్లో మన దేశం ఒకటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మెహుల్‌నాథ్ జిందాల్ కాలేజీ రోజుల్లోనే బెంగుళూరు కేంద్రంగా 'భారత్‌ఎక్స్' అనే ఫిన్‌టెక్ స్టార్టప్ మొదలుపెట్టాడు.


● రాహుల్ జైన్

మధ్యతరగతిని లక్ష్యంగా చేసుకొని ప్రారంభించిన ఈ స్టార్టప్ ఘన విజయం సాధించింది. సక్సెస్‌కు వయసుతో పనిలేదని నిరూపించింది.

'మెహుల్, అతని బృందానికి సబ్జెక్ట్‌పై ఉన్న అవగాహన, లోతైన జ్ఞానం చూసి ఆశ్చర్యానందాలకు గురయ్యాను' అంటున్నాడు 'భారత్‌ఎక్స్'లో పెట్టుబడి పెట్టిన 'జావా–క్యాపిటల్' కో–ఫౌండర్ కార్తీక్.

'భారత్‌ఎక్స్' కో–ఫౌండర్, సీయివో అయిన 21 సంవత్సరాల మెహుల్‌నాథ్ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

ఐఐటీ–దిల్లీ క్లాస్‌మెట్స్ నీతూ యాదవ్(26), కృతి జాంగ్రి (28) డైరీ రైతులను దృష్టిలో పెట్టుకొని 'యానిమాల్' మొబైల్ యాప్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా అడుగు వేశారు. మొదట్లో ఆశ్చర్యాలు, అనుమానాల మాట ఎలా ఉన్నా ఆ తరువాత మాత్రం ఈ ఆన్‌లైన్ క్యాటిల్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ దూసుకుపోయింది.

ఎంత పెద్ద కంపెనీ అయినా సరే, ఏదో ఒక సందర్భంలో చిన్న తప్పు చేయడం సహజం. పంజాబ్‌లో ఫెవికాల్ కంపెనీకి ఒక సమస్య వస్తే రాహుల్ జైన్ రంగంలోకి దిగాడు. ఒక డిటెక్టివ్ మాదిరిగా రకరకాల వ్యక్తులను కలుసుకొని, వారి అభిప్రాయాలను విని వ్యూహాన్ని రూపొందించి ఆ కంపెనీ సమస్య పరిష్కారం అయ్యేలా చేశాడు. ఇంతకీ ఎవరీ రాహుల్ జైన్?

బ్రాండ్ అండ్ క్రియేటివ్ స్ట్రాటజిస్ట్. తన 'సైడ్‌వేస్' కన్సల్టింగ్ ద్వారా పెద్ద కంపెనీల సమస్యలను పరిష్కరిస్తున్నాడు. క్రియేటివ్ స్ట్రాటజిస్ట్‌గా బోలెడు పేరు తెచ్చుకున్నాడు.

ముంబైకి చెందిన 28 సంవత్సరాల విరాజ్ మిథాని చిత్రకళలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. ఆర్ట్‌లో తనదైన శైలిని సృష్టించుకున్నాడు. స్కూల్ ఆఫ్ ది ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ షికాగో, యూనివర్శిటీ ఆఫ్ ది ఆర్ట్స్–లండన్, రోడ్ ఐలండ్ స్కూల్ ఆఫ్ డిజైన్(యూఎస్)లలో చదువుకున్నాడు.

కరిష్మ షాకు బయోటెక్నాలజీ అంటే చాలా ఇష్టం. ముంబైలోని 'జై హింద్' కాలేజీలో బయోటెక్నాలజీ, కొలంబియా యూనివర్శిటీలో జెనటిక్స్‌కు సంబంధించిన సబ్జెక్ట్ చదువుకుంది. క్లినికల్ ట్రయల్స్‌లోని లోపాలను సవరించడానికి, కొత్త చికిత్సా పద్ధతులను అందరికీ అందుబాటులోకి తేవడానికి 'క్లినిక్ బిజ్' అనే పరిశోధన సంస్థను స్థాపించింది 28 సంవత్సరాల కరిష్మ షా.

సమవయస్కులు(26 సంవత్సరాలు) సందీప్ శర్మ, అనీల్ కుమార్, సారంగ్ 'డొనేట్‌కార్ట్' ద్వారా సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌లో కొత్త వెలుగు తీసుకువచ్చారు.


● విరాజ్ మిథాని

29 సంవత్సరాల ఏపీ దిల్లాన్ సోషల్‌మీడియాలో సంగీత సంచలనం అయ్యాడు. దిల్లాన్ సంగీతం ఆర్ అండ్ బీ, హిప్–హప్, పాప్ అండ్ ర్యాప్‌ల సమ్మేళనం.

కేరళలోని కోచికి చెందిన 25 సంవత్సరాల అచ్యుత్ జయగోపాల్ గిటారిస్ట్‌గా మంచి పాపులారిటీ సంపాదించాడు. 'మొదట్లో స్టేజీ షో చేస్తున్నప్పుడు ప్రేక్షకుల్లో నాకు తెలిసిన వారు ఎవరు ఉన్నారు? అని చూసేవాడిని. ఇప్పుడు మాత్రం తెలిసినవారు, తెలియని వారు అనే తేడా లేకుండా ప్రేక్షకుల స్పందనపై దృష్టి పెడుతున్నాను' అంటున్నాడు అచ్యుత్. 29 సంవత్సరాల మన్సీ అశోక్ జైన్ (న్యూయార్క్) ఆర్కిటెక్ట్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. 'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే నినాదాన్ని, విధానాన్ని ఇష్టపడే మన్సీ 'అర్బన్ డిజైనర్'గా తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది. 'లండన్ స్కూల్ ఎకనామిక్స్'లో చదువుకున్న రహి చద్దాకు ఫ్యాషన్ అంటే సరదా. ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌లలో, బిగ్గెస్ట్ ఫ్యాషన్ షోలలో మెరిశాడు. ఫ్యాషన్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు.

......ఎందరో యువప్రతిభావంతులలో వీరు కొందరు మాత్రమే. అందరికీ విజయాభినందనలు.

● టెక్..టాక్



సామ్‌సంగ్ గెలాక్సీ ఏ23 5జీ

బాడీ: 165.4×76.9×8.4ఎంఎం గొరిల్లా గ్లాస్; డిస్‌ప్లే: 6.60 అంగుళాలు; రిజల్యూషన్: 1080×2408 పిక్సెల్స్; వోఎస్: ఆండ్రాయిడ్ 12; బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ ● 8ఎంపీ సెల్ఫీ కెమెరా ● ఫింగర్‌ప్రింట్ రీడర్; మెమోరీ: 64జీబి 4జీబి ర్యామ్ 64జీబి 6జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 128జీబి 8జీబి ర్యామ్

బుక్ సేఫ్ విత్ కీ లాక్

బుక్‌లా కనిపించే ఈ పోర్టబుల్ లాక్ బాక్స్‌లో క్రెడిట్ కార్డ్స్, సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు, డబ్బులు....మొదలైనవి దాచుకోవచ్చు.ఒక పుస్తకంలా పుస్తకాల అరలో పెట్టుకోవచ్చు. రెండు తాళం చెవిలు ఉంటాయి. కలర్ ఆప్షన్స్: రెడ్, బ్లూ, బ్లాక్. ప్రయాణాల సందర్భంలో దీన్ని ఉపయోగించడానికి అనుకూలంగా ఉంటుంది. బ్రాండ్: అమెజాన్ బేసిక్స్.



యూ ట్యూబ్‌లో క్యూ ఫీచర్

YouTube

వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ 'క్యూ' అనే కొత్త ఫీచర్‌ని తీసుకురానుంది. కొత్త వీడియోలు జోడించడానికి, వీడియోల ఆర్డర్‌ని సవరించడానికి, వద్దనుకున్న వీడియోలను తొలిగించడానికి ఉపయోగపడే ఫీచర్ ఇది. ప్రస్తుతం ఉన్న 'సేవ్ టు వాచ్ లాటర్' 'సేవ్ టు ప్లే లిస్ట్' ఫీచర్‌లకు ఇది భిన్నంగా ఉంటుంది. 'క్యూ' ఫీచర్‌ని ఉపయోగించడానికి...

(1) వీడియో 3–డాట్ మెనూ పై క్లిక్ చేయాలి (2) 'యాడ్ టు క్యూ' ఆప్షన్‌ని ట్యాప్ చేయాలి (3) 'క్యూ' సెక్షన్ క్రియేట్ అయిన తరువాత వీడియోలను యాడ్ చేయడం. రీఅరెంజ్ చేయవచ్చు.

● గేమింగ్

గ్రహాంతర జీవులతో ఫైట్‌కు రెడీయా!

ఇటీవల విడుదలైన ఫస్ట్‌పర్సన్ షూటర్ గేమ్ హై ఆన్ లైఫ్. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో సాగే ఈ ఆటలో ప్లేయర్స్ గటిలన్ అనే గన్స్ ఉపయోగించాల్సి ఉంటుంది. ప్రతి గన్ ప్రైమరీ, అల్టర్‌నేటివ్, స్పెషల్ ట్రిక్ హోల్ ఫైరింగ్ మోడ్స్‌లో ఉంటుంది. వార్ జరగని పరిస్థితులలో కూడా వీటి ఉపయోగం ఉంటుంది. గ్రహాంతరజీవులు, మనుషులకు మధ్య సాగే వార్‌లో మీరు భాగం కావాలనుకుంటే ఈ ఆట మీకు స్వాగతం పలుకుతుంది. జానర్స్: ఫస్ట్–పర్సన్ షూటర్ మోడ్: సింగిల్ ప్లేయర్ ప్లాట్‌ఫామ్స్: విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్.



సినిమా

మాస్ పూనకాలు


చిరంజీవి, రవితేజ

'పూనకాలు లోడింగ్' అంటున్నారు 'వాల్తేరు వీరయ్య'. చిరంజీవి టైటిల్ రోల్‌లో, హీరో రవితేజ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. కొల్లి బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'పూనకాలు లోడింగ్' పాట లిరికల్ వీడియోను నేడు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించి, పోస్టర్‌ని రిలీజ్ చేసింది. జాతర బ్యాక్‌డ్రాప్‌లో చిరంజీవి, రవితేజలపై ఈ పాటను చిత్రీకరించినట్లుగా తెలుస్తోంది. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: ఆర్థర్ ఎ. విల్సన్, సహనిర్మాతలు: జీకే మోహన్, ఎం ప్రవీణ్.

అంతర్జాతీయ గూఢచారి


● అడివి శేష్

గూఢచారిగా హీరో అడివి శేష్ ప్రయాణం మళ్లీ ఆరంభం కానుంది. అడివి శేష్ హీరోగా శశికిరణ్ తిక్క దర్శకత్వంలో రూపొందిన 'గూఢచారి' (2018) ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే 'గూఢచారి'కి సీక్వెల్‌గా 'గూఢచారి 2'ను ప్రకటించారు. 'గూఢచారి'లో హీరోగా నటించిన అడివి శేష్ సీక్వెల్ 'జీ 2'లోనూ హీరోగా నటించనుండగా, ఈ చిత్రంతో ఎడిటర్ వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ సినిమాకు అడివి శేష్ కథ అందించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ ప్రైవెట్ లిమిటెడ్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా 'గూఢచారి 2' ప్రీ విజన్ వీడియోను జనవరి 9న ఢిల్లీ, ముంబైలో ఒకే రోజున విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది. ''గూఢచారి' కథ మొత్తం భారతదేశంలోనే జరగ్గా, సీక్వెల్ అంతర్జాతీయ స్థాయిలో ఉంటుంది. ఆల్ప్స్ పర్వతాల్లో 'గూఢచారి' ముగిసిన ప్రదేశం నుంచే 'గూఢచారి 2' ప్రారంభమవుతుంది. తొలి భాగంలో ఉన్న నటీనటులతో పాటు సీక్వెల్‌లోని కొత్త పాత్రల్లో వేరే నటీనటులు ఉంటారు. జనవరి 9న బిగ్ ప్రీ విజన్ వీడియోను లాంచ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



మరో వివాదంలో రష్మికా మందన్నా!

'కాంతార' సినిమా విషయంలో కన్నడ ప్రేక్షకుల మనోభావాలు దెబ్బతినేలా కామెంట్స్ చేశారనే వివాదం నుంచి రష్మికా మందన్నా బయటపడి కొన్ని రోజులు గడవకముందే మరోమారు ఆమె పేరు చర్చల్లో నిలిచింది. సిద్ధార్థ్ మల్హోత్రా, రష్మికా మందన్నా జంటగా శాంతను భాగ్చీ దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం 'మిషన్ మజ్ను' జనవరి 20 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'రబ్బా జండా' అనే రొమాంటిక్ సాంగ్ లాంచ్ కార్యక్రమం ఇటీవల ముంబైలో జరిగింది. ఈ వేడుకలో రష్మిక చేసిన కామెంట్స్ నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ''రొమాంటిక్ సాంగ్స్ అంటే నాకు గుర్తొచ్చేది బాలీవుడ్ సాంగ్సే. దక్షిణాదిలో రొమాంటిక్ సాంగ్స్ అంటే డ్యాన్స్‌తో కూడిన మాస్ మసాలా పాటలు, ఐటమ్ నంబర్స్ ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇప్పుడు నేను 'మిషన్ మజ్ను'లో ఓ రొమాంటిక్ సాంగ్ చేశాను. ఆడియన్స్‌కు నచ్చుతుందనే అనుకుంటున్నాను'' అని రష్మికా మందన్నా మాట్లాడారు. రష్మిక చేసిన కామెంట్స్‌పై నెటిజన్లు విభిన్న రకాలుగా స్పందిస్తున్నారు. 'రష్మిక ఇలా మాట్లాడటం సరి కాదు. దక్షిణాది పరిశ్రమ ఆదరణ వల్లే రష్మిక కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంది. ఆమె తన మూలాలను మర్చిపోకూడదు' అని ఓ నెటిజన్ కామెంట్ చేయగా, 'సాధారణంగా రొమాంటిక్ సాంగ్స్ అంటే బాలీవుడ్ పాటలే. సౌత్‌లో ఐటమ్ సాంగ్స్, మాస్ మసాలా సాంగ్స్ ఉంటాయి. ఇది నిజం. ఆమె అలా మాట్లాడటం ఏ ఇండస్ట్రీని తక్కువ చేసి మాట్లాడినట్లు కాదు'' అని మరో నెటిజన్ కామెంట్ చేశారు.

ఆ సినిమాతో పోల్చడం సంతోషం

- నిర్మాత అల్లు అరవింద్



● నిఖిల్, అనుపమ, అల్లు అరవింద్, బన్నీ వాసు, సూర్యప్రతాప్

''ఫీల్ గుడ్ సినిమా ఆడదు.. ప్రేమ కథలు ఇంటికి (ఓటీటీ) వచ్చినప్పుడు చూద్దాంలే' అని ప్రేక్షకులు అనుకుంటున్న తరుణంలో 'సీతారామం' వచ్చి అదరగొట్టేసింది. ఆ సినిమా క్లయిమాక్స్‌కి ఉన్న ఫీలింగ్ మా '18 పేజెస్'కి వచ్చిందని చాలామంది పోల్చి చెబుతుంటే సంతోషంగా ఉంది. మా సినిమా చూస్తే ఒక నవలను చదివిన అనుభూతి కలిగేలా దర్శకుడు మలిచాడు'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. నిఖిల్ సిద్ధార్థ్, అనుపమా పరమేశ్వరన్ జంటగా సూర్య ప్రతాప్ పల్నాటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం '18 పేజెస్'. డైరెక్టర్ సుకుమార్ కథ అందించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో బన్నీ వాసు మాట్లాడుతూ – ''మా సినిమా మొదటిరోజు వసూళ్ల కంటే మూడో రోజు ఎక్కువ ఉన్నాయి. ఈ చిత్రం విషయంలో మేం లాభాల్లో ఉన్నాం'' అన్నారు. ''మా సినిమా చూసినవారు 'మాకు మేమే ప్రేమలో పడిన అనుభూతి వస్తోంది' అంటున్నారు. అది మాకు పెద్ద ప్రశంస'' అన్నారు సూర్యప్రతాప్. ''2022లో టాప్ ఫైవ్ లవ్ స్టోరీస్‌లో మా '18 పేజెస్' ఉంటుంది. కెరీర్ వైజ్‌గా నా జీవితంలో ఇది బెస్ట్ ఇయర్'' అన్నారు నిఖిల్. ''శతమానం భవతి'లో నేను చేసిన నిత్య పాత్రకి ఎంత మంచి పేరొచ్చిందో '18 పేజెస్'లో నందిని పాత్రకి కూడా అంతే పేరొచ్చింది'' అన్నారు అనుపమ.

ఆ ధైర్యం ఉంటేనే ఇండస్ట్రీకి రావాలి

- నిర్మాత శ్రీధర్ రెడ్డి



''ఏ సినిమాకైనా కథే హీరో. మనం ఏదైనా కథ విన్నప్పుడు అది మనల్ని వెంటాడాలి. శశికాంత్ చెప్పిన 'టాప్ గేర్' స్క్రిప్ట్ నాకు చాలా నచ్చింది. అన్ని వర్గాలవారికీ ఈ కథ నచ్చుతుందనే నమ్మకంతో ఈ సినిమా తీశాను'' అని నిర్మాత శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆది సాయికుమార్, రియా జంటగా కె. శశికాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'టాప్ గేర్'. ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో కేవీ శ్రీధర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ– ''టాప్ గేర్'కి హీరోగా ఆది అయితే బాగుంటుందనుకున్నాం. తనకి కథ చెప్పగానే ఓకే అన్నారు. అనుకోని సమస్యల్లో చిక్కుకునే ఓ క్యాబ్ డ్రైవర్ కథే ఈ చిత్రం. శశికాంత్ బాగా తీశాడు. స్క్రీన్‌ప్లే హైలైట్ అవుతుంది. ఆది మంచి డ్యాన్సర్.. మంచి నటుడు. మా 'టాప్ గేర్' తనకు 2023కి శుభారంభం అవుతుంది. సినిమా క్వాలిటీ కోసం ముందు అనుకున్న బడ్జెట్ కన్నా కాస్త పెరిగింది. ఇండస్ట్రీలో నా అనుభవం, నాకున్న పరిచయాలతో మా సినిమాని సేఫ్ ప్రాజెక్ట్‌గా నిలబెట్టాను. సినిమా ప్రారంభించడం, పూర్తి చేయడం, రిలీజ్ చేయడం.. ఇలా నిర్మాతలకు అన్నీ సవాలే. హిట్, ఫ్లాప్, లాభం, నష్టం.. వంటివి ఎదుర్కోగలను అనే ధైర్యం ఉంటేనే ఇండస్ట్రీకి రావాలి. నా తర్వాతి సినిమాల కోసం ఇద్దరు యువ హీరోలతో కథాచర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

ఆ మాట చాలనిపించింది

- సయ్యద్ సోహైల్



''ఇండస్ట్రీలో అందరిలానే మేం కూడా మంచి హిట్ సాధించాలనే 'లక్కీ లక్ష్మణ్' తీశాం. ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి. అయితే మా సినిమా ప్రివ్యూ చూసిన ఓ సీనియర్ నిర్మాత 'సోహైల్ నువ్వు సేఫ్' అన్నారు.. ఆ మాట చాలనిపించింది'' అని సయ్యద్ సోహైల్ అన్నారు. ఏఆర్ అభి దర్శకత్వంలో 'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్, మోక్ష జంటగా తెరకెక్కిన చిత్రం 'లక్కీ లక్ష్మణ్'. హరిత గోగినేని నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోహైల్ మాట్లాడుతూ – ''బిగ్‌బాస్' షో తర్వాత నేను కమిట్ అయిన తొలి చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్' ఇంకా రిలీజ్ కాకపోవడంతో డిప్రెషన్‌కి లోనయ్యాను. ఆ తర్వాత 'బూట్‌కట్ బాలరాజు', 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు', 'లక్కీ లక్ష్మణ్' సినిమాలు చేశాను. అయితే 'లక్కీ లక్ష్మణ్' ముందు విడుదలవుతోంది. ఫ్యామిలీతో సహా యూత్‌కు నచ్చే అందమైన ప్రేమకథ ఇది. మన లైఫ్‌లో కష్టంతో పాటు అదృష్టం కూడా కావాలి. నేను సినిమాల్లోకి వెళతానన్నప్పుడు మా కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఎవరూ నన్ను సపోర్ట్ చేయలేదు. కానీ, మా నాన్న సలీం మాత్రం నాపై నమ్మకంతో వెళ్లమన్నారు. హైదరాబాద్ వచ్చాక సీరియల్స్‌లో నటిస్తూ నెలకు 40 వేలు సంపాదించేవాణ్ణి. అందులో సగం ఇంటికి పంపేవాణ్ణి. ఆ తర్వాత 'బిగ్ బాస్' ఛాన్స్ వచ్చింది.. ఆ షో తర్వాత సినిమా చాన్స్‌లు వస్తున్నాయి.

అభిగారు 'లక్కీ లక్ష్మణ్'ని బాగా తీశారు. మా నిర్మాత హరిత గారు సినిమాపై నమ్మకంతో సొంతంగా రిలీజ్ చేస్తున్నారు. ఇక 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'లో హీరోగా నన్ను తీసుకోవద్దని కొందరు చెప్పినా నాకే అవకాశం ఇచ్చిన ఎస్వీ కృష్ణారెడ్డిగారి మేలు ఎప్పటికీ మరచిపోలేను. వ్యక్తిగతంగా 'సోహైల్ హెల్పింగ్ హ్యాండ్స్' పేరుతో నాతో పాటు 30 మంది స్నేహితులు కలిసి సాయం చేస్తున్నారు. ఇప్పటివరకు ఐదుగురికి గుండె ఆపరేషన్ చేయించాం. ఏడు కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నాం. 10 మంది పిల్లల విద్యకి సాయం చేస్తున్నాం. ఇప్పుడు నా చేతిలో నాలుగు సినిమాలున్నాయి'' అన్నారు.

ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే కొంత మంది నెగటివ్‌గా తీసుకుంటున్నారు. కొందరైతే సోషల్ మీడియాలో మా ఇంట్లోని వాళ్లను కూడా తిడుతున్నారు.. అందుకే నేను రియాక్ట్ అయ్యాను. అలా అవటం సమస్య అవుతోంది. 'నా సక్సెస్‌కు మా నాన్నే కారణం' అని ప్రీ రిలీజ్‌లో మాట్లాడిన పాజిటివ్ వార్తకి కేవలం 500 వ్యూస్ మాత్రమే వచ్చాయి. అదే 'ఇచ్చిపడేస్తా కొడకల్లారా' అని అన్న మాటకు లక్షా ఇరవై వేల వ్యూస్. 700 కామెంట్స్, షేర్స్ వచ్చాయి. నెగిటివ్‌ని అంతగా ఎందుకు చూస్తున్నారో నాకు అర్థం కావటం లేదు.


● సుహాస్

ఓ రచయిత కథ

పెద్ద పెద్ద లక్ష్యాలను చేరుకోవాలని తాపత్రయపడుతున్న ఓ రచయిత జీవితం ఏమైందో ఫిబ్రవరిలో ప్రేక్షకులకు తెలుస్తుంది. 'కలర్ ఫోటో' ఫేమ్ సుహాస్, టీనా శిల్పారాజ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. షణ్ముఖ ప్రశాంత్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ సినిమాను మనోహర్ గోవిందస్వామి సమర్పణలో అనురాగ్, శరత్, చంద్రు మనోహర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నట్లుగా గురువారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ''విజయవాడ నేపథ్యంలో సాగే ఓ స్ట్రగులింగ్ రైటర్ కథే ఈ చిత్రం. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: వెంకట్ ఆర్. శాకమూరి, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్: కల్యాణ్ నాయక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సూర్య చౌదరి, క్రియేటివ్ ప్రొడ్యూసర్స్: ఉదయ్–మనోజ్.

సాక్షి **బిజినెస్**
శుక్రవారం
30-12-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు			
సెన్సెక్స్ ▲	224	61,134	
నిఫ్టీ ▲	68	18,191	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,468	▲	255
డోజోన్స్	33,244	▲	365
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,513	▲	16
డాక్స్	14,072	▲	146
షాంఘై	3,074	▼	14
నికాయ్	26,093	▼	247

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత) 54,651	▲	80
బంగారం (99.5 స్వచ్ఛత) 54,432	▲	80
వెండి (కిలో) 67,840	▼	8

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.96	82.69
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.43	88.86
€	యూరో	ఎస్‌బీఐ	96.53	101.02
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.76	61.16
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.94	57.14
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.57	61.47
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.09	22.13
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.24	23.56
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.67	12.63

7.43 లక్షల ఈ-వాహనాలకు 'ఫేమ్'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంపొందించే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఫేమ్-2 పథకం కింద 2022లో 7.43 లక్షల ఈ-వెహికల్స్‌కు ప్రోత్సాహకాలు లభించాయి. వీటిలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు 6.63 లక్షల యూనిట్లు నమోదయ్యాయి. ఈ-త్రీ వీలర్లు 70,159 యూనిట్లు, ఈ-ఫోర్ వీలర్లు 5,375, ఈ-బస్‌లు 3,738 యూనిట్లు ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసిన కస్టమర్లకు ప్రోత్సాహకాల కింద ప్రభుత్వం రూ.3,305 కోట్లు ఖర్చు చేసింది.

తనిష్క్ 'కాక్‌టైల్ కలెక్షన్' ఆవిష్కరణ

హైదరాబాద్: టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని తనిష్క్ 'కలర్ మీ జాయ్-ద కార్నివాల్ ఎడిట్' శీర్షికన కాక్‌టైల్ కలెక్షన్‌ను విడుదల చేసింది. విభిన్నమైన, అరుదైన రంగు రాళ్ల స్ఫూర్తితో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఆభరణాల కలెక్షన్ ఇది. ఈ శ్రేణిలో కాక్‌టైల్ రింగ్స్, కఫ్ బ్యాంగిల్, పెండెంట్ సెట్స్, చెవి రింగులు వంటివి ఉన్నాయి. అద్భుతమైన ఆభరణాల రూపకల్పనతో తనిష్క్ మహిళలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూనే ఉంటుంది. విభిన్న భావోద్వేగాల సమాహారంలో లీనమవుతున్న వేళ మా తాజా కలెక్షన్ మిమ్మల్ని సంతోషపరుస్తుంది'' అని టైటాన్ కంపెనీ చీఫ్ డిజైనర్ రేవతీ కాంత్ తెలిపారు. అతిసున్నితమైన కాక్‌టైల్ కలెక్షన్ ఒక లక్ష రూపాయిల నుంచి ప్రారంభమవుతుంది. ఎంపిక చేసిన తనిష్క్ స్టోర్‌లు, కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయి.

కార్ల డిస్కౌంట్ల జాతర!

- 5 శాతం వరకూ ఆఫర్ చేస్తున్న సంస్థలు
- రెండేళ్ల క్రితంతో పోలిస్తే దాదాపు రెట్టింపు
- ఎంట్రీ లెవెల్ కార్లు, ఎస్‌యూవీ పెట్రోల్ వేరియంట్లపై అధికం



న్యూఢిల్లీ: సరఫరా వ్యవస్థలు మెరుగుపడి కార్ల ఉత్పత్తి పెరిగే కొద్దీ నాలుగేళ్లుగా పేరుకున్న డిమాండ్ క్రమంగా తగ్గుతోంది. దీనికి సంవత్సరాంతం కూడా తోడు కావడంతో కొన్ని విభాగాల్లో అమ్మకాలు పెంచుకునేందుకు కార్ల కంపెనీలు భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తున్నాయి. చాలా మటుకు సంస్థలు డిసెంబర్‌లో 4.5 శాతం నుంచి 5 శాతం వరకూ డిస్కౌంట్స్ ఆఫర్ చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం ప్రకటించిన 2 - 2.5 శాతంతో పోలిస్తే ఇది రెట్టింపు కావడం గమనార్హం. డీలర్లు రూ. 25,000 నుంచి రూ. 1,00,000 దాకా విలువ చేసే ప్రయోజనాలు అందిస్తామంటూ కొనుగోలుదార్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువగా ఎంట్రీ-లెవెల్ కార్ల సెగ్మెంట్లోనూ, స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలకు సంబంధించి పెట్రోల్ సెగ్మెంట్లోనూ ఇలాంటి డిస్కౌంట్లు లభిస్తున్నాయి. నగదు డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ బోనస్ ప్రయోజనాలు, బీమా కంపెనీలు ఓన్ డ్యామేజీ ప్రీమియంను తగ్గించడం, డీలర్లు నిర్వహించే స్కీములు మొదలైన వాటి రూపాల్లో ఇవి ఉంటున్నాయి. మారుతీ సుజుకీ ఇండియా 2018-19 స్థాయిలోనే రూ. 17,000 - రూ. 18,000 వరకూ డిస్కౌంట్లు ఆఫర్ చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సీఎన్‌జీకి, సాంప్రదాయ ఇంధనాల రేట్లకు మధ్య వ్యత్యాసం తగ్గిపోతుండటంతో సీఎన్‌జీ మోడల్స్ వైపు కొనుగోలుదారులు దృష్టి పెట్టడం తగ్గుతోంది. దీంతో సీఎన్‌జీ మోడల్స్‌ను విక్రయించేందుకు కంపెనీలు అత్యధికంగా రూ. 60,000 వరకూ డిస్కౌంట్లు ఇస్తున్నాయి. డిసెంబర్‌లో రిటైల్ విక్రయాలు పటిష్ఠంగా ఉన్నాయని, నవంబర్‌తో పోలిస్తే 20 శాతం ఎక్కువగా విక్రయాలు ఉండొచ్చని భావిస్తున్నామని హ్యుందాయ్ మోటార్ ఇండియా వర్గాలు తెలిపాయి.

పెరుగుతున్న నిల్వలతో ఒత్తిడి..

డీలర్ల దగ్గర నిల్వలు మళ్లీ కోవిడ్ పూర్వ స్థాయికి చేరినట్లు ఎస్అండ్‌పీ మొబిలిటీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 45-50 రోజుల వరకు సరిపడా నిల్వలు ఉంటున్నాయని పేర్కొన్నాయి. దీంతో డిస్కౌంట్లు ఇచ్చి అయినా వాహనాలను అమ్మేసేందుకు డీలర్లు మొగ్గుచూపుతున్నారని తెలిపాయి. వడ్డీ రేట్లు పెరుగుతుండటం కూడా సమస్యాత్మకంగా మారుతోంది. అటు ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్ క్రమంగా తగ్గుముఖం పడుతోంది. టాటా మోటార్ ఈ-నెక్సాన్‌కి ఇటీవలి వరకూ కొద్ది నెలల పాటు వెయిటింగ్ పీరియడ్ ఉండేది. కానీ ప్రస్తుతం డీలర్‌షిప్‌లో బుక్ చేసుకుని అప్పటికప్పుడే కారుతో బైటికి వచ్చే పరిస్థితి ఉంటోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

భవిష్యత్‌పై ఆచి తూచి..

ప్రస్తుతం దాదాపు 4,17,000 వాహనాల ఆర్డర్లతో కార్ల కంపెనీల ఆర్డర్ బుక్ పటిష్ఠంగా ఉంది. దీంతో కొంత ఎక్కువగా డిస్కౌంట్లు ఇచ్చేందుకు కంపెనీలు వెనుకాడటం లేదు. అయితే, భవిష్యత్‌లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొంత అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, మార్కెట్ సెంటిమెంట్ మొదలైన వాటిని బట్టి డిమాండ్ పరిస్థితి ఉంటుందని హ్యుందాయ్ మోటార్ ఇండియా వర్గాలు తెలిపాయి. 2018-19కి భిన్నంగా ప్రస్తుతం సంవత్సరాంతపు డిస్కౌంట్లు కొన్ని సెగ్మెంట్లకు మాత్రమే పరిమితంగా ఉంటున్నాయని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.

సంపన్నులకు కలిసిరాని ఏడాది

- 2022లో బిలియనీర్ క్లబ్ నుంచి 22 మంది అవుట్
- గౌతమ్ అదానీ సంపదలో భారీ వృద్ధి
- ముకేశ్ సంపదలో 2 శాతం క్షీణత
- టాప్-10లో ఏడుగురి నెట్‌వర్త్‌కు చిల్లు



న్యూఢిల్లీ: ఐశ్వర్యవంతులకు ఈ ఏడాది అచ్చిరాలేదు. మార్కెట్ల పతనంతో బిలియనీర్ల స్థానాలు చెల్లాచెదురయ్యాయి. బడా బిలియనీర్లు మరింత బలపడితే.. బిలియనీర్ క్లబ్ (కనీసం బిలియన్ డాలర్లు అంతకుమించి సంపద ఉన్నవారు)లో దిగువన ఉన్నవారు ఏకంగా ఆ హోదానే కోల్పోవాల్సి వచ్చింది. ఒక్క అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీకి 2022ను జాక్‌పాట్ సంవత్సరంగా చెప్పుకోవాలి. ఎందుకంటే దేశ కుబేరుడిగా ఉన్న ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి, దేశంలోనే అత్యంత ఐశ్వర్యమంతుడిగా మొదటి స్థానానికి చేరుకోవడమే కాదు.. ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానానికి ఎగబాకారు. 2021 చివరికి అదానీ నెట్‌వర్త్ (సంపద విలువ) 80 బిలియన్ డాలర్లు ఉండగా, ఏడాది తిరిగేసరికి 70 శాతం పెరిగి 135.7 బిలియన్ డాలర్లకు చేరింది. బ్లూంబర్గ్ గణాంకాల ప్రకారం ఆసియాలోనూ అదానీయే నంబర్ 1గా ఉన్నారు. డాలర్ మారకంలో బిలియనీర్ ప్రమోటర్ల సంఖ్య ఈ ఏడాది 120కి తగ్గింది. 2021 చివరికి వీరి సంఖ్య 142గా ఉంది. అయితే 24 మంది ప్రమోటర్లు బిలియనీర్ క్లబ్‌లో స్థానం కోల్పోగా.. కొత్తగా ఐఐఎఫ్ఎల్ ప్రమోటర్లు ఇద్దరు ఉమ్మడిగా, క్యాప్రిగ్లోబల్ ప్రమోటర్ ఇందులోకి వచ్చి చేరారు. బిలియనీర్ల ఉమ్మడి సంపద సైతం ఈ ఏడాది కొంత కరిగిపోయింది. 8.8 శాతం క్షీణించి 685 బిలియన్ డాలర్లకు (రూ.56.62 లక్షల కోట్లు) పరిమితమైంది. 2021 చివరికి వీరి ఉమ్మడి సంపద విలువ 751.6 బిలియన్ డాలర్లుగా ఉండడాన్ని గమనించొచ్చు. దేశంలోని టాప్-10 సంపన్న పారిశ్రామికవేత్తల్లో ఈ ఏడాది గౌతమ్ అదానీతోపాటు, సన్ ఫార్మా దిలీప్ సంఘ్వి, భారతీ ఎయిర్‌టెల్ సునీల్ భారతీ మిట్టల్ మినహా మిగిలిన ఏడుగురి సంపద విలువ క్షీణించింది.

ముకేశ్ సంపద 102 బిలియన్ డాలర్లు

రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ స్థానచలనం పొందారు. 2021 చివరికి జాబితాలో మొదటి స్థానంలో ఉండగా, దీన్ని గౌతమ్ అదానీకి కోల్పోయి రెండో స్థానంలోకి వచ్చారు. ముకేశ్ అంబానీ కుటుంబ సంపద విలువ 2.5 శాతం క్షీణించి గతేడాది చివరికి ఉన్న 104.4 బిలియన్ డాలర్ల నుంచి 101.75 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ద్రవ్యోల్బణం పెరుగుదల, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు ప్రభావాలతో ఈ ఏడాది ఈక్విటీ మార్కెట్లు బలహీన పనితీరు చూపించడం, బిలియనీర్ల సంపద తగ్గడానికి గల కారణాల్లో ప్రధానమైనది. టెలికం రంగంలో చిన్నాచితకా కంపెనీలన్నీ మూతపడిపోవడం, చివరికి వొడాఫోన్ ఐడియా సైతం బక్కచిక్కడం, టారిఫ్‌లను గణనీయంగా పెంచడంతో ఎయిర్‌టెల్ అధినేత సునీల్ మిట్టల్ సంపద వృద్ధి చెందింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
30-12-2022	
విశాఖ	547-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	528-00
విజయవాడ	528-00
రిటైల్ ధర (డజను)	78.00
29-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	528-00
వరంగల్	530-00
రిటైల్ ధర	5.90

హైదరాబాద్ కంపెనీలో రిలయన్స్‌కు వాటా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: చాకొలేట్స్ తయారీలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన లోటస్ చాకొలేట్ కంపెనీలో రిలయన్స్ కంజ్యూమర్ ప్రాడక్ట్స్ 51 శాతం వాటా తీసుకోనుంది. అలాగే మరో 26 శాతం వరకు వాటా కోసం ఓపెన్ ఆఫర్ ప్రకటించనున్నట్టు రిలయన్స్ గురువారం వెల్లడించింది. లోటస్ ప్రమోటర్లు ప్రకాశ్ పి పాయ్, అనంత్ పి పాయ్, ఇతరులతో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. 51 శాతం వాటాకు సమానమైన 65,48,935 షేర్లను ఒక్కొక్కటి రూ.113 చొప్పున మొత్తం రూ.74 కోట్లు చెల్లించి దక్కించుకోనున్నట్టు రిలయన్స్ ప్రకటించింది. రిలయన్స్ కంజ్యూమర్ ప్రాడక్ట్స్, లోటస్ ప్రమోటర్ గ్రూప్ సంస్థలు రూ.10 ముఖ విలువ కలిగిన 5,07,93,200 నాన్ క్యుములేటివ్ రెడీమేబుల్ ప్రిఫరెన్స్ షేర్లను సబ్‌స్క్రైబ్ చేసుకుంటాయి. వీటి ద్వారా వచ్చే నిధులను కంపెనీ వృద్ధికి వినియోగించనున్నారు. ప్రముఖ సినీ నటి టి.శారద, ఇంజనీర్ ఎస్.విజయరాఘవన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సమీపంలోని దౌలతాబాద్ వద్ద కోకో ప్రాసెసింగ్, చాకొలేట్ తయారీ కేంద్రం 1992లో ప్రారంభం అయింది. ఈ కంపెనీ 2008లో పఞ్జాలానా గ్రూప్ పరమైంది.

చివరి గంటలో లాభాలు

- మార్కెట్ మూడోరోజూ ముందుకే
- మళ్లీ 61 వేల పైకి సెన్సెక్స్
- 18 వేల ఎగువకు నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడోరోజూ లాభాలను గడించాయి. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల మధ్య ఉదయం ఊగిసలాటతో ప్రారంభమైన సూచీలు రోజంతా అదే ధోరణి కొనసాగించాయి. అయితే చివరి గంటలో టెలికం, బ్యాంకింగ్, మెటల్ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల గడువు గురువారం ముగిస్తుండటంతో ట్రేడర్లు తమ పొజిషన్లను షార్ట్ కవరింగ్ చేసుకున్నారు. చైనాలో కరోనా కేసుల కారణంగా క్రూడాయిల్ డిమాండ్ తగ్గే అవకాశం ఉందనే అంచనాలతో ధరలు క్షీణించడం మార్కెట్‌కు కలిసొచ్చింది. ఇంట్రాడేలో 732 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 224 పాయింట్లు లాభపడి 61,134 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఇంట్రాడేలో 237 పాయింట్ల శ్రేణిలో ట్రేడైంది. మార్కెట్ ముగిసేసరికి 68 పాయింట్లు పెరిగి 18,191 వద్ద నిలిచింది. ఎఫ్ఎంసీజీ షేర్లు మాత్రమే నష్టాల్లో ట్రేడయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.516 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.573 కోట్లను విక్రయించాయి. చైనా బీజింగ్‌లో జీరో కోవిడ్ పాలసీ ఎత్తివేతతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా కదలాడుతున్నాయి.



కేఫిన్ టెక్నాలజీస్ లిస్టింగ్ అంతంతే

ఆర్థిక సేవల ప్లాట్‌ఫాం కెఫిన్ టెక్నాలజీస్ లిస్టింగ్ మెప్పించలేకపోయింది. ఇష్యూ ధర(రూ.366)తో పోలిస్తే ఒకశాతం ప్రీమియంతో రూ.369 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో రూ.372 వద్ద గరిష్టాన్ని, రూ.351 కనిష్టాన్ని తాకింది. చివరికి అరశాతం నష్టంతో రూ.364 వద్ద స్థిరపడింది.

సాక్షి **స్పోర్ట్స్**



సౌత్‌జోన్ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం తెలంగాణకు మూడు స్వర్ణ పతకాలు, ఒక రజతం, ఒక కాంస్య పతకం లభించాయి. తిరువనంతపురంలో జరుగుతున్న ఈ టోర్నీలో గ్రూప్-1 బాలికల 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్‌లో మిట్టపల్లి రిత్విక 35.91 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకం

రిత్విక, ఆదిత్యలకు స్వర్ణాలు

సాధించింది. గ్రూప్-3 బాలికల 50 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో అనిక బంగారు పతకం గెలిచింది. బాలికల 100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన మేఘన నాయర్ కాంస్య పతకాన్ని సాధించింది. ఈ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి కె.లాస్యశ్రీ 1ని:08.29 సెకన్లలో గమ్యానికి చేరి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. గ్రూప్-3 బాలుర 50 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో తెలంగాణ కుర్రాడు ఆదిత్య స్వర్ణం సంపాదించగా... 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో వర్షిత్ రజతం గెలిచాడు.



'ఐసీసీ టి20 క్రికెటర్' రేసులో సూర్యకుమార్, స్మృతి

ఈ ఏడాది నిలకడగా రాణించిన భారత బ్యాటర్లు



దుబాయ్: ఈ ఏడాది టి20ల్లో ఇచ్చే 'ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో సూర్యకుమార్ యాదవ్, స్మృతి మంధాన ఉన్నారు. పురుషుల కేటగిరీలో భారత డాషింగ్ బ్యాటర్‌తోపాటు స్యామ్ కరన్ (ఇంగ్లండ్), మొహమ్మద్ రిజ్వాన్ (పాకిస్తాన్), సికందర్ రజా (జింబాబ్వే) నామినేట్ అయ్యారు. ఈ సీజన్‌లో ప్రత్యేకించి పొట్టి ఫార్మాట్‌లో సూర్యకుమార్ సంచలన బ్యాటర్‌గా ఎదిగాడు. టోర్నీల్లో నిలకడైన ప్రదర్శనతో రాణించాడు. ఈ క్యాలెండర్ ఇయర్‌లో 1000 పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా ఘనత వహించాడు. అంతేకాదు... మొత్తం 1164 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గానూ అతను రికార్డులకెక్కాడు. 68 సిక్సర్లు బాదిన సూర్య, 187.43 స్ట్రయిక్ రేట్ నమోదు చేశాడు. సిక్స్‌ల పరంగా తనే అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ ఏడాది రెండు మెరుపు సెంచరీలు కొట్టిన సూర్య ఖాతాలో మరో తొమ్మిది అర్ధసెంచరీలు కూడా ఉన్నాయి. ముంబైకి చెందిన సూర్య ఆస్ట్రేలియా ఆతిథ్యమిచ్చిన టి20 ప్రపంచకప్‌లోనూ మెరిశాడు. ఆరు ఇన్నింగ్స్‌ల్లో 60 పరుగుల సగటుతో మూడు ఫిఫ్టీలు బాదాడు. 189.68 స్ట్రయిక్‌రేట్ నమోదు చేశాడు. అసాధారణ ప్రదర్శనతో కెరీర్ బెస్ట్ టాప్ ర్యాంక్‌కు చేరుకోవడమే కాదు... 890 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్ట పరుచుకున్నాడు. రెండో ర్యాంకులో ఉన్న రిజ్వాన్ (836) అతని దరిదాపుల్లో కూడా లేడు. 'ఐసీసీ పురుషుల వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' రేసులో మాత్రం ఒక్క భారత ప్లేయర్ లేడు. పాకిస్తాన్ ఓపెనర్ బాబర్ ఆజమ్, ఆడమ్ జంపా (ఆస్ట్రేలియా), సికందర్ రజా (జింబాబ్వే), షై హోప్ (వెస్టిండీస్) నామినేట్ అయ్యారు. 2009లో శివనారాయణ్ చందర్‌పాల్ తర్వాత షై హోప్ రూపంలో వన్డే క్రికెటర్ అవార్డు కోసం విండీస్ ప్లేయర్ నామినేట్ కావడం గమనార్హం. 'ఐసీసీ మహిళల వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' రేసులో షబ్నిమ్ ఇస్మాయిల్ (దక్షిణాఫ్రికా), అమెలియా కెర్ (న్యూజిలాండ్), నాట్ సివెర్ (ఇంగ్లండ్), అలీసా హీలీ (ఆస్ట్రేలియా) ఉన్నారు. త్వరలోనే విజేతల వివరాలను ఐసీసీ ప్రకటించనుంది.



వరుసగా రెండో ఏడాది...

మహిళల విభాగంలో గతేడాది 'టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు నామినేట్ అయిన భారత ఓపెనర్ స్మృతి మంధాన ఈ ఏడాదీ రేసులో నిలిచింది. తాజా 2022 తుది జాబితాలో నిదా దార్ (పాకిస్తాన్), సోఫీ డివైన్ (న్యూజిలాండ్), తాహ్లియా మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా)లతో స్మృతి పోటీ పడుతుంది. ఈ ఏడాది స్మృతి 23 బంతుల్లో ఫిఫ్టీ సాధించడంతో వేగవంతమైన అర్ధసెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా ఘనత వహించింది. ఈ సీజన్‌లోనూ తన జోరును కొనసాగించిన ఆమె ఈ ఫార్మాట్ కెరీర్‌లో 2500 పరుగుల్ని పూర్తి చేసుకుంది. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్, టి20 ఆసియా కప్ ఈవెంట్‌లలోనూ మెరుపులు మెరిపించింది. ఇటీవల ఆస్ట్రేలియా అమ్మాయిలతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో సూపర్ ఓవర్ విజయాన్ని అందించింది. ముందుగా 188 పరుగుల లక్ష్యఛేదనలో మంధాన (49 బంతుల్లో 79) మెరుపు ఆరంభం వల్లే ఆసీస్ 187 స్కోరును భారత్ సమం చేయగలిగింది. సూపర్ ఓవర్లోనూ కీలకమైన 13 (4, 6, 3) పరుగుల వల్లే భారత్ 20/1 స్కోరు చేసింది. తర్వాత ఆసీస్ 16/1 స్కోరుకే పరిమితమైంది.

ఆరో స్థానంలో హారిక

అల్మాటీ (కజకిస్తాన్): ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తొమ్మిదో రౌండ్ ముగిశాక 6.5 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. నేడు మరో ఎనిమిది రౌండ్‌లు జరుగుతాయి. భారత్‌కే చెందిన తానియా సచ్‌దేవ్ 6 పాయింట్లతో 10వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ 6 పాయింట్లతో 19వ ర్యాంక్‌లో, కోనేరు హంపి 5 పాయింట్లతో 44వ ర్యాంక్‌లో, సవితా శ్రీ 4 పాయింట్లతో 69వ ర్యాంక్‌లో ఉన్నారు. ఓపెన్ విభాగంలో 12 రౌండ్‌ల తర్వాత భారత ప్లేయర్ రౌనక్ సాధ్వాని 8.5 పాయింట్లో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. నిహాల్ సరీన్ 8 పాయింట్లతో 19వ ర్యాంక్‌లో, పెంటేల హరికృష్ణ 8 పాయింట్లతో 21వ ర్యాంక్‌లో, ఇరిగేశి అర్జున్ 7.5 పాయింట్లతో 35వ ర్యాంక్‌లో ఉన్నారు. పాయింట్లు సమంగా ఉంటే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌ను వర్గీకరిస్తారు. నేడు మరో తొమ్మిదో రౌండ్‌లు జరుగుతాయి.



16 ఏళ్ల నిరీక్షణకు తెర

- స్వదేశంలో దక్షిణాఫ్రికాపై సిరీస్ నెగ్గిన ఆస్ట్రేలియా
- రెండో టెస్టులో ఇన్నింగ్స్ 182 పరుగులతో ఘనవిజయం




వార్నర్

మెల్‌బోర్న్: సంప్రదాయ ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా మళ్లీ గర్జిస్తోంది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో నాలుగో రోజే కంగారూ జట్టు ఇన్నింగ్స్ 182 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. ఇంకో మ్యాచ్ ఉండగానే 2-0తో సిరీస్‌ను దక్కించుకుంది. ఈ క్రమంలో 16 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వదేశంలో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా సిరీస్ సొంతం చేసుకుంది. సొంతగడ్డపై 2005-06లో దక్షిణాఫ్రికాను కంగుతినిపించిన ఆస్ట్రేలియా... 2008-09, 2012-13, 2016-17లలో ఆ జట్టు చేతిలో మూడుసార్లు ఓడింది.

ఓవర్‌నైట్ స్కోరు 15/1తో గురువారం ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 68.5 ఓవర్లలో 204 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు ఇర్వి (21), బ్రూయిన్ (28)లను పేసర్లు స్టార్క్, బొలాండ్ పెవిలియన్ చేర్చారు. కయా జొండో (1) రనౌటయ్యాడు. దీంతో దక్షిణాఫ్రికా 65 పరుగులకే 4 కీలక వికెట్లను కోల్పోయింది. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన బవుమా (144 బంతుల్లో 65; 6 ఫోర్లు)... కైల్ వెరీన్ (33; 5 ఫోర్లు)తో కలిసి ఐదో వికెట్‌కు 63 పరుగులు జోడించాడు. అయితే స్పిన్నర్ లయన్ వరుస విరామాల్లో వికెట్లను పడగొట్టి దక్షిణాఫ్రికాను కష్టాల్లో నెట్టాడు. బవుమా అర్ధసెంచరీ పూర్తిచేసుకోగా, వెరీన్ అవుటయ్యాక తర్వాత ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. సీమర్లలో బొలాండ్ రెండు... స్టార్క్, కమిన్స్, స్మిత్ తలా ఒక వికెట్ తీశారు. తన కెరీర్‌లో 100వ టెస్టు ఆడి 'డబుల్ సెంచరీ' సాధించిన డేవిడ్ వార్నర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. సిరీస్‌లో చివరిదైన మూడో టెస్టు వచ్చే నెల 4 నుంచి సిడ్నీలో జరుగుతుంది.

విలియమ్సన్ డబుల్ సెంచరీ

- కివీస్‌కు 174 పరుగుల ఆధిక్యం
- పాకిస్తాన్‌తో తొలి టెస్టు



కరాచీ: పాకిస్తాన్‌తో జరుగుతున్న మొదటి టెస్టులో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (200 నాటౌట్; 21 ఫోర్లు, 1 సిక్స్) అజేయ డబుల్ సెంచరీతో కదంతొక్కాడు. దీంతో పర్యాటక జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగుల ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 440/6తో గురువారం నాలుగో రోజు ఆట కొనసాగించిన కివీస్ తొలి ఇన్నింగ్స్‌ను 194.5 ఓవర్లలో 612/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు విలియమ్సన్, ఇష్ సోధి (65; 11 ఫోర్లు) ఏడో వికెట్‌కు 159 పరుగులు జోడించారు. ఈ క్రమంలో ఇష్ అర్ధసెంచరీ సాధించాడు. తర్వాత 595 స్కోరు వద్ద ఇష్ సోధి నిష్క్రమించడంతో రెండు పరుగుల వ్యవధిలో సౌతీ (0), వాగ్నెర్ (0) వికెట్లను కోల్పోయింది. ఎజాజ్ పటేల్ (0 నాటౌట్) అండతో విలియమ్సన్ డబుల్ సెంచరీ పూర్తి చేసుకోగానే కివీస్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అబ్రార్ అహ్మద్‌కు 5 వికెట్లు దక్కాయి. తర్వాత రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టిన పాకిస్తాన్ ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. అబ్దుల్లా షఫీక్ (17), షాన్ మసూద్ (10) నిష్క్రమించగా... ఇమామ్ (45 బ్యాటింగ్), నౌమన్ అలీ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. నేడు ఆటకు ఆఖరు రోజు కాగా... పాకిస్తాన్ ఇంకా 97 పరుగుల వెనుకంజలో ఉంది. కివీస్ బౌలర్లు చకచకా వికెట్లు తీయగలిగితే మ్యాచ్ చేతిలోకి వస్తుంది.

5 విలియమ్సన్ కెరీర్‌లో ఇది ఐదో డబుల్ సెంచరీ. న్యూజిలాండ్ తరఫున అత్యధిక డబుల్ సెంచరీలు చేసిన ప్లేయర్‌గా బ్రెండన్ మెకల్లమ్ (4) పేరిట ఉన్న రికార్డును విలియమ్సన్ బద్దలు కొట్టాడు.

ఆంధ్ర లక్ష్యం 240 ప్రస్తుతం 100/4

సాక్షి, విజయనగరం: ఈ ఏడాది రంజీ ట్రోఫీ టోర్నీలో వరుసగా రెండో విజయం సాధించడానికి ఆంధ్ర జట్టు 140 పరుగుల దూరంలో నిలిచింది. గ్రూప్ 'బి'లో భాగంగా మహారాష్ట్ర జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో 240 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు నష్టపోయి 100 పరుగులు సాధించింది. చివరిరోజు ఆంధ్ర గెలవాలంటే మరో 140 పరుగులు చేయాలి. చేతిలో ఆరు వికెట్లు ఉన్నాయి. ప్రస్తుతం కెప్టెన్ హనుమ విహారి (36 బ్యాటింగ్; 3 ఫోర్లు), కరణ్ షిండే (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు షేక్ రషీద్ (2), అభిషేక్ రెడ్డి (7)లతో పాటు రికీ భుయ్ (16), కోన శ్రీకర్ భరత్ (31; 5 ఫోర్లు) అవుటయ్యారు. మహారాష్ట్ర బౌలర్లలో పాల్కర్ 2, మనోజ్, ప్రదీక్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 89/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మహారాష్ట్ర 250 పరుగుల వద్ద ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి మూడు వికెట్లు పడగొట్టగా... కార్తీక్ రామన్, కేవీ శశికాంత్, మాధవ్ రాయుడు తలా 2 వికెట్లు తీశారు.

హైదరాబాద్ ఘనవిజయం



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తమ ఖాతాలో తొమ్మిదో విజయం జమ చేసుకుంది. గచ్చిబౌలి స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 6-1 గోల్స్ తేడాతో నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టును చిత్తుగా ఓడించింది. ఈ లీగ్‌లో హైదరాబాద్‌కిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. హైదరాబాద్ తరఫున సివెరియో (8వ, 73వ ని.లో) రెండు గోల్స్ చేయగా... బోర్జా హెరెరా (24వ ని.లో), ఒడెయ్ ఒనైన్‌డియా (30వ ని.లో), జోయల్ చియానీజ్ (77వ ని.లో), గౌరవ్ బోరా (80వ ని.లో; సెల్ఫ్ గోల్) ఒక్కో గోల్ అందించారు. నార్త్ ఈస్ట్ తరఫున ఇవాన్స్ (36వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్ 28 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

- అఫిలియేషన్ ఫీజుకు కూడా..

సాక్షి, అమరావతి: ఇంటర్ పబ్లిక్ పరీక్ష ఫీజు (రూ.500 ఆలస్య రుసుముతో), కాలేజీలు అఫిలియేషన్ ఫీజుల చెల్లింపునకు గడువు పొడిగించినట్లు ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేష గిరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సీఎఫ్ఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ సమాచారం ప్రకారం అప్లికేషన్, డేటాబేస్ సర్వీస్ మైగ్రేషన్ చేస్తున్నందున పరీక్ష, కాలేజీల గుర్తింపు ఫీజులు చెల్లించేందుకు డీపీసీ, ఇతర ఆన్‌లైన్ సేవలు శుక్రవారం సాయంత్రం నుంచి జనవరి 2వ తేదీ ఉదయం వరకు పనిచేయబోవని పేర్కొన్నారు. అందువల్ల రూ.500 ఆలస్య రుసుముతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరి తేదీని జనవరి 2 నుంచి 4 వరకు పొడిగించినట్లు తెలిపారు. అలాగే 2022–23 విద్యా సంవత్సరానికి అఫిలియేషన్ ఫీజు చెల్లింపు గడువు తేదీని డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు పొడిగించినట్లు వివరించారు.

8న గ్రూప్‌-1 స్క్రీనింగ్ టెస్ట్

- 31 నుంచి ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్‌–1 పోస్టుల నియామకానికి సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్‌ను జనవరి 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆబ్జెక్టివ్ విధానంలో ఈ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఎనిమిదో తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్‌–1, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పేపర్‌–2 పరీక్షలు ఉంటాయని, రాష్ట్రంలోని 18 జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని వివరించారు. హాల్‌టికెట్లు ఈ నెల 31 నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో (https://psc.ap.gov.in) అందుబాటులో ఉంటాయని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాల జాబితా కూడా వెబ్‌సైట్‌లో ఉంటుందని తెలిపారు. హాల్‌టికెట్‌లను ముందుగా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రం, ఇతర మార్గదర్శకాలు, సూచనలను తెలుసుకోవాలని పేర్కొన్నారు.

శ్మశాన వాటికలకు భూమి కేటాయింపు అభినందనీయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీలకు చెందిన శ్మశాన వాటికలకు భూమి కేటాయించాలని ఆదేశించిన సీఎం వైఎస్ జగన్‌కి ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ ధన్యవాదాలు తెలుపుతూ గురువారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కులాల వారికి శ్మశాన వాటిక సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి అవసరమైన భూమిని కేటాయించేలా సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.


రన్‌వే మీదుగా వెళ్తున్న విమానాలు

‘హై’..రన్ వే!

బాపట్ల జిల్లా కొరిశపాడు సమీపంలోని హైవేపై విమానాల తొలి ట్రయల్ రన్ సక్సెస్


బాపట్ల జిల్లా పిచ్చుకలగుడిపాడు-రేణంగివరం మధ్య హైవేపై నిర్మించిన ఎయిర్ స్ట్రిప్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని జాతీయ రహదారిపై గురువారం చేపట్టిన విమానాల తొలి ట్రయల్ రన్ విజయవంతమైంది. పిచ్చుకలగుడిపాడు-రేణింగవరం గ్రామాల వద్ద 16వ నంబర్ హైవేపై 4.1 కిలోమీటర్ల పొడవు, 33 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేసిన రన్‌వే మీదుగా విమానాలు గాల్లోకి దూసుకువెళ్లాయి. నాలుగు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్టులు, ఒక కార్గో విమానం ఐదు అడుగుల ఎత్తులో తిరుగుతుండగా.. రాడార్ సిగ్నల్స్‌తో పాటు రన్‌వే ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు అనువుగా ఉందా.. లేదా.. అనే విషయాన్ని వైమానిక దళ అధికారులు పరిశీలించారు. సదరన్ ఎయిర్ కమాండ్ నుంచి ఎప్పటికప్పుడు సూచనలందుకుంటూ ఈ ట్రయల్ రన్‌ను నిర్వహించారు. ఈ దృశ్యాలను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో రన్‌వే వద్దకు చేరుకున్నారు. విమానాల విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. ఉదయం 10.51 గంటలకు ప్రారంభమైన ట్రయల్ రన్ ప్రక్రియ 45 నిమిషాలపాటు జరిగింది.

దేశంలోనే మూడవది..

వైమానిక దళ అధికారి ఆర్ఎస్ చౌదరి మాట్లాడుతూ.. ట్రయల్ రన్‌లో ఎలాంటి సమస్య ఎదురుకాలేదని చెప్పారు. రన్‌వేకు ఇరువైపులా ఫెన్సింగ్, గేట్లు పెట్టిన తర్వాత విమానాల ల్యాండింగ్‌కు ఏర్పాట్లు చేస్తామన్నారు. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై బాపట్ల-నెల్లూరు జిల్లాల మధ్యలో రెండు ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొరిశపాడు మండలంలోని ఈ రన్‌వే.. దక్షిణ భారతదేశంలోనే మొదటిదని.. దేశంలోనే మూడవదని చెప్పారు. వచ్చే ఏడాది దీనిని ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఉత్తరప్రదేశ్, రాజస్తాన్‌లో ఇప్పటికే రెండు ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఏపీ, యూపీ, రాజస్తాన్‌తో పాటు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఒడిశా, జమ్మూ కశ్మీర్‌లలో కూడా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ.. ట్రయల్ రన్‌లో ఎలాంటి లోపాలు కనిపించలేదని తెలిపారు. కార్యక్రమంలో వాయుసేన అధికారి వి.ఎం.రెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ కె.ఎస్.దినేశ్‌కుమార్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, వాయుసేన అధికారులు పాల్గొన్నారు.

పెళ్లి నాటి ప్రమాణం.. అవయవదానం


వివాహ వేదికలో అవయవదానం హామీ పత్రాలు స్వీకరిస్తున్న గూడూరు సీతామహలక్ష్మి

- వధూవరులతోపాటు ముందుకొచ్చిన 66మంది దాతలు
- నిడదవోలులో అరుదైన సంఘటన

నిడదవోలు: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో గురువారం జరిగిన ఓ వివాహ వేడుక అవయవదాన హామీ పత్రాల సమర్పణకు వేదికగా మారింది. వధూవరులు సజీవరాణి, సతీష్‌కుమార్‌తోపాటు 66 మంది తమ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. విశాఖలోని అఖిల భారత అవయవ, శరీరదాతల సంఘం, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అవయవదాన ఆవశ్యకతను తెలియజేస్తూ వివాహ వేదిక వద్ద ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేశారు. ట్రస్ట్ ప్రతినిధుల సూచనల మేరకు వధూవరులు, వారి బంధుమిత్రులు 66 మంది అవయవదానం చేస్తామని హామీ పత్రాలపై సంతకాలు చేసి ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహలక్ష్మికి అందజేశారు. ఈ పత్రాలను ప్రభుత్వ సంస్థ జీవన్‌దాన్‌కు అందిస్తామని సీతామహలక్ష్మి తెలిపారు. తాము ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 42 వేల మంది నుంచి అవయవదాన హామీ పత్రాలను స్వీకరించామని చెప్పారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ విద్యార్థుల బోధన అవసరాల కోసం 2007లో 35 మృతదేహాలను అప్పగించిన తర్వాత అవయవదాన హామీ పత్రాల ఉద్యమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఇప్పటివరకు 35 మెడికల్ కళాశాలలకు 400 భౌతికదేహాలను అందజేశామన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన ఒక వ్యక్తి ద్వారా 18 మందిని బతికించవచ్చని వివరించారు. అవయవదానం చేసిన వ్యక్తుల కుటుంబ సభ్యులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబంలో ఒకరికి క్లాస్–4 ఉద్యోగం కల్పించినా మరింత మంది అవయవదానం చేయడానికి ముందుకు వస్తారన్నారు.

జల పర్యాటకం, రవాణాకు పెద్దపీట

- రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ
- చిన్న బోట్ల నుంచి క్రూయిజ్‌లను నడిపేలా నదీమార్గాల అన్వేషణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జల పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు జలరవాణా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం బోటింగ్ టూరిజాన్ని మెరుగుపరుస్తూనే కొత్త జలవనరుల అన్వేషణకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్ పర్యాటక సంస్థ, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ సంయుక్తంగా పనిచేయనున్నాయి. ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా నీటివనరులు, బీచ్‌లను పరిశీలించి పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తిస్తుంది.

కొత్త నదీమార్గాల అన్వేషణ

రాజమహేంద్రవరం, విజయవాడ, నాగార్జునసాగర్, శ్రీశైలంలో పర్యాటకశాఖ ఎక్కువగా బోటింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వీటితోపాటు ఇతర ప్రాంతాల్లోను అంతర్గత బోట్ల సామర్థ్యాన్ని పర్యవేక్షిస్తూ బోటింగ్ రక్షణకు పెద్దపీట వేయనుంది. మరోవైపు చిన్నచిన్న బోట్ల దగ్గర నుంచి హౌస్ బోట్లు, క్రూయిజ్‌లను సైతం నడిపేలా, తీర్థస్థలాలు, వారసత్వ ప్రదేశాలను కలుపుతూ ఉండే నదీమార్గాలను అన్వేషిస్తోంది. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం కలిగిన ఏపీలో బీచ్‌లను ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దనుంది.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇలా..

ఈ కమిటీకి ఏపీటీడీసీ ఎండీ చైర్మన్‌గా, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ ఈడీ కో-చైర్మన్‌గా, ఏడుగురు సభ్యులతో ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఏపీ టూరిజం అథారిటీ డిప్యూటీ సీఈవో, ఏపీటీడీసీ ఈడీ (ప్రాజెక్ట్స్), జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్, దేవదాయశాఖ జాయింట్ కమిషనర్, ఏపీటీడీసీ వాటర్ ఫ్లీట్ జీఎంలతో పాటు ఏపీటీడీసీ, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ నుంచి ఒక్కో నామినేటెడ్ వ్యక్తి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఇతర రాష్ట్రాలతో పాటు బెల్జియం, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో పర్యటించి అక్కడి జల పర్యాటకం, రవాణా సౌకర్యాలను పరిశీలిస్తుంది. సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తుంది.

గోదావరి, కృష్ణాలోను..

జలమార్గం చౌకైన రవాణా కావడంతో కేంద్రప్రభుత్వం జలమార్గాల అభివృద్ధిపై దృష్టి సారించింది. దేశంలో 50.1 శాతం రోడ్డు, 36 శాతం రైల్వే, 6 శాతం సముద్ర, 7.5 శాతం పైప్‌లైన్ రవాణా వ్యవస్థలున్నాయి. జలమార్గ రవాణా 0.4 శాతం మాత్రమే ఉంది. దేశవ్యాప్తంగా 680 మైళ్ల పొడవైన జలమార్గం జాతీయ రహదారులను కలుపుతోంది. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి మీదుగా ప్రయాణిస్తోంది. కోరమాండల్ తీరం వెంబడి కాకినాడ, ఏలూరు, కొమ్మమూరు, బకింగ్‌హామ్ కాలువలున్నాయి. ఏపీలో కృష్ణా, గోదావరి నదులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ క్రమంలో జల పర్యాటకం, రవాణా ప్రోత్సాహకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి.

రాష్ట్రంలో డెల్టా కేసులే అధికం

- 2021 నుంచి రాష్ట్రంలో నాలుగు వేరియంట్‌లుగా కరోనా వ్యాప్తి
- వాటిలో అత్యధికం డెల్టా, దాని ఉపరకం కేసులే..
- బీఎఫ్–7 వేరియంట్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం
- ఇప్పటికే విమానాశ్రయాల్లో స్క్రీనింగ్, వైద్య పరీక్షలు

సాక్షి, అమరావతి: కరోనా వైరస్ తాజాగా ఒమిక్రాన్ బీఎఫ్–7 వేరియంట్ రూపంలో వివిధ దేశాల్లో వ్యాపిస్తోంది. మన దేశంలోనూ కొన్ని చోట్ల ఈ వేరియంట్ కేసులు ఇప్పటికే నమోదయ్యాయి. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకూ నమోదైన కరోనా వేరియంట్‌లను ఓసారి పరిశీలిస్తే.. డెల్టా, దాని ఉప వేరియంట్ కేసులే అత్యధికంగా ఉన్నాయి. రాష్ట్రంలో తొలి కరోనా కేసు 2020 మార్చి 9న నమోదైంది. ఇలా ఇప్పటి వరకూ 23.39 లక్షలకు పైగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కొత్త వేరియంట్‌లను పసిగట్టడం కోసం పాజిటివ్ వ్యక్తుల నమూనాలకు జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో 2021 నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రంలో నమోదైన పాజిటివ్ కేసులకు సంబంధించిన 11,498 నమూనాల సీక్వెన్సింగ్ చేపట్టారు. ఈ నేపథ్యంలో అల్ఫా, బీటా, డెల్టా, ఒమిక్రాన్ వేరియంట్‌ల కేసులు నమోదైనట్టు తేలింది. ఈ వేరియంట్‌లలో డెల్టా దాని ఉపరకం కేసులే అత్యధికంగా 6,635 ఉన్నాయి. ఆ తర్వాత ఒమిక్రాన్ బీ.1.1.529 వేరియంట్ కేసులు 1,669, ఒమిక్రాన్ ఉప రకాలకు సంబంధించిన వేరియంట్‌ల కేసులు 1,646 వెలుగు చూశాయి. అలాగే అల్ఫా వేరియంట్ కేసులు 1,097 ఉండగా, బీటా వేరియంట్ కేసులు 9 వెలుగు చూశాయి. ఈ రెండు వేరియంట్‌లు కూడా 2021లో మాత్రమే వెలుగు చూశాయి. ఈ ఏడాది వీటికి సంబంధించి ఒక్క కేసు కూడా నమోదుకాలేదు.

అవి ఒమిక్రాన్ వేరియంట్‌కు సంబంధించినవి..

తాజాగా 48 నమూనాలను జీనోమ్ ల్యాబ్‌లో పరీక్షించగా.. అన్నీ ఒమిక్రాన్‌కు సంబంధించినవిగా వెల్లడైంది. బీఎఫ్–7 వేరియంట్ వ్యాప్తి నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం ఇప్పటికే విమానాశ్రయాల్లో స్క్రీనింగ్, వైద్య పరీక్షలు మొదలు పెట్టింది. అంతర్జాతీయ విమానాల్లోని రెండు శాతం మంది ప్రయాణికుల నుంచి శాంపిళ్లు తీసుకుని పరీక్షిస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన వారికి పాజిటివ్‌గా తేలితే.. ఆ నమూనాలను తప్పనిసరిగా జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపాల్సిందిగా అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలకు ఇప్పటికే వైద్యారోగ్య శాఖ ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.